www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



నమో.. నారీ శక్తి

వన్డే ప్రపంచ కప్‌లో విజేతలుగా నిలిచిన భారత మహిళా క్రికెట్ జట్టు బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలుసుకుంది. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ కౌర్ బృందాన్ని అభినందించిన మోదీ.. ట్రోఫీ పట్టుకొని జట్టు సభ్యులతో ఫొటోలు దిగారు. అనంతరం క్రికెటర్లు తమ సంతకాలతో కూడిన 'నమో' పేరుమీదున్న జెర్సీని మోదీకి అందజేశారు.

గురువారం | 6-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 201 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ.2:55 తదుపరి విదియ, నక్షత్రం: భరణి ఉ.6:34, కృత్తిక తె 3:28, వర్జ్యం: సా.5:01-6:24, దుర్ముహూర్తం: ఉ.10:05-10:50, మ.2:37-3:22, అమృతఘడియలు: రా.1:22-2:46, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:19, సూర్యాస్తమయం: 5:37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ప్రభుత్వ బడి నుంచి విమానంలో విజ్ఞాన యాత్ర

వీళ్లంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ మంచి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు. జిల్లాకు ఇద్దరు చొప్పున మొత్తం 52 మందిని ఎంపిక చేసి ఇలా విమానంలో ఢిల్లీకి సైన్స్ టూర్‌కు పంపారు. వివరాలు 12లో..

క్వాంటమ్ వ్యాలీ.. వడివడిగా!

జనవరి 1న ప్రారంభోత్సవానికి సన్నాహాలు

50 వేల మంది విద్యార్థులకు మౌలిక క్వాంటమ్ నైపుణ్యాల్లో శిక్షణ

వీరిలో 3 వేల మందికి అత్యున్నత శిక్షణ.. 100 మంది ఉన్నత పరిశోధకుల తయారీ.. శాశ్వత టాలెంట్ హబ్ ఏర్పాటే లక్ష్యం

టీచింగ్ ల్యాబ్‌లపై 108 సంస్థల ప్రతిపాదనలు

197 వర్సిటీల్లో శిక్షణ పొందిన 1,056 మంది ఫ్యాకల్టీ సిద్ధం

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ వడివడిగా రూపుదిద్దుకుంటోంది. వచ్చే ఏడాది జనవరి 1న దీని ప్రారంభోత్సవానికి పెద్దఎత్తున సన్నాహాలు జరుగుతున్నాయి. పరస్పర సహకారం, గ్లోబల్ భాగస్వామ్యం ప్రాతిపదికన పలు అంతర్జాతీయ సాంకేతిక సంస్థలు జాతీయ స్థాయిలో తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. అంతర్జాతీయ స్థాయిలో తొలి ఐదు క్వాంటమ్ హబ్‌లలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఒకటిగా నిలుస్తుందని తెలిపాయి. రాష్ట్రం సంపూర్ణంగా క్వాంటమ్ సేవలను అందించే కేంద్రంగా మారుతుందని విశ్వాసం వ్యక్తంచేశాయి. సెమీకండక్టర్ల తయారీ, వినియోగం, కృత్రిమ మేధ ఆధారిత సేవలు, భవిష్యత్ తరాలకు ఏఐ/ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, ఆర్ఎఫ్ ఇంజనీరింగ్,

మిగతా 12వ పేజీలో...

2 జిల్లాలు 7 డివిజన్లు



స్పష్టత దిశగా మంత్రివర్గ ఉపసంఘం

కొత్తగా మదనపల్లె, మార్కాపురం జిల్లాలు!

డివిజన్లుగా నక్కపల్లి, అద్దంకి, మడకశిర, బనగానపల్లె, పీలేరు, అవనిగడ్డ, గిద్దలూరు?

'కందుకూరు' మళ్లీ ప్రకాశం జిల్లాలోకి!

పలు మండలాల 'జిల్లాలు' మార్పు


పరిమితంగానే పునర్ వ్యవస్థీకరణ

పాలనా సౌలభ్యం, చిరకాల డిమాండ్ల పరిశీలన

ఉపసంఘంలో రెవెన్యూ శాఖ ప్రజెంటేషన్

డివిజన్లపై మరింత స్పష్టత రావాలన్న మంత్రులు

మరోసారి సమావేశమవుతాం: మంత్రి అనగాని



ప్రతిపాదిత జిల్లాలు.. వాటి పరిధిలోకొచ్చే రెవెన్యూ డివిజన్లు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూ శాఖలు స్పష్టత నిచ్చాయి. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఉన్న మార్కాపురం, చిత్తూరు జిల్లాలోని మదనపల్లెను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి వచ్చాయి. జిల్లాలు, డివిజన్ల పునర్‌వ్యవస్థీకరణపై బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం మరోసారి సమావేశమైంది. ఇప్పటిదాకా వచ్చిన ప్రతిపాదనలు, వాటిలోని సాధ్యాసాధ్యాలు, శాఖాపరమైన సూచనలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ(ఇన్‌చార్జి) జి.సాయిప్రసాద్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీని ప్రకారం... కొత్తగా రెండు జిల్లాలు, ఏడు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను పరిశీలించారు. దీని ప్రకారం... పీలేరు, మదనపల్లె రెవెన్యూ డివిజన్లతో 'మదనపల్లె జిల్లా'ను ఏర్పాటు చేసే అవకాశముంది. ఇందులో మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలు ఉండే అవకాశముంది. మదనపల్లె రాష్ట్రంలోనే అతిపెద్ద డివిజన్. కొత్తగా పీలేరును కూడా డివిజన్‌గా చేయాలన్న ప్రతిపాదన రెవెన్యూ శాఖ నుంచే వచ్చింది. పలమనేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, చిత్తూరు డివిజన్‌లోని కొన్ని మండలాలతో

మిగతా 13వ పేజీలో...

పోలవరం ముంపు మండలాలతో ప్రత్యేక అథారిటీ!

కొత్త జిల్లా ఏర్పాటుతో అనేక సమస్యలు

పైగా చిన్న జిల్లా అవుతుందని రెవెన్యూ అధికారుల మనోగతం 13

స్పెసిఫైడ్ అథారిటీ ఏర్పాటుచేసి పూర్తి అధికారాలివ్వడానికి మంత్రులు ఓకే

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం



ఒంగోలులో ఏసీబీ దాడుల సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం బయటకు విసిరేసిన నగదును లెక్కిస్తున్న అధికారులు

పరుగో పరుగు

12 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

ఆళ్లగడ్డ కార్యాలయానికి ఏసీబీ రావడంతోనే సామగ్రి వదిలి డాక్యుమెంట్ రైటర్లు పరార్

'ఒంగోలు'లో డబ్బులు విసిరేసిన కొందరు

వాష్‌రూమ్ నుంచి నగదు స్వాధీనం

లంచం ఫిర్యాదులు ఎక్కువవడంతో జూలు విదిల్చిన ఏసీబీ అధికారులు

తలుపులు మూసి.. సెల్‌ఫోన్లు తీసుకుని.. రాత్రి వరకు సోదాలు.. ఉలిక్కిపడ్డ ఎస్ఆర్‌వోలు

రూ.10 వేల నుంచి 75 వేల వరకు లెక్క చూపని నగదు లభ్యం.. నేడూ సోదాలు

మెరుపు దాడుల వెనుక మర్మం?!

రిజిస్ట్రేషన్ల శాఖలో అసలేం జరుగుతోంది?

కొన్ని ఆఫీసుల్లో లంచం చిన్న మాట.. అంతకుమించి అక్రమాలకు అడ్డాలవి

సస్పెన్షన్ వేటు పడకుండా భారీగా బేరాలు

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై వరుస ఫిర్యాదులు అందుతుండటంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఒక్కసారిగా జూలు విదిల్చింది. రాష్ట్రంలోని కీలకమైన 12సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టింది. విజయనగరం నుంచి చిత్తూరు వరకూ పలు జిల్లాల్లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాల్లో లెక్కకుమించి నగదుతోపాటు రిజిస్ట్రేషన్లలో అక్రమాలు, డాక్యుమెంట్లలో తేడాలు బయటపడ్డాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో పెదగంట్యాడ, మధురవాడ, జగదాంబ సెంటర్ ఆఫీసుల్లో సోదాలు జరిపారు. అలాగే, విజయనగరం జిల్లా భోగాపురం, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, పల్నాడు జిల్లా నరసరావుపేట, ప్రకాశం జిల్లా ఒంగోలు, నెల్లూరు జిల్లా స్టోన్ హౌస్ పేట, తిరుపతి జిల్లా రేణిగుంట, సత్యసాయి జిల్లా చిలమత్తూరు; అన్నమయ్య జిల్లా రాజంపేట, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డల్లో

మిగతా 14వ పేజీలో...



బుధవారం పట్నా నుంచి ఎన్నికల విధులకు బయలుదేరిన మహిళా భద్రతా సిబ్బంది

బిహార్‌లో తొలి విడత పోలింగ్ నేడే

121 అసెంబ్లీ స్థానాలు

1,314 మంది అభ్యర్థులు

తేజస్వి, తేజ్‌ప్రతాప్, సామ్రాట్ చౌధురి సహా కీలక నేతలు

3.75 కోట్ల మంది ఓటర్ల చేతిలో నేతల భవితవ్యం 2

'సర్' తర్వాత తొలి ఎన్నికలివే!

న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ



గజాలా హష్మి

డెమొక్రాట్ అభ్యర్థి ఘన విజయం

భారత అమెరికన్ దర్శకురాలు మీరానాయర్ కుమారుడే జోహ్రాన్

మరో 2 చోట్లా భారత సంతతి నేతల గెలుపు

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హష్మి

హైదరాబాద్‌లో పుట్టి.. నాలుగున్నరేళ్ల వయసులో యూఎస్ వెళ్లిన గజాలా

సిన్సినాటి పట్టణ మేయర్‌గా పంజాబీ ఆఫ్తాబ్

మమ్దానీ గెలుపుతో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

స్థానిక ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ ఆధిపత్యం

బ్యాలట్ పేపర్‌పై నా ఫొటో లేకే ఓటమి: ట్రంప్

'ట్రంప్.. సౌండ్ పెంచుకుని చూడు' అంటూ మమ్దానీ ప్రసంగం

న్యూయార్క్/వాషింగ్టన్, నవంబరు 5: అమెరికాలోని న్యూయార్క్ నగర మేయర్‌గా భారత సంతతి అమెరికన్ జోహ్రాన్ మమ్దానీ ఘన విజయం సాధించారు. డెమొక్రాట్ పార్టీ అభ్యర్థి అయిన మమ్దానీని ఓడించేందుకు రిపబ్లికన్ పార్టీకి చెందిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లభించలేదు. 34 ఏళ్ల మమ్దానీ న్యూయార్క్ నగర మేయర్ అయిన అతిపిన్న

మిగతా 2వ పేజీలో...

హరియాణాలోనూ ఓట్ చోరీ

25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ మా గెలుపును దొంగిలించింది



'ఆపరేషన్ సర్కార్ చోరీ'లో ప్రధాని మోదీ, అమిత్ షాతో సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కుమ్మక్కయ్యారు 2

ఓటరు జాబితాలో బ్రెజిల్ మోడల్ ఫొటోతో 22 ఓట్లు

ఒక నియోజకవర్గంలో ఒకే మహిళ ఫొటోతో 100 ఓట్లు

హెచ్ ఫైల్స్ పేరిట.. 'హైడ్రోజన్ బాంబ్' పేల్చిన రాహుల్

రాహుల్‌వి తప్పుడు ఆరోపణలని కొట్టిపారేసిన బీజేపీ

పట్టాలు దాటుతూ..

రైలు కింద పడి ఆరుగురి దుర్మరణం 2

యూపీలో విషాదం

పరకామణి చోరీ కేసు.. సీఐడీ దర్యాప్తు ప్రారంభం

నిందితుడితో సంబంధాలున్న ప్రతి ఒక్కరికీ నోటీసులు జారీ 13

ఆ ఐదేళ్లూ రైతులకు నరకం

జగన్ ప్రభుత్వంలో పరిహారం ఇస్తే ధాన్యం కొనుగోళ్లు బంద్ 2

తడిసిన ధాన్యం కొనకుండా నిబంధన

గతం మరిచి కూటమిపై జగన్ నిందలు



మేం అందరి ధాన్యం కొంటాం

పరిహారం పొందినా రైతుసేవా కేంద్రాల్లో విక్రయించుకోవచ్చు

పౌరసరఫరాల శాఖ స్పష్టీకరణ

రూ.4000 కోట్ల ఢిల్లీ హౌసింగ్ సొసైటీ స్కాం కేసు..

మాజీ ఐఏఎస్‌కు 5 ఏళ్ల జైలుశిక్ష

» మరో 12 మందికి శిక్షలు ఖరారు

న్యూఢిల్లీ, నవంబరు 5: దాదాపు నాలుగు వేల కోట్ల ఢిల్లీ హౌసింగ్ సొసైటీ కుంభకోణంలో.. మాజీ ఐఏఎస్ సహా 13 మంది నిందితులకు ఢిల్లీ కోర్టు శిక్షలు ఖరారు చేసింది. వీరికి ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్షలు విధించినట్లు ప్రకటించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు 2006లో సీబీఐ ఈ కేసు విచారణ ప్రారంభించగా, దాదాపు 25సంవత్సరాల తర్వాత ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ప్రశాంత్ వర్మ అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద నిందితులకు శిక్షలు విధించారు. తీర్పు సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, అవినీతిని ఉక్కుపాదంతో అణిచివేయాలన్నారు. అవినీతిని సమాజ ఆరోగ్యానికి ముప్పు ను కలిగించే క్యాన్సర్‌తో పోల్చిన ఆయన, నయం చేయడానికి కీమోథెరపీ వంటి కఠినమైన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. కేసు నేపథ్యాన్ని పరిశీలిస్తే, 1999లోనే మూతపడిన సఫ్దర్‌గంజ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని కొందరు అధికారులు పునరుద్ధరించి, ప్రభుత్వం నుంచి తక్కువ ధరకే భూమిని కాజేయడానికి ప్రయత్నించారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఈ స్కాంలో అప్పటి ఐఏఎస్ నరేందర్ కుమార్‌కు కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.

యూపీలో పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తూ..

రైలు కింద పడి ఆరుగురి దుర్మరణం

మిర్జాపూర్, నవంబరు 5: ఉత్తరప్రదేశ్‌లో ఘోరం జరిగింది. రైల్లోంచి దిగిన ప్రయాణికుల్లో కొందరు, రాంగ్ సైడ్ నుంచి పట్టాలను దాటేందుకు ప్రయత్నిస్తూ ఆ వైపు దూసుకొచ్చిన మరో రైలు కింద నలిగిపోయారు. మిర్జాపూర్ జిల్లాలోని చునార్ జంక్షన్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. మృతులంతా మహిళలే! వారిలో ఇద్దరు బాలికలున్నారు. ఉదయం 9:30కు స్టేషన్‌లోని నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై చోపన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగింది. చునార్ సమీపంలోని గంగానదిలో కార్తీక స్నానాలు చేసేందుకు మీర్జాపూర్ నుంచి బయలుదేరిన యాత్రికులు ఆ రైల్లోంచి కిందకు దిగారు. అక్కడి నుంచి బయటకొచ్చేందుకు ప్రయాణికుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి అందుబాటులో ఉన్నా కొందరు నేరుగా పట్టాలు దాటేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో హౌరా నుంచి కల్కాజీ వెళుతున్న నేతాజీ ఎక్స్‌ప్రెస్ రైలు యాత్రికుల మీద నుంచి దూసుకెళ్లింది.

మెక్సికో అధ్యక్షురాలికి లైంగిక వేధింపులు!



మెక్సికో సిటీ, నవంబరు 5: మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బాన్‌కు మంగళవారం షాకింగ్ ఘటన ఎదురైంది. ఆమెపై ఓ వ్యక్తి పట్టపగలు బహిరంగంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. షీన్‌బాన్ దేశ రాజధాని మెక్సికో సిటీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రోడ్డుపక్కన ఉన్నవారిని కలిసి ముచ్చటిస్తుండగా.. ఓ వ్యక్తి ఆమె వెనక నుంచి వచ్చి ఆమెను పట్టుకొని ముద్దు పెట్టేందుకు ప్రయత్నించాడు. ఆమెను అసభ్యంగా తాకేందుకూ యత్నించాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి దుండగుడిని వెనక్కి లాగారు.

రూ.1.68 లక్షల కోట్ల మహిళా పథకాలు

» మహిళల సంక్షేమ ఖర్చే అత్యధికం.. అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 5: మహిళలు కేంద్రంగా అమలు చేస్తున్న నగదు బదిలీ (యూసీటీ) పథకాలతో రాష్ట్రాల ఆర్థికవ్యవస్థలు కుదేలవుతున్నాయని, మిగులులో ఉండే రాష్ట్రాల రెవెన్యూ కాస్తా లోటులోకి జారిపోతోందని ఓ అధ్యయనంలో తేలింది. మూడేళ్ల క్రితం రెండు రాష్ట్రాలకే పరిమితమైన ఈ తరహా పథకాల అమలు ఇప్పుడు 12 రాష్ట్రాలకు విస్తరించిందని, ప్రస్తుత బడ్జెట్‌లో ఈ రాష్ట్రాలు మొత్తం రూ.1.68 లక్షల కోట్లు (1.68 ట్రిలియన్లు) దీనికోసం వెచ్చించనున్నాయని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ పథకాలను అమలుచేస్తున్నవాటిలో ఆరు రాష్ట్రాలు ఈ ఏడాది రెవెన్యూలోటును నమోదు చేశాయని చెబుతూ.. పెరిగిన యూసీటీల విస్తృతి ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందనేందుకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించింది.

న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ

(మొదటి పేజీ తరువాయి)

వయస్కుడిగా, తొలి భారతీయ అమెరికన్ ముస్లింగా, తొలి దక్షిణాసియా సంతతి వ్యక్తిగా రికార్డులు సృష్టించారు. జనవరి 1న మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. మరో భారతీయ అమెరికన్ ముస్లిం గజాలా హష్మి వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా, భారతీయ అమెరికన్ పంజాబీ ఆఫ్తాబ్ కర్మ సింగ్ పురేవల్ సిన్సినాటి పట్టణ మేయర్‌గా విజయం సాధించారు. ముగ్గురూ డెమొక్రాట్ పార్టీ తరఫునే గెలవడం విశేషం. న్యూయార్క్‌తోపాటు న్యూజెర్సీ, వర్జీనియా, సిన్సినాటిలలో జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్లే విజయం సాధించడంపై ఆ పార్టీకి చెందిన అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, ఒబామా హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పెద్ద విజయాలు సాధిస్తామని ప్రకటించారు.

ట్రంప్‌ను ఎండగడుతూ..

జోహ్రాన్ మమ్దానీ తల్లి ప్రముఖ భారతీయ అమెరికన్ దర్శకురాలు మీరా నాయర్, తండ్రి ఉగాండాలో స్థిరపడిన గుజరాతీ ముస్లిం మహమ్మద్ మమ్దానీ. ఉగాండాలోనే 1991లో జన్మించిన జోహ్రాన్ మమ్దానీ తల్లిదండ్రులతో కలిసి ఏడేళ్ల వయసులో అమెరికాకు వచ్చారు. సామ్యవాదాన్ని అనుసరిస్తానని చెప్పే జోహ్రాన్ మమ్దానీ.. న్యూయార్క్ నగరంలో పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమమే లక్ష్యమని ప్రకటించారు. న్యూయార్క్ నగరంలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తానని ప్రకటించారు. నెలల పిల్లల నుంచి ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లల ఆలనాపాలనా చూసుకునేందుకు ఉచిత చైల్డ్ డే కేర్ సెంటర్లు ప్రారంభిస్తానని మరో హామీ ఇచ్చారు. సంపన్నులపై, కార్పొరేట్ సంస్థలపై పన్నులు పెంచుతానని.. ఇళ్ల అద్దెలపై నియంత్రణ విధిస్తానని హామీనిచ్చి పేదలను ఆకట్టుకున్నారు. అదే సమయంలో ట్రంప్ అమలు చేస్తున్న వలస వ్యతిరేక విధానాలను జోహ్రాన్ విపరీతంగా ఎండగట్టారు.

నిధులు ఇవ్వనని ట్రంప్ బెదిరించినా..

న్యూయార్క్‌లో డెమొక్రాట్ పార్టీకి బలం ఎక్కువగా ఉండటంతో.. మమ్దానీ గెలిచే అవకాశం ఉందని ముందునుంచే అంచనాలు వెలువడ్డాయి. దీనితో న్యూయార్క్‌కు చెందిన ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగి, రిపబ్లికన్ అభ్యర్థి కర్టిస్ స్లివా తరఫున ప్రచారం చేశారు. మమ్దానీ గెలిస్తే న్యూయార్క్ నగరానికి అందే ఫెడరల్ (కేంద్ర) నిధుల్లో కోత పెడతానని హెచ్చరించారు. గతంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండించిన మమ్దానీని యూదు వ్యతిరేకుడని ట్రంప్ ప్రచారం చేశారు. న్యూయార్క్‌లో యూదు జనాభా గణనీయంగా ఉన్న నేపథ్యంలో.. మమ్దానీకి మద్దతు ఇచ్చే యూదులు మూర్ఖులని వ్యాఖ్యానించారు. అయినా మమ్దానీకే మద్దతు లభించింది. కాగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులు ఓడిపోవడంపై ట్రంప్ స్పందించారు. బ్యాలెట్ పేపర్‌పై తన ఫొటో లేకపోవడం, బడ్జెట్ ఆమోదం పొందక ప్రభుత్వ ప్రతిష్టంభన కొనసాగుతుండటమే ఓటమికి కారణాలని పేర్కొన్నారు.



తల్లిదండ్రులు, భార్యతో జోహ్రాన్ మమ్దానీ

నెహ్రూ సూక్తులు.. ట్రంప్‌కు సవాళ్లు!

న్యూయార్క్ మేయర్‌గా విజయం సాధించిన తర్వాత జోహ్రాన్ మమ్దానీ ఆవేశంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. తన భార్య రమా దువాజీ, తల్లిదండ్రులు పక్కన ఉండగా, వేదికపై 25 నిమిషాల పాటు మాట్లాడారు. న్యూయార్క్ ఎన్నిక ఫలితాలు కొత్త తరహా రాజకీయాలకు నాంది పలికాయని చెప్పారు. భారత ప్రథమ ప్రధాని నెహ్రూ మాటలను గుర్తుచేసుకుంటూ.. "చరిత్రలో అరుదుగా ఇలాంటి సందర్భాలు వస్తాయి. ఒక శకం ముగిసినప్పుడు.. పాతశకాన్ని వదిలి కొత్త శకాన్ని అనుసరించినప్పుడు.. సుదీర్ఘంగా అణచివేతకు గురైన జాతి గళం విప్పినప్పుడు.. ఇలాంటి క్షణాలు వస్తాయి. ఇప్పుడు మనం ఒక నవ శకంలోకి అడుగుపెడుతున్నాం" అని పేర్కొన్నారు. వలసవాదులకు తాను అండగా నిలిచిపోరాడుతానని ప్రకటించారు. అదే సమయంలో అధ్యక్షుడు ట్రంప్‌కు సవాళ్లు విసిరారు. "ట్రంప్.. మీరు ఇది చూస్తున్నారని నాకు తెలుసు. సౌండ్ పెంచుకుని నా మాటలు వినండి. దేశాన్ని వంచించిన ట్రంప్‌ను ఎలా ఓడించాలన్న దానిని ఆయన పెరిగిన న్యూయార్క్ చేసి చూపించింది. ఒక నియంతను అతనికి అధికారాన్ని అందించిన పరిస్థితులను మార్చడంతోనే భయపెట్టగలం. ఇది ట్రంప్‌ను ఆపేందుకు మాత్రమే కాదు. ఆయనలా తర్వాత వచ్చే వారిని ఆపేందుకు కూడా.. ట్రంప్ వంటి బిలియనీర్లు పన్నులను తప్పించుకునేందుకు, రాయితీలను అక్రమంగా పొందేందుకు వీలు కల్పించే అవినీతి సంస్కృతికి ముగింపు పలుకుతాం. వలసదారులకు, కార్మికులకు అండగా నిలుస్తాం. వలసవాదులు నిర్మించిన, వలసదారులు నడిపిస్తున్న నగరంగా న్యూయార్క్ ఉంటుంది. మీరు వలసదారులు కావొచ్చు, ట్రంప్ ఉద్యోగాల్లోంచి తొలగించిన నల్లజాతి మహిళలైనా, కనీస అవసరాలు తీర్చుకునేందుకు అల్లాడుతున్న తోడులేని తల్లి అయినా.. మీ సమస్య ఇప్పుడు మా సమస్య కూడా. ఇకపై ఇది ఇస్లామోఫోబియాను రాజకీయ ఆయుధంగా వాడుకునేవారి ప్రాంతం కాదు. పది లక్షలకుపైగా ముస్లింలు ఉన్న ఈ ప్రాంతం పాలనలోనూ వారికి చోటు ఉందని తెలుసుకుంటారు. అధ్యక్షుడు ట్రంప్ శ్రద్ధగా వినండి. మీరు మాలో ఎవరినైనా ఏమైనా చేయాలి అంటే.. ముందు మా అందరినీ దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది" అని జోహ్రాన్ మమ్దానీ పేర్కొన్నారు. స్థానికులతోపాటు దేశ విదేశాల నుంచి వచ్చిన వలసదారులకు ధన్యవాదాలు తెలిపారు.

టిబెట్ తల్లి.. పంజాబీ తండ్రి..



ఆఫ్తాబ్ కర్మసింగ్ పురేవాల్ కూడా చిన్న వయసులో తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చినవారే. ఆయన తల్లి చైనా ఆక్రమణ సమయంలో టిబెట్ నుంచి భారత్‌కు శరణార్థిగా వచ్చారు. భారత్‌లోనే చదువుకున్నారు. పంజాబీ వ్యక్తి పురేవాల్‌ను వివాహం చేసుకున్నారు. కర్మసింగ్ జన్మించిన తర్వాత కొన్నేళ్లకు ఆ కుటుంబం అమెరికాలోని ఓహియోకు వెళ్లి స్థిరపడింది. అమెరికాలో తమ కుమారుడి జీవితం ఉజ్వలంగా ఉండాలన్న ఆకాంక్షతో ఆఫ్తాబ్ అని పేరుపెట్టారు. పర్షియన్‌లో ఆ పదానికి 'సూర్యకాంతి' అని అర్థం. పొలిటికల్ సైన్స్, న్యాయశాస్త్రం చదివిన ఆఫ్తాబ్ పురేవాల్.. 2021లోనే సిన్సినాటి పట్టణ మేయర్‌గా ఎన్నికయ్యారు. తాజాగా రిపబ్లికన్ అభ్యర్థి కోరీ బోమాన్‌పై విజయం సాధించారు.

ప్రఖ్యాత దర్శకురాలు మీరా నాయర్ కుమారుడే..

న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ తల్లి ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్. 1957లో ఒడిసాలో అమృత్‌లాల్ నాయర్ (ఐఏఎస్), ప్రవీణ్ నాయర్ దంపతులకు జన్మించారు. పాఠశాల విద్య ఇక్కడే చదివిన ఆమె.. అమెరికాలోని హార్వర్డ్ వర్సిటీలో స్కాలర్‌షిప్ సాధించి 'విజువల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. 1977లో ఫొటోగ్రాఫర్ మిచ్ ఎప్‌స్టెన్‌తో వివాహమైనా, కొన్నాళ్లకే విడాకులు తీసుకున్నారు. తర్వాత భారత్‌లో జన్మించి ఉగాండాలో స్థిరపడిన మహ్మద్ మమ్దానీని పెళ్లి చేసుకున్నారు. వారికి 1991లో జోహ్రాన్ పుట్టారు. మీరా నాయర్ తొలి చిత్రం 'సలామ్ బాంబే' 1988లో విడుదలైంది. వీధి బాలల జీవితాన్ని హృద్యంగా ఆవిష్కరించిన ఆ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అయింది కూడా. ఆ తర్వాత 1991లో ఇండో అమెరికన్ అమ్మాయి, ఆఫ్రికన్ అబ్బాయి ప్రేమకథతో 'మిస్సిస్సిప్పీ మసాలా' చిత్రం తీశారు. 2001లో ఆమె రూపొందించిన 'మాన్‌సూన్ వెడ్డింగ్' చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు, అవార్డులు దక్కించుకుంది. మమ్దానీ న్యూయార్క్ మేయర్ అయ్యారని తెలియగానే హాలీవుడ్, బాలీవుడ్ సినీ ప్రముఖుల నుంచి ఆమెకు అభినందనలు వెల్లువెత్తాయి.

లోకం తీరు



హైదరాబాద్‌లో పుట్టి అమెరికాలో చరిత్ర సృష్టించి..

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికైన గజాలా ఫిర్దౌస్ హష్మి హైదరాబాద్‌లో జన్మించారు. నాలుగేళ్ల పాటు మలక్‌పేటలోని అమ్మమ్మ, తాత వద్ద పెరిగారు. తర్వాత కుటుంబంతో పాటు అమెరికాకు వెళ్లారు. ఆమె తాత రాష్ట్ర ఫైనాన్స్ శాఖలో పనిచేసేవారు. తండ్రి జియా హష్మీ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి పీహెచ్‌డీ కోసం అమెరికాలో వెళ్లి సౌత్ కరోలినా యూనివర్సిటీలో చేరారు. పూర్తయ్యాక అక్కడే అధ్యాపకుడిగా చేరారు. జార్జియా సదరన్ యూనివర్సిటీ డైరెక్టర్ పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. తల్లి తన్వీర్ హష్మి ఉస్మానియా యూనివర్సిటీ విమెన్స్ కాలేజీ (నేటి కోఠి మహిళా యూనివర్సిటీ)లో డబుల్ డిగ్రీ చదివారు. గజాలా హష్మి అమెరికాలోని జార్జియా సదరన్ వర్సిటీలో బీఏ హానర్స్, అమెరికా సాహిత్యంపై పీహెచ్‌డీ చేశారు. రిచ్‌మండ్ యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా పనిచేశారు. ప్రస్తుతం గజాలా ఫిర్దౌస్ హష్మి వయసు 61 ఏళ్లు.

హరియాణాలోనూ ఓట్ చోరీ

25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ

మా గెలుపును దొంగిలించింది: రాహుల్

న్యూఢిల్లీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): "బీజేపీ నేతల్లారా సిద్ధంగా ఉండండి.. ఆటంబాంబు తర్వాత హైడ్రోజన్ బాంబు రాబోతోంది. మీ ఓట్ల చోరీ బండారాన్ని దేశప్రజల ముందు బయటపడతాం" ..అని కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ ఈ ఏడాది సెప్టెంబరు 1న బిహార్‌లో 'ఓటర్ అధికార్ ర్యాలీ'లో ప్రకటించిన సంగతి గుర్తుందా? దేశప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూసిన ఆ హైడ్రోజన్ బాంబును ఆయన.. బిహార్‌లో ఎన్నికలకు ఒక్కరోజు ముందు.. బుధవారం ఇక్కడ 'ద హెచ్ ఫైల్స్' పేరిట నిర్వహించిన మీడియా సమావేశంలో పేల్చారు. గత ఏడాది జరిగిన హరియాణా శాసనసభ ఎన్నికల్లో 25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ గెలిచిందని.. ఆ ఎన్నికను చోరీ చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. హరియాణాలో కాంగ్రె‌స్‌కు దక్కాల్సిన ఘనవిజయాన్ని ఓటమిగా మార్చడం కోసం చేపట్టిన 'ఆపరేషన్ సర్కార్ చోరీ'కి.. ఈసీ కూడా సహకరించిందని.. ప్రధాని మోదీ, అమిత్‌షాలతో, బీజేపీతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. హరియాణా ఓటరు జాబితాలో 25,41,144 మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. 5,21,619 డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని.. 93,174 మంది ఓటర్ల చిరునామాలు తప్పుగా ఉన్నాయని.. 1,24,177 నకిలీఫొటోలు ఓటర్ ఐడీల్లో ఉన్నాయని పేర్కొన్నారు. "హరియాణాలో ఓటర్ల సంఖ్య 2 కోట్లు. 25 లక్షల నకిలీ ఓట్లంటే.. ప్రతి 8మంది ఓటర్లలో ఒకరు నకిలీ ఓటరు. మొత్తం ఓటర్ల సంఖ్యలో 12.5 శాతం" అని ధ్వజమెత్తారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ఎగ్జిట్ పోల్స్ చెప్పినప్పటికీ.. చివరికి బీజేపీ గెలిచిందని గుర్తుచేశారు. బీజేపీ ఆ ఎన్నికల్లో ఓట్లచోరీకి పాల్పడిందనడానికి నిదర్శనంగా.. "ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. బీజేపీ గెలవబోతోంది" అంటూ బీజేపీ నేత, హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ చేసిన వ్యాఖ్యల వీడియోను రాహుల్ ప్రదర్శించారు. "అందరూ కాంగ్రెస్ గెలుస్తుందంటున్న సమయం అది. కానీ ఈ పెద్ద మనిషి (నాయబ్‌సింగ్ సైనీ) మాత్రం గెలుపుపై నమ్మకంతో ఉన్నారు. బీజేపీ ఏర్పాట్లు చేసిందని నవ్వుతూ చెప్పారు" అని మండిపడ్డారు. పోస్టల్ ఓటింగ్ ఫలితాలు అసలు ఫలితాలకు భిన్నంగా ఉండడం హరియాణా చరిత్రలోనే తొలిసారి అని పేర్కొన్నారు. 100శాతం రుజువులతో తాను ఈ ఆరోపణలు చేస్తున్నానని.. కాంగ్రెస్ దక్కాల్సిన ఘన విజయాన్ని నష్టంగా మార్చడానికి ఒక ప్రణాళికను అమలు చేశారని దుయ్యబట్టారు. 8 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అత్యంత స్వల్ప తేడాతో ఓడిపోయిందని.. ఒకచోట 32ఓట్ల తేడాతో పరాజయంపాలైందని.. కేవలం 22,779 ఓట్ల తేడాతో మొత్తంగా హరియాణా ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు.

ఒకే మహిళ.. పేర్లు వేరే..

రాహుల్ తన ఆరోపణలకు ఆధారంగా.. రాయ్ అసెంబ్లీ నియోజకవర్గం ఓటరు జాబితాలో ఒకే మహిళ ఫొటోతో ఉన్న 22 ఎంట్రీలను చూపించారు. "ఇది బ్రెజిల్‌కు చెందిన ఒక మోడల్ ఫొటో. ఏదో వెబ్‌సైట్ నుంచి ఈ ఫొటోను ఉచితంగా డౌన్‌లోడ్ చేసి ఉంటారు. ఓటరు జాబితాలో ఈ ఫొటో స్వీటీ, సీమ, సరస్వతి, రష్మి, విమల.. ఇలా వేర్వేరు పేర్లతో 22సార్లు కనిపించింది" అని రాహుల్ మండిపడ్డారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 పోలింగ్ బూత్‌ల్లో ఆ మహిళ ఓటు వేసిందని, ఆమె ఓట్లు వేసిన స్థానాల్లో తమ పార్టీ ఓడిపోయిందన్నారు. అలాగే.. ఒకే నియోజకవర్గంలో ఒకే మహిళ ఫొటోతో 100 ఓటర్ కార్డులు ఉన్న విషయాన్నీ రాహుల్ ప్రజల దృష్టికి తెచ్చారు. "ఈ మహిళ.. కావాలంటే హరియాణాలో 100సార్లు ఓటు వేయొచ్చు. బీజేపీ వాళ్లు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వచ్చి ఓటు వేసే అవకాశం కల్పించడానికే ఇలా చేశారు. మరో మహిళ ఫొటో రెండు పోలింగ్ బూత్‌ల పరిధిలో ఏకంగా 223సార్లు కనిపించిందన్నారు. హోడల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్‌కు చెందిన ఇంట్లో 66మంది ఓటర్లున్నారని, అదే నియోజకవర్గంలో ఒక ఇంట్లో 501 మందికి ఓటు హక్కు ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన అనేక మందికి హరియాణాలోనూ ఓటు హక్కు ఉందని తెలిపారు. ఇళ్లులేని వాళ్లకు ఇంటి నంబరుగా జీరోను కేటాయిస్తామని దేశ ప్రజలకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అబద్ధాలు చెబుతున్నారని, ఆ ఇళ్ల పేరుతో ఏం జరుగుతోందో ఇప్పుడు అందరికీ తెలిసిపోయిందన్నారు. "డూప్లికేట్ ఓట్లను ఎన్నికల కమిషన్ ఒక్క సెకనులో తీసేయగలదు. కానీ వాళ్లు అలా ఎందుకు చేయట్లేదు? కారణం.. వారు బీజేపీకి సహాయం చేస్తున్నారు"అని రాహుల్ అన్నారు. ఎన్నికలకు ముందు 3.5 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కాగా హరియాణా ఎన్నికల్లో తమ పార్టీ అక్రమాలకు పాల్పడిందంటూ రాహుల్ చేసిన ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ ఎలాంటి ఆధారాలూ లేని తప్పుడు ఆరోపణలని కొట్టిపారేసింది. రాహుల్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, దేశ ప్రజాస్వామ్యాన్ని అపఖ్యాతిపాలు చేయడానికి ఎన్నికల కమిషన్‌పై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని కేంద్రమంత్రి కిరెన్ రిజిజు మండిపడ్డారు.

ఇంతకీ ఎవరా మోడల్?

మీడియా సమావేశంలో రాహుల్ ప్రస్తావించిన బ్రెజిలియన్ మోడల్ ఎవరా అని చాలా మంది ఆరా తీశారు. రాహుల్ చూపిన ఫొటోలో 'మాథ్యూస్ ఫెర్రెరో' అనే పేరు ఉండడంతో.. ఆ పేరుతో గూగుల్‌లో శోధించగా ఆయన ఒక ఫొటోగ్రాఫర్ అని తేలింది. ఆయన పోర్ట్‌ఫోలియోలో ఈ మోడల్ ఫొటో కూడా ఉందిగానీ.. ఆమె పేరు మాత్రం లేదు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ఆ ఐదేళ్లూ రైతులకు నరకం

» జగన్ ప్రభుత్వంలో పరిహారం ఇస్తే ధాన్యం కొనుగోళ్లు బంద్

» గతం మరచి కూటమిపై జగన్ నిందలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మొంథా తుపాన్ బాధితుల పరామర్శకు కృష్ణా జిల్లా వెళ్లిన వైసీపీ అధినేత జగన్ రైతులపై ఎనలేని ప్రేమ ఒలకబోశారు. 'నష్టపరిహారం ఇస్తే ధాన్యం కొనరంట.. రైతుల్ని ప్రభుత్వం బ్లాక్ మెయిల్ చేస్తోంది' అంటూ కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. ఎన్యూమరేషన్ కొనసాగుతున్న సమయంలో రైతుల్ని ఆందోళనకు గురిచేసేలా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొత్తగా ఈ ఆంక్షలు పెట్టినట్లుగా జగన్ ఆరోపించారు. వాస్తవానికి ఈ నిబంధనను గత ప్రభుత్వమే అమలు చేసింది. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తే.. ఆ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుండా ఆంక్షలు పెట్టింది. తడిసిన వరి ధాన్యాన్ని కొనాల్సి వస్తుందని ప్రభుత్వ పెద్దల మౌఖిక ఆదేశాలతోనే అప్పటి అధికారులు ఈ ఆంక్షలను అమలు చేశారు. జగన్ ఈ విషయం మరిచి కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారు. 2019-24 మధ్య అనేక సార్లు అధిక వర్షాలు కురిసినప్పుడు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. గత ప్రభుత్వం కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోలేదు. ఎఫ్‌సీఐ మార్గదర్శకాల పేరుతో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని చాలా వరకు కొనుగోలు చేయలేదు. పైగా ధాన్యం కొనాల్సి వస్తుందని.. సొమ్ము చెల్లింపులో తీవ్ర జాప్యం చేశారన్న విమర్శలు అప్పట్లో రైతుల నుంచి వచ్చాయి. అప్పట్లో చాలా ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది కూడా కేవలం వైసీపీ మద్దతుదారులైన రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేసి, ఇతర పార్టీల మద్దతుదారుల ధాన్యాన్ని పెద్దగా కొనుగోలు చేయలేదన్న వాదన కూడా ఉంది. దీంతో రైతులు చాలా వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోలేకపోయారు. ఇటీవల కృష్ణా జిల్లాలో పర్యటించిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి పంట కొనుగోళ్ల విషయాన్ని కొందరు రైతులు తీసుకెళ్లారు. మంత్రి అధికారులతో మాట్లాడి, ఈ సారి అలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేశాక 21 రోజుల్లో రైతులకు నగదు చెల్లించాలని నిబంధన పెట్టారు. అయితే చాలా సార్లు 21 రోజులు దాటినా డబ్బులు ఇచ్చేవారు కాదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేశాక 48 గంటల్లోనే రైతులకు నగదు చెల్లిస్తున్నారు.

పరిహారమిచ్చినా ధాన్యం కొంటాం

» పౌరసరఫరాల శాఖ స్పష్టీకరణ

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పంట నష్టపరిహారంలో నమోదైతే.. సదరు రైతు పొలంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవటానికి వీలుకాదంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయదనే ప్రచారంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కృష్ణా జిల్లాలో పర్యటించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి ఇదే విషయాన్ని రైతులు తీసుకెళ్లారు. మంత్రి అప్పటికప్పుడు వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడారు. పరిహారం ఇస్తే ధాన్యం కొనుగోలు చేయమనే నిబంధన ఏదీ లేదని అధికారులు స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి రైతులకు చెప్పారు. అయినా పంట నష్టం కింద పేరు నమోదైతే.. ధాన్యం కొనుగోలుకు హామీ ఇవ్వలేమని, బయట అమ్ముకోవాలని కొన్ని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే విషయాన్ని మాజీ సీఎం జగన్ మంగళవారం కృష్ణా జిల్లా పర్యటనలో ప్రస్తావించారు. నష్టపరిహారం ఇస్తే ధాన్యం కొనరంట.. రైతుల్ని ప్రభుత్వం బ్లాక్ మెయిల్ చేస్తోందంటూ జగన్ మాట్లాడారు. దీనిపై వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు స్పందించారు. ఈ ప్రచారాన్ని దళారులు సృష్టించినట్లుగా గుర్తించారు. ధాన్యం కొనుగోలు నిబంధనల్లో ఈ విషయమే లేదని, అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు బుధవారం స్పష్టం చేశారు.

6 కోట్ల గోతాలు సిద్ధం: మంత్రి నాదెండ్ల

'ధాన్యం కొనుగోలులో గతఅనుభవాలను పరిగణనలోకి తీసుకున్నాం. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆరు కోట్ల గోనె సంచులు సిద్ధంగా ఉంచాం. వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు 50 వేల టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. వాటిని అవసరమైనప్పుడు రైతులకు ఉచితంగానే అందజేస్తాం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ణయించే విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఒకే కంపెనీకి చెందిన మిషన్లు వాడాలని నిర్ణయించాం. రాష్ట్రంలో ప్రజాపంపిణీ అవసరాల కోసం ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి రూ.12,200కోట్ల విలువైన 51 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యాం. నవంబరులో 11 లక్షలు, డిసెంబరులో 25 లక్షలు, జనవరిలో 8 లక్షలు, ఫిబ్రవరిలో 3 లక్షలు, మార్చిలో 4 లక్షల టన్నుల చొప్పున ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేశాం' అన్నారు.

బిహార్‌లో ఎన్‌డీఏదే విజయం

మూడు సర్వేల్లో వెల్లడి

పట్నా, నవంబరు 5: బిహార్లో ఓటర్ల నాడిని తెలుసుకోవడానికి ప్రయత్నించిన మూడు సంస్థలు, తొలిదశ పోలింగ్ ప్రారంభానికి కొద్ది గంటల ముందు తమ సర్వే వివరాలను ప్రకటించాయి. ఐఏఎన్ఎస్-మ్యాట్రిజ్, పోల్‌స్ట్రాట్, చాణక్య ఈ మూడు సంస్థలు దాదాపు ఒకే రకమైన అంచనాలను వెల్లడించాయి. వీటి ప్రకారం.. బిహార్‌లో మళ్లీ ఎన్‌డీఏ కూటమే అధికారంలోకి రాబోతోంది. ఆర్జేడీ-కాంగ్రెస్‌లతో కూడిన మహాగఠ్‌బంధన్ ఆశలు గల్లంతయ్యే సూచనలు ఉన్నాయి. కాగా, బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి.

సర్వే సంస్థ	ఎన్‌డీఏ సీట్లు	మహాగఠ్‌బంధన్	ఇతరులు
ఐఏఎన్ఎస్-మ్యాట్రిజ్	153-164	76-87	2-9
పోల్‌స్ట్రాట్	133-143	93-102	2-6
చాణక్య	128-134	102-108	5-9

బిహార్లో తొలి విడత పోలింగ్ నేడే

పట్నా, నవంబరు 5: బిహార్ శాసనసభ ఎన్నికల్లో గురువారం మొదటి దశ పోలింగ్ జరుగనుంది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను 121 సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏ, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్‌సురాజ్ పార్టీ సహా వివిధ పార్టీల నుంచి 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వి (రాఘోపూర్), బీజేపీకి చెందిన ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధురి (తారాపూర్), విజయకుమార్ సిన్హా (లఖీసరాయ్), మంత్రులు మంగళ్ పాండే (శివన్), నితిన్ నవీన్ (బంకీపూర్), సంజయ్‌సరోగి (దర్భంగా), జీవేశ్‌కుమార్ (జాలే), కేదార్‌ప్రసాద్ గుప్తా (కుర్హని), జేడీయూ మంత్రులు శ్రావణ్‌కుమార్ (నలంద), విజయకుమార్ చౌదురి (సరాయ్‌రంజన్), మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ పెద్దకుమారుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్‌ప్రతాప్ యాదవ్ (మహువా) తదితరుల భవితవ్యాన్ని 3.7 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. రాఘోపూర్‌లో గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని తేజస్వి భావిస్తున్నారు. ఆయనపై బీజేపీకి చెందిన సతీశ్‌కుమార్ పోటీచేస్తున్నారు. ఈయన 2010 ఎన్నికల్లో తేజస్వి తల్లి, మాజీ సీఎం రాబ్రీదేవిని ఓడించారు. ఇక్కడి నుంచే బరిలోకి దిగుతానని ప్రశాంత్ కిశోర్ గతంలో ప్రకటించారు. అయితే రాష్ట్రమంతా ప్రచారం చేయాల్సి ఉన్నందున ఎన్నికల్లో పోటీచేయకూడదని ఆయన నిర్ణయించుకున్నారు. చంచల్ సింగ్ అనే నేతకు ఇక్కడ టికెట్ ఇచ్చారు. యువ జానపద గాయని మైథిలి ఠాకూర్ బీజేపీ తరఫున ఆలీగంజ్ నుంచి.. భోజ్‌పురీ సూపర్‌స్టార్లు ఖేసరిలాల్ యాదవ్ (ఛాప్రా-ఆర్జేడీ), రితేశ్ పాండే (కార్గాహర్-జన్‌సురాజ్) కూడా బరిలో ఉన్నారు. జనసురాజ్ కార్యకర్త హత్య కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న అనంత్‌సింగ్ (జేడీయూ) మొకామా నుంచి పోటీచేస్తున్నారు. ఆయనపై మరో గ్యాంగ్‌స్టర్ సూరజ్‌భాన్ భార్య వీణాదేవి ఆర్జేడీ తరఫున బరిలో ఉన్నారు. తొలి విడతలో 45,341 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 36,733 ఉన్నాయి. ఈ 121 స్థానాల్లో జనాభా 6.60 కోట్ల మంది కాగా.. ఓటర్లు 3.75 కోట్ల మంది. వీరిలో కొత్త ఓటర్లు 10.72 లక్షల మంది అని ఈసీ వెల్లడించింది. 18-19 ఏళ్ల వయసున్న ఓటర్లు 7.38 లక్షల మంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నికలివే.



తొలి దశ ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

వేడుకగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ

» పాల్గొన్న 2 లక్షలమంది భక్తులు

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో బుధవారం సత్యదేవుడి గిరిప్రదక్షిణ వేడుకగా జరిగింది. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా నిర్వహించిన గిరిప్రదక్షిణలో సుమారు 2 లక్షల మంది పాల్గొన్నారు. తొలిపావంచా నుంచి జాతీయ రహదారి మీదుగా బెండపూడి సమీపంలో పుష్కరకాలువ రోడ్డుమీదుగా సుమారు 8.5 కిలోమీటర్లమేర గిరియాత్ర సాగింది. సుమారు 700 మంది పోలీసులు, ఆరుగురు తహసీల్దార్లు, 20మంది వీఆర్వోలు పర్యవేక్షించారు. బుధవారం రాత్రి పంపాహారతుల కార్యక్రమం జరిగింది.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల: టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం శుక్రవారం జరగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు 0877 2263261 నెంబరు ద్వారా తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌తో మాట్లాడవచ్చు.



శ్రీశైలంలో జ్వాలా తోరణంలో పాల్గొన్న భక్తులు

శ్రీశైలంలో వైభవంగా జ్వాలా తోరణం

శ్రీశైలం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం రాత్రి జ్వాలా తోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్షేత్రం కిటకిటలాడింది. తెల్లవారుఝాము నుంచే నదిలో పుణ్యస్నానాలు చేసి, ఆలయ ప్రధాన వీధిలో దీపాలు వెలిగించారు. సుమారు 50 వేల మందికి పైగా భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. కాగా, బుధవారం రాత్రి ఆలయంలో లక్ష దీపోత్సవం, పుష్కరిణికి హారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

పోలవరంలో 7, 8 తేదీల్లో పీపీఏ భేటీ


అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమీక్ష నిర్వహించనుంది. అథారిటీ చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన ఈ నెల 7, 8 తేదీల్లో ప్రాజెక్టు ప్రాంతంలో రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సమావేశమవుతుంది. పనులను పరిశీలిస్తుంది. నిర్దేశించుకున్న గడువుల్లోగా పూర్తిచేసే దిశగా పనులు జరుగుతున్నాయో లేదో తెలుసుకుంటుంది. డిజైన్ల ఆమోదం, తొలి దశ కాంటూరులో అంచనా వ్యయం రూ.30,346.95 కోట్లకు ఆమోదం, పీపీఏ ప్రధాన కార్యాలయం రాజమహేంద్రవరానికి తరలింపు వంటి అంశాలపై చర్చిస్తుంది.

మేమున్నది పోలీసు శాఖను నడిపించడానికి కాదు

» ఫలానా విధులు అప్పగించాలని ఆదేశించలేం
» జీతాలు రాకుంటే పోలీసులే కోర్టును ఆశ్రయించవచ్చు
» వారి తరఫున ఎంపీ పిల్ దాఖలు చేయడం ఏంటి?
» పేద, అణగారినవర్గాల గొంతుక వినిపించేందుకే పిల్
» పోలీసులు ఆ నిర్వచనం పరిధిలోకి రారు: హైకోర్టు
» వైసీపీ ఎంపీ గురుమూర్తి వేసిన పిల్ కొట్టివేత

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో ఉన్న పోలీసులకు ఫలానా విధులు అప్పగించాలని తాము ఎలా ఆదేశించగలమని పిటిషనర్‌ను హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. తామున్నది పోలీసు శాఖను నడిపించడానికి కాదని వ్యాఖ్యానించింది. వారి సేవలను ఎక్కడ వినియోగించుకోవాలో పోలీసు శాఖకు తెలుసని, ఫలానా విధులు అప్పగించమని తాము ఆదేశించలేమని తేల్చిచెప్పింది. జీతాలు రాకుంటే ఆ పోలీసులే నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చు కదా? వారి తరఫున మీరు పిల్ దాఖలు చేయడం ఏంటని వైసీపీ ఎంపీ గురుమూర్తిని ప్రశ్నించింది. పేద, అణగారినవర్గాల గొంతుకను వినిపించేందుకు పిల్ ఉద్దేశించినదని, పోలీసులు ఆ నిర్వచనం పరిధిలోకి రారని పేర్కొంది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో పోస్టింగ్‌ల కోసం వేచి ఉన్న/వేకెన్సీ రిజర్వ్‌లో ఉన్న పోలీసు అధికారులకు నిర్ణీత గడువులోగా పోస్టింగ్‌లు ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ తిరుపతి వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అధికారులను దీర్ఘకాలం వీఆర్‌లో ఉంచడం, వారికి జీతాలు చెల్లించకపోవడంపై విచారణ జరిపేందుకు స్వతంత్ర కమిటీ వేయాలని కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి పోలీసుల పోస్టింగ్‌లు, బదిలీలను బోర్డు ద్వారా చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎంత మంది పోలీసు అధికారులు వీర్‌లో ఉన్నారు? ఎంతకాలం నుంచి ఉన్నారు? వారికి జీతాలు ఎప్పటి నుంచి చెల్లించలేదనే వివరాలతో సమగ్ర నివేదిక కోర్టు ముందు ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిల్ బుధవారం విచారణకు వచ్చింది. వీఆర్‌లో ఉన్న పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతూ పోలీసు అధికారుల సంఘం లేదా జీతాలు అందని పోలీసులు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదని హైకోర్టు గుర్తు చేసింది. పోలీసు అధికారుల పోస్టింగ్, బదిలీల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల అమలుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో మార్గదర్శకాలు అమలు చేయకుంటే కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించే అధికారం తమకు లేదని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు తగిన వేదికను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. పిల్‌ను కొట్టివేసింది. అంతకుముందు పిటిషనర్ తరఫున న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. 199 మంది పోలీసు అధికారులను ప్రభుత్వం వీఆర్‌లో ఉంచిందని, జీతాలు సైతం చెల్లించడం లేదని అన్నారు. వీరికి కీలక పదవులు అప్పగించకుండా బందోబస్తు డ్యూటీలు వేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు కావడం లేదన్నారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో కొండచిలువ!



తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో భారీ కొండచిలువ రోడ్డు దాటుతూ ప్రయాణికుల కంటపడింది. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులోని వినాయక స్వామి ఆలయ ప్రాంతంలో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ కొండచిలువ రోడ్డు దాటింది. ఆ సమయంలో ప్రయాణిస్తున్న కొందరు వాహనదారులు వీడియోను తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

ద్రోణి ప్రభావంతో వర్షాలు

» నేడూ అక్కడక్కడ వానలు

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతం నుంచి తమిళనాడు మీదుగా కేరళ వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తేమ గాలులు వీస్తున్నందున బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వర్షాలు కురిశాయి. మిగిలినచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా బి.చెర్లోపల్లిలో 6.6, శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంటలో 4.5, నెల్లూరు జిల్లా కండలేరులో 4, విజయవాడ తూర్పులో 3.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా, నెల్లూరులో 34.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల, ఉత్తరకోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. కాగా, రాష్ట్రంలో గురువారం అక్కడక్కడ అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

రెవెన్యూ అధికారులకు న్యాయం చేయాలి

» సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు కోరారు. రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సచివాలయంలో బుధవారం ఆయన కలిశారు. 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వీఆర్‌ఓలకు డిప్యూటీ తహసీల్దార్ పే స్కేల్ ఇవ్వాలని, పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించాలని, ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు



నోటిఫికేషన్ పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య నాగభూషణ్ తదితరులు

వి శాట్ నోటిఫికేషన్ జారీ

» దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 25
» మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు ప్రవేశ పరీక్ష
» రెండు తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు

గుంటూరు(విద్య), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని వడ్లమూడిలో ఉన్న విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో బీటెక్, ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశం కోసం విశాట్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఈ మేరకు వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పీ. నాగభూషణ్ నోటిఫికేషన్ వివరాలు వెల్లడించారు. 2026-27 విద్యాసంవత్సరానికి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ(హానర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ(హానరల్), అగ్రికల్చరల్, ఫార్మా డీ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కోసం విశాట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 వరకు గడువు ఉందని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 1 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విశాట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో అన్ని విజ్ఞాన్ క్యాంపస్‌లతోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. వడ్లమూడిలోని వర్సిటీ క్యాంపస్‌తోపాటు హైదరాబాదులోని ఆఫ్ క్యాంపస్‌లో ఆయా కోర్సులు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు https://admission.vignan.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విశాట్ పరీక్షలో ర్యాం కులు సాధించిన వారికి దాదాపు రూ.48 కోట్ల వరకు ఉపకార వేతనా లు అందించనున్నట్టు తెలిపారు. ఇంటర్, జేఈఈ, మెయిన్స్ ర్యాం కుల ఆధారంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ దిరిశాల విజయరాము, డీన్ అడ్మిషన్స్ కేవీ కృష్ణకిశోర్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ. గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

లంచావతారాలపై వేటు

» 'తండ్రి ఆవేదన'పై స్పందించిన బెంగళూరు పోలీస్ కమిషనర్
» ఇప్పటికే ఓ ఎస్ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు
» తాజాగా బెళ్లందూరు ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

బెంగళూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కుమార్తెను పోగొట్టుకుని దుఃఖంలో ఉన్న తండ్రి నుంచి లంచం డిమాండ్ చేసి, వేధించిన ఉద్యోగులపై చర్యలు కొనసాగుతున్నాయి. ముంబైకి చెందిన అక్షయ(34) అనే యువతి సెప్టెంబరు 18న అనారోగ్యంతో బెంగళూరులో మృతి చెందగా.., ఆమె మృతదేహాన్ని ఇచ్చే క్రమంలో తన నుంచి లంచం డిమాండ్ చేసి వేధించారని ఆమె తండ్రి, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ చీఫ్ ఫైనాన్స్ అధికారి శివ కుమార్ తనకు ఎదురైన చేదు అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకున్న విషయం విదితమే. పోలీసులు, బెంగళూరు పాలికె, ఆస్పత్రి పోస్టుమార్టం ఉద్యోగులు.. ఇలా ప్రతి ఒక్కరూ వేధించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, కానిస్టేబుల్ గోరక్‌నాథ్ సస్పెండ్ అయ్యారు. లంచం తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో బెళ్లందూరు ఇన్‌స్పెక్టర్ రమేశ్ రొట్టిని బుధవారం సస్పెండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కాంతిరేఖ.. మమ్దానీ

బాలీవుడ్ దర్శకురాలు మీరా నాయర్ (నయ్యర్) పుత్రరత్నం న్యూయార్క్ మహానగరం మేయర్ అయ్యాడు. ముప్పైనాలుగేళ్ళ జోహ్రాన్ క్వామే మమ్దానీ నూటముప్పైయేళ్ళలో ఆ మహానగరం తొలిపౌరుడిగా ఎన్నికైన పిన్నవయస్కుడే కాదు, తొలి ముస్లిం, దక్షిణాసియామూలాలున్న తొలివ్యక్తి కూడా. మమ్దానీ తన విజయోత్సవ ప్రసంగంలో మార్పు మొదలైందని గర్జించాడు. తదనుగుణంగా జవాహర్‌లాల్ నెహ్రూ చరిత్రాత్మక 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' నుంచి కొన్ని వాక్యాలను ఉటంకించాడు. రెండు చేతులా నమస్కరిస్తూ వేదికమీదకు చీరకట్టులో వచ్చిన పంజాబీ తల్లినీ, గుజరాతీ మూలాలున్న తండ్రినీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నాడు. పాత వదిలి కొత్తలోకి అడుగుపెడుతున్న ఈ ఘట్టాన్ని ట్రంప్ వింటున్నారు, కంటున్నారంటూ హెచ్చరికలు చేసిన మమ్దానీ, తన విజయదుందుభి ట్రంప్ చెవుల్లో మారుమోగాలని కాబోలు, బాలీవుడ్ గీతం 'ధూమ్ మచాలే'ని ఈ వేడుకకు నేపథ్యగీతం చేశాడు. మిగతా ప్రపంచాన్ని పలు రకాలుగా బెదిరిస్తూ, వీరంగాలు వేస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు జోహ్రాన్ మమ్దానీ విజయం నైతికంగా పెద్ద ఎదురుదెబ్బ, రాజకీయంగా ఘాటైన హెచ్చరిక.

ట్రంప్ రెండోరాకడ తరువాత జరిగిన ఈ అతిపెద్ద ఎన్నికల ఫలితాలు డెమొక్రాట్లకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చాయి. న్యూయార్క్‌ను మమ్దానీ గెలుచుకోవడంతో పాటు, న్యూజెర్సీ, వర్జీనియా గవర్నర్లుగా డెమొక్రటిక్ పార్టీకి చెందినవారే గెలవడం విశేషం. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా హైదరాబాద్‌లో జన్మించిన గజాలా హష్మీ చక్కని మెజారిటీతో ఎన్నికైనారు. భారతీయ సంతతికి చెందిన అఫ్తాబ్ పూరేవాల్ అమెరికా ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ సోదరుడిని ఓడించి, సిన్సినాటి మేయర్‌గా మారోమారు విజయం సాధించడం విశేషమైన పరిణామం. ట్రంప్ పార్టీ, ఆయన బృందం, మతవాదులూ మితవాదులు కలసికట్టుగా ముస్లిం వ్యతిరేకతను ఎంతగా రేపినప్పటికీ మమ్దానీ, హష్మీల విజయం ఓటర్ల రాజకీయ పరిణతికీ, మతసహనానికీ నిదర్శనం. మమ్దానీకి యూదులు అత్యధికంగా ఓటుచేశారన్న విశ్లేషణలు మరింత ఆశ్చర్యం కలిగిస్తాయి. గాజా ఊచకోతలను ఘాటుగా విమర్శిస్తూ, నెతాన్యాహూను చీల్చిచెండాడంలో మమ్దానీ ఎన్నడూ ఏ మాత్రం తగ్గలేదు. యూదువ్యతిరేకిగా మమ్దానీని ఎంతగా చిత్రీకరించినా, అతడికి ఓటుచేయడంలో యూదులు ముందంజలో ఉన్నందుకు ట్రంప్ ఇప్పుడు వారిని తిట్టిపోస్తున్నారు. ఆఫ్రో అమెరికన్లు, ఆసియన్లు సహా ఇతర శ్వేతజాతేతరుల ఓట్లు మమ్దానీకి అధికంగా పడతాయన్నది ఊహించిందే.

డెమొక్రాటిక్ పార్టీ తరఫున నగర మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన పదకొండుమందిని వెనక్కునెట్టి జూన్ 24న మమ్దానీ ఎన్నికకావడం మిగతా ప్రపంచాన్ని ఆకర్షించింది, ట్రంప్‌ను భయపెట్టింది. అతని విజయం ఖాయమని అర్థం అవుతున్నకొద్దీ ట్రంప్ దాడిహెచ్చింది, దూకుడు పెరిగింది. ఓటర్లకు మమ్దానీ మత, సైద్ధాంతిక మూలాలను ట్రంప్ పదేపదే గుర్తుచేస్తూ, ఈ కమ్యూనిస్టు ఏలుబడిలో నగరం నాశనమైపోతుందని హెచ్చరించారు. వెయ్యేళ్ళ విఫలకమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోకితెచ్చి ఆర్థికంగా, సామాజికంగా నగరాన్ని భ్రష్టుపట్టిస్తాడన్నారు. మమ్దానీని ఎన్నుకుంటే నిధులివ్వకుండా నగరాన్ని నిలువునా మాడ్చేస్తానని కూడా పౌరులను ట్రంప్ బెదిరించారు. డెమొక్రాట్ బెర్నీ శాండర్స్ బాటలో తనను సోషలిస్టుగా ప్రకటించుకున్న మమ్దానీ కనుక గెలిస్తే తమ పెట్టుబడిదారీ సమాజం మీద ఆ ప్రభావం అధికంగా ఉంటుందని ట్రంప్ భయం. పునాదిలోనే దానిని చిదిమేయడానికి తన పార్టీని ఈ ఎన్నికల్లో పోటీచేయనివ్వకుండా, డెమొక్రాటిక్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆండ్రూ కుమోకు మద్దతు ప్రకటించారు. కమ్యూనిస్టు కంటే ఒక చెత్త డెమొక్రాట్ ఉత్తమమంటూ తన ఓటర్లను సైతం అటు మళ్ళించాడు. డెమొక్రాటిక్ పార్టీ ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్ కూడా కుమోకు మద్దతు ఇచ్చారు. ఇలా రెండుపార్టీలనుంచీ మమ్దానీని బలహీనపరిచే ప్రయత్నాలు బలంగా సాగాయి. మతఛాందసులు, పార్టీలకు అతీతంగా ఒక్కటైన పెట్టుబడిదారులు, ఆయన మతాన్నే కాదు, ఆహారపు అలవాట్లను సైతం ఎగతాళి చేస్తూ విషం చిమ్మిన ట్రంప్ అనుకూల మీడియా ఎంత ప్రయత్నించినా, సామాన్యులు, కార్మికులు మమ్దానీ పక్షాన నిలిచి గెలిపించారు. డెమొక్రాటిక్ పార్టీ భవిష్యత్తును నిర్ణయించేది దాని నాయకత్వం కాదు, కార్మికవర్గమేనని బెర్నీశాండర్స్ మరోమారు గుర్తుచేస్తున్నారు. తన విజయాన్ని కారు చీకటిలో కాంతిరేఖగా మమ్దానీ అభివర్ణించడం సముచితం. రెండుపార్టీల మధ్యా పెద్ద తేడాలేకుండా ఘనీభవించిపోయిన అమెరికాలో సామాన్యుల సంక్షేమానికీ, శ్రేయస్సుకూ హామీపడుతున్న ఎజెండాతో కొత్త రాజకీయానికి మమ్దానీ తెరదీశారని అనేకుల ఆశ. ఇస్లామోఫోబియా హెచ్చుతూ, వలసదారులను తరిమేస్తున్న రాజ్యంలో ఒక ముస్లిం, అదీ వలసదారుల సంతానం విజయం సాధించినందుకు సంతోషించవలసిందే.

బిహార్ ఓటర్లు కోరుతున్న మార్పు ఏమిటి?

'బదలావ్ తో హోనా చాహియే' (ఒక మార్పు రావాలి) అని తనను తాను 'నాయీ'గా స్వయంగా చెప్పుకున్న ఒక పెద్ద మనిషి అన్నాడు. ఆ వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కర్పూరీ ఠాకూర్ గురించి నేను ప్రస్తావించాను. ఆయన ముఖంలో ఆనందరేఖలు విరిశాయి. అయితే తాను, తన కుటుంబంలోని 20 మంది ఓటర్లు ఓటు వేసేందుకు ప్రేరణ అయ్యే మార్పు ఏమిటో ఆయన విడమరిచి చెప్పలేదు. 'అబ్ ఆప్ సమ్జా జాయియే' (మీరు మీ అభిప్రాయానికి రావచ్చు) అని ఆయన నిష్కర్షగా అన్నాడు.

మార్పు ఏమిటి? ప్రభుత్వం మారడం, పాలనా వ్యవస్థలో మార్పు సంభవించడమే మార్పు అని నేను విశ్వసిస్తున్నాను. బిహార్‌కే కాదు, దేశానికీ ఇటువంటి మార్పు అత్యవసరమని, జరూరుగా జరగాలని భావిస్తున్నాను. అయితే బిహార్ ఓటర్లు ఆకాంక్షిస్తున్న మార్పు బహువిధాలుగా ఉండడంతో పాటు అస్పష్టంగా ఉన్నది. ఉత్తర బిహార్‌లో పక్షం రోజుల పర్యటనతో ఈ వాస్తవం నాకు తెలిసివచ్చింది. మార్పు బహుళత్వం, అస్పష్టత గురించి నా పర్యటనానుభవాలు నన్ను జాగరూకుడిని చేశాయి. సాధారణ ఓటర్ల (అత్యధికులు పురుషులే)తో మాటా మంతీ ద్వారా బిహారీలు బహుళ మార్పులు కోరుతున్నారని, అవి ఒక దానితో ఒకటి పోటీ పడడమే కాకుండా ఘర్షణ పడుతున్నాయని కూడా నాకు విశదమయింది. అనేక పరివర్తనలను సాధించవలసిన బృహత్తర బాధ్యతను సున్నిత ప్రజాస్వామిక సాధనమైన ఓటు నిర్వహిస్తోంది. ఆ పరివర్తనలను సంపూర్ణంగా సాధించడంలో ఇప్పటికే చాలా జాప్యం చోటుచేసుకున్నది.



■ యోగేంద్ర యాదవ్

మొదటి మార్పు సామాజిక న్యాయం. అగ్ర కులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాధించవలసిన సామాజిక విప్లవం. బిహార్ జనాభాలో 11 శాతం కంటే తక్కువగా ఉన్న అగ్ర కులాలవారు సమాజం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలపై సంపూర్ణ పెత్తనం చెలాయిస్తున్నారు. పేదలు, నిరుపేదలను సంఘటితపరచడం ద్వారా కుల వ్యవస్థ వెన్ను విరవడాన్ని లక్ష్యంగా చేసుకున్న మండల్ ఉద్యమానికి లాలూప్రసాద్ యాదవ్ నాయకత్వం వహించారు. అయితే ముఖ్యమంత్రి పదవిని ఆయన రెండు పర్యాయాలు నిర్వహించిన తరువాత ఆ సామాజిక విప్లవం నిలిచిపోయింది. పరిపాలన పట్ల అశ్రద్ధ, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఉదాసీనత, అధికారాన్ని ఒక కులం చుట్టూ కేంద్రీకృతం చేసి, కుటుంబ పాలన చేయడంతో లాలూ మూడో పర్యాయం పదవీ కాలం ముగించేనాటికి ప్రభుత్వం మారితీరవలసిన అనివార్యత ఏర్పడింది. సామాజికంగా వెనుకబడిన కులాల, ఆర్థికంగా వెనుకబడిన కులాల, మహా దళితుల మద్దతుతో అగ్ర కులాల ఆధిపత్యం మళ్లీ రాజ్యాధికారాన్ని సాధించుకున్నది. క్రింది స్థాయి సామాజిక శ్రేణులలో ఐక్యత యాదవ్- ముస్లిం సంకీర్ణంగా సంకోచించింది (ఇటీవలి కుల గణన ప్రకారం బిహార్ జనాభాలో యాదవులు 14.2శాతం కాగా ముస్లింలు 17.7శాతంగా ఉన్నారు). అగ్ర కులాల/ వెనుకబడిన కులాల విభజన మధ్యలో నితీశ్ కుమార్ నిలబడ్డారు. తద్వారా బిహార్ రాజకీయాలలో ఒక కీలక నాయకుడుగా ఆయన ప్రభవించారు. సామాజిక విప్లవం తిరోగమనానికి ఆయన తోడ్పడ్డారు!

ప్రస్తుత ఎన్నికలలో ప్రతిపక్ష కూటమి మహాఘట్‌బంధన్ తన సామాజిక సంకీర్ణాన్ని ముస్లిం–యాదవ్ సమీకరణ పరిధి నుంచి విస్తృతం చేసేందుకు ప్రయత్నించింది. మల్లాహ్ కులస్తులకు (బిహార్ జనాభాలో 2.6శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖేశ్ సహాని నాయకత్వంలోని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీని; చౌరాసియా, బరాయీ, తంబోలి సామాజిక వర్గాలకు (బిహార్ జనాభాలో 1.7శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ఐపీ గుప్తా నేతృత్వంలోని ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ (ఐఐపీ)కి మహాఘట్‌బంధన్‌లో స్థానం కల్పించారు. బిహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా రవిదాసి వర్గానికి (బిహార్ జనాభాలో 5.6 శాతం) చెందిన నాయకుడిని నియమించడం ద్వారా కోల్పోయిన దళిత్ ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముస్లిం ఓటర్లను సంఘటితపరచడం ద్వారా లబ్ధి పొందేందుకు కూడా ప్రతిపక్ష కూటమి ప్రయత్నిస్తోంది. అయితే ఈ ప్రయత్నాల ద్వారా గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్డీఏకు లభించిన 8శాతం ఓట్ల ఆధిక్యాన్ని తగ్గించటం లేదా స్వాయత్తం చేసుకోవటంలో మహాఘట్‌బంధన్ సఫలమవుతుందా అనేది వేచి చూడాలి.

> బిహార్ ఓటర్లు ఆకాంక్షిస్తున్న మార్పు బహు విధాలుగా ఉండడంతో పాటు అస్పష్టంగా ఉన్నది. సాధారణ ఓటర్లతో మాటా మంతీ ద్వారా బిహారీలు బహుళ మార్పులు కోరుతున్నారని, అవి ఒక దానితో ఒకటి పోటీ పడడమే కాకుండా ఘర్షణపడుతున్నాయని కూడా నాకు విశదమయింది.

ఇక నిలిచిపోయిన రెండో పరివర్తన సుశాసన్ (సుపరిపాలన). అభివృద్ధి సాధనలో నాణ్యమైన ఫలితాలను సాధించవలసిన అవసరం మరే రాష్ట్రంలో కంటే బిహార్‌లోనే అత్యధికంగా ఉన్నది. నితీశ్‌కుమార్ మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సుపరిపాలనకు శ్రీకారం చుట్టారు. పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్విఘ్నంగా అమలుపరిచారు. రహదారుల నాణ్యతలో గణనీయమైన మెరుగుదలను సాధించారు. అయితే ఆ సుపరిపాలనా వెలుగులు ఎంతో కాలం నిలవలేదు. మసకబారిపోయాయి. ప్రజల మద్దతును నిలుపుకునేందుకు నితీశ్ ప్రభుత్వం అనేక గిమ్మిక్‌లు చేసింది. ప్రజల మద్దతును నిలబెట్టుకోగలిగింది గానీ సుపరిపాలనను కొనసాగించడంలో విఫలమయింది. నితీశ్ ప్రభుత్వం పదిహేను సంవత్సరాల క్రితం మంచిరోడ్లను నిర్మించిన విషయాన్ని బిహారీలు ఇప్పటికీ గుర్తు చేసుకొంటున్నారు. నితీశ్ రాక ముందు అన్నీ గతుకుల రోడ్లే కదా అని ఒక వృద్ధుడు వ్యాఖ్యానించాడు. నితీశ్ ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించింది. అయితే దీనికి ప్రజల మద్దతు సంపూర్ణంగా లభించలేదు. కల్తీ మద్యం విక్రయాలు పెరిగిపోయాయి. ఆ కల్తీ మద్యంతో సంభవిస్తున్న మరణాల సంఖ్య పెరిగిపోతూనే ఉన్నది. దీనికి తోడు మాదకద్రవ్యాల బెడద పెచ్చరిల్లింది.



లాలూప్రసాద్ యాదవ్ పాలన 'జంగిల్‌రాజ్' అన్న అపప్రథ నితీశ్ పాలన కొనసాగేందుకు ఊతమిస్తోంది. అయితే ఆ జంగిల్‌రాజ్ అన్న నింద పాక్షికంగా మాత్రమే సత్యం. ఇంకా ఓటుహక్కుకు అర్హుడుకాని యువకుడు ఒకరు తాను పుట్టక ముందు ఉన్న పరిస్థితులను గుర్తు చేసుకుంటూ చీకటిపడిన తరువాత ఎవరూ బయటకు వెళ్లే పరిస్థితి ఉండేదికాదట అని అన్నాడు. ఇటీవలికాలంలో పట్టపగలే అనేక నేరాలు, ఘోరాలు జరుగుతున్నా ఆ జంగిల్‌రాజ్ అన్న అపప్రథ ప్రభావం కొనసాగుతూనే ఉన్నది. ఉద్యోగాల సృష్టి, ఉపాధి కల్పన విషయమై పలు హామీలు ఇవ్వడం ద్వారా ఓటర్ల మద్దతును సాధించుకునేందుకు మహాఘట్ బంధన్ ప్రయత్నిస్తోంది. ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన స్వల్పకాలంలో అనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలనిచ్చిన మంచి పేరు తేజస్వి యాదవ్‌కు ఉన్నది. ఇది తమకు ఈ ఎన్నికలలో తప్పక మేలు చేస్తుందని ప్రతిపక్ష కూటమి విశ్వసిస్తోంది. అయితే కొత్తగా రంగప్రవేశం చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సూరజ్ విద్య, వైద్యం మొదలైన అభివృద్ధి అంశాలపై ముమ్మర ప్రచారం చేస్తోంది. ప్రశాంత్ కిశోర్ గ్రామ గ్రామాన పర్యటించారు. ఆయన ప్రసంగాలు అన్ని వర్గాల వారినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రజల పిచ్చాపాటీలో ఆయన వ్యాఖ్యలు పదే పదే ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే ఈ ప్రభావశీలత ఎంతవరకు ఓట్లుగా పరిణమిస్తుందో వేచి చూడాలి. మహిళా ఓటర్ల మద్దతును పొందేందుకు నితీశ్ ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో మహిళకు పదివేలరూపాయలు సంక్షేమ కానుకగా అందించింది. తాము అధికారంలోకి వస్తే వచ్చే సంక్రాంతినాటికి ఒక్కో మహిళకు రూ.30 వేలు ఇస్తామని తేజస్వి పదే పదే ప్రకటిస్తున్నాడు.

అంతిమంగా బిహార్ ఎన్నికలు కొన్ని బృహత్తర బాధ్యతల నిర్వహణ భారాన్ని వహిస్తున్నాయి. ఆ కర్తవ్యపాలనలు: భారత రాజ్యాంగ పరిరక్షణ, 2024 లోక్‌సభ ఎన్నికలు నిర్దేశించిన ప్రజాస్వామిక పాలన పునరుద్ధరణ దిశగా పరివర్తన మొదలైనవి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ బాధ్యతల నిర్వహణకు దిగ్భ్రాంతికరంగా అంతరాయం కలిగించాయి. ఇప్పుడు ఆ బాధ్యతల నిర్వహణ కొనసాగింపును బిహార్ ఓటర్ల తీర్పు ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఆ దృష్ట్యా బిహార్ ఎన్నికల ప్రచారం అనివార్యంగా ఎన్నికల నైతికతను కాపాడేందుకు లేదా 'ఓట్ చోరీ'ని నిరోధించేందుకే పరిమితమయింది. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ సైతం ఈ ఎన్నికల పోరులో ఒక రాజకీయ అస్త్రం కాలేదు. అయినప్పటికీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల సామర్థ్యం ముగిసిన ఆ సవరణ ప్రక్రియకు ఉన్నది. ప్రత్యేక సమగ్ర సవరణతో బిహార్ ఓటర్ల జాబితా 47 లక్షల మేరకు తగ్గిపోయింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రతి ఒక్క నియోజకవర్గం (మొత్తం సంఖ్య 243)లోను దాదాపు 20 వేలమంది ఓటర్లు తగ్గిపోయారు. ఓటర్ జాబితాలలో చోటుచేసుకోని వారిలో నాలుగింట మూడు వంతుల మంది తొలగింపు న్యాయబద్ధమైన చర్యే అని అనుకున్నా ప్రతి నియోజకవర్గంలోను ఇంచుమించు 5000 ఓట్లు మినహాయింపునకు గురయ్యాయనే వాస్తవాన్ని గుర్తించాలి. ఇది, డజన్ల కొద్దీ నియోజకవర్గాలలో ఎన్నికల ఫలితాన్ని నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. పల్లీల విక్రేత అయిన ఒక వృద్ధ ఓటర్ నిర్లిప్తంగా కనిపించాడు. ఓటర్ల జాబితాలో ఆ వృద్ధుడి పేరు ఉన్నదిగానీ ఆయన భార్య పేరు లేదు! ఆమె పేరు ఎందుకు తొలగించారో ఆయనకు తెలియదు. 'క్యా ఫారక్ పడ్తా హై హమేన్?' అని వ్యాఖ్యానించాడు. ఆ వృద్ధుడి గళంలో ఉదాసీనత ధ్వనించింది. అయితే వెన్వెంటనే ఆయన ముఖ వైఖరి మారిపోయింది. 'లేకిన్ ఏక్ ఓట్ సే జీత్ హార్ మే బాదల్ శక్తి హై' (ఓటమి, నష్టం మధ్య తేడాను ఒక ఓటు నిర్ణయిస్తుంది). ఆ వృద్ధ ఓటర్ ఉదాసీనత, దృఢ నిశ్చయం మధ్య సంభావ్య మార్పు దోబూచులాడడం లేదూ?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

> పావనమూర్తి తన అసమాన కార్యాచరణతో మూడుతరాల నాయకులను, మేధావులను కార్యకర్తలను, రచయితలను ప్రభావితం చేశాడు. ఫాసిజం విస్తరిస్తున్న ఈనాటి సంక్లిష్ట సందర్భంలో పావనమూర్తి చాటిచెప్పిన అంబేడ్కర్ ఆశయాలను, తథాగతుని తత్త్వాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజాసమూహాల్లో విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉంది.

భీమైక జీవనస్ఫూర్తి!

ఒక మహావృక్షం ఒరిగిపోతూ విత్తనాల గింజల్ని వాగ్దానం చేసినట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనంతమైన 'భీమ' ఎరుకను కలిగించి, సామాజిక ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన చింతకాయల పావనమూర్తి సెలవంటూ వెళ్లిపోయాడు. మూర్తీభవించిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఆశయంలా, బుద్ధుని ధమ్మపథ సూత్రంలా నడయాడిన పావనమూర్తి మాష్టారు (93) అక్టోబర్ 27 ఉదయం విశాఖపట్నంలో పరినిర్వాణం చెందాడు. తొలితరం అంబేడ్కరిస్టుగా, దళిత ఉద్యమయోధుడిగా, ప్రజాస్వామ్యవాదిగా, మేధావిగా పావనమూర్తి చెరగని ముద్రవేశాడు.

చింతకాయల పావనమూర్తి 1932 మార్చి 28న ఫ్రెంచ్ ప్రభుత్వ ఏలుబడిలో ఉన్న యానాం పెదమాలపల్లి (అంబేడ్కర్ నగర్)లో జన్మించాడు. యానాం, తాళ్ళరేవు పాఠశాలల్లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. కాకినాడ పి.ఆర్ కళాశాలలో ఇంటర్, విశాఖపట్నం ఏవీయన్ కళాశాలలో డిగ్రీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ చదివాడు. యానాంలో సెంట్రల్ బాయ్స్ స్కూల్‌లో ఒక సంవత్సరం ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, ఏవీయన్ కళాశాలలో అధ్యాపకుడిగా, రైల్వే మెయిల్ సర్వీస్‌లో ఉద్యోగిగా కొంతకాలం సేవలు అందించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా సుదీర్ఘకాలం పాఠాలు బోధించి వందలాది మంది శిష్యుల భవితకు బాటలు వేసి 1995లో పదవీ విరమణ చేశాడు.



దీన పోషక సమాజం, బ్రహ్మ సమాజం, కోనసీమ ప్రాంతంలోని ఆది ఆంధ్ర ఉద్యమ కార్యక్రమాల వెలుగుల్లో పావనమూర్తి బాల్యం చిగురించింది. ఫ్రెంచ్ పాలనలో ఉన్న యానాం ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి దడాల రమణయ్య నేతృత్వంలో జరిగిన పోరాటంలో పావనమూర్తి క్రియాశీలకంగా పాల్గొన్నాడు. రైల్వే మెయిల్ సర్వీస్ మద్రాస్‌లో తన సహోద్యోగి యెండ్లూరి చిన్నయ్యతో కలిసి ఉద్యోగులను సంఘటితపరిచాడు. భారతదేశంలో అంబేడ్కర్ సాగించే సాంఘిక, రాజకీయ పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఆ బాటలో మడమ తిప్పకుండా పయనించాడు.

అంటరానితనం కారణంగా అంత పెద్ద విశాఖపట్నంలో ఒక చిన్న అద్దె ఇల్లు దొరక్కపోవడంతో పావనమూర్తి హృదయంలో వేదనా తుఫాన్ రగిలింది. సమాజంలో సమస్త అధిపత్యాలకు అంకురార్పణ చేసిన మనుస్మృతిని జగదాంబ సెంటర్ సాక్షిగా దహనం చేసి, వైజాగ్ గుండెల్లో సమానత్వ భావాలను పండించాడు. ఉపకులాల వర్గాల నడుమ ఉన్న వైషమ్యాలను తొలగించటానికి వారందరికీ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి, వారి మధ్య సయోధ్య కుదర్చడానికి బృహత్తర ప్రయత్నం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రాన్ని బోధిస్తూనే మరోవైపు కులనిర్మూలనా చైతన్యాన్ని ప్రబోధించాడు. ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షునిగా, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ కార్యదర్శిగా, భారతీయ బౌద్ధమహాసభ జిల్లా కార్యదర్శిగా, 'భీమ్‌దళ్' అధినేతగా పావనమూర్తి కృషి అనితర సాధ్యమైనది. అణగారిన దళిత ఉన్నతోద్యోగుల కార్యాచరణ ఏ విధంగా ఉండాలని అంబేడ్కర్ అభిలషించాడో, ఆ విధమైన కార్యాచరణతో తన జీవనశైలిని పావనమూర్తి తీర్చిదిద్దుకున్నాడు. అంబేడ్కర్‌ను శ్వాసగా, ధ్యాసగా తలచి ఆయన ప్రతిపాదించిన నవయాన బౌద్ధాన్ని స్వీకరించి తదనుగుణమైన నిబద్ధతతో జీవించాడు. పావనమూర్తిది ముక్కుసూటి వ్యక్తిత్వం, రాజీపడని తత్త్వం. పార్లమెంటు సభ్యునిగా, శాసనసభ్యునిగా పోటీ చేయాలని వివిధ రాజకీయ పార్టీలు కోరినా తిరస్కరించాడు. ఆత్మగౌరవానికి భంగం కలిగితే పెద్ద పదవినైనా వదులుకోవడానికి ఆయన వెనుకాడలేదు. భావజాలపరమైన పాలనాగతమైన అభిప్రాయభేదంతో హైదరాబాద్‌లోని అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ పదవికి సైతం రాజీనామా చేశాడు. పావనమూర్తి తన అసమాన కార్యాచరణతో మూడుతరాల నాయకులను, మేధావులను కార్యకర్తలను, రచయితలను ప్రభావితం చేశాడు. ఫాసిజం విస్తరిస్తున్న ఈనాటి సంక్లిష్ట సందర్భంలో పావనమూర్తి చాటిచెప్పిన అంబేడ్కర్ ఆశయాలను, తథాగతుని తత్త్వాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజాసమూహాల్లో విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉంది.

• కోయి కోటేశ్వరరావు

ఆ ముసాయిదా రద్దుచేయాలి

పరిశ్రమలు స్థాపించబోయే ముందు కాలుష్య నియంత్రణ బోర్డులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా తమ ప్రాంతంలో పెట్టే పరిశ్రమ వల్ల పర్యావరణంతో పాటు తమ ఆరోగ్యాలను ఏ విధంగా నష్టపోతామో వివరంగా చెప్పుకునే అవకాశం ప్రజలకు లభిస్తుంది. మెజారిటీ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ఆ ప్రాంతంలో పరిశ్రమలు పెట్టాలా వద్దా అనే సూచనలను ఆయా ప్రభుత్వాలకు అవి పంపుతాయి. ఇటీవల విశాఖ జిల్లా పెదగంట్యాడలో అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న అధికారులపై ఆ ప్రాంత ప్రజలు తమ ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడే కాదు బల్క్ డ్రగ్ ప్లాంట్ పెట్టే విశాఖ జిల్లా నక్కపల్లి ప్రాంతంలో, హైడ్రో పవర్ ప్రాజెక్టులు పెట్టే అల్లూరు జిల్లా ప్రాంతంలో, సోలార్ విద్యుత్ పరికరాల ప్రాజెక్టు కోసం కరేడు ప్రాంతంలో, ఇంకా రాష్ట్రంలోని మరికొన్ని చోట్ల ప్రజలు తమ తీవ్ర నిరసన తెలిపిన ఫలితంగా ఆయా ఫ్యాక్టరీలు, పరిశ్రమల ఏర్పాటు తాత్కాలికంగా ఆగిపోయింది.

తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వాలు తలపెట్టిన ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ప్రారంభమవుతాయి. ఇది ప్రజల పాలిట అశనిపాతం లాంటి చర్య. అక్టోబర్ 1న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధానపరమైన ఓ ప్రధాన మార్పును ప్రకటించింది. వాతావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ 2006కు సవరణ చేస్తూ ప్రకటించిన నోటిఫికేషన్ అది. సొంత క్యాప్టివ్ ప్లాంట్లు (ఉదాహరణకు ఇలాంటి నిర్మాణానికి కావలసిన విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్లాంట్లు లేకపోవడం, 90శాతం పైగా రైల్వే ట్రాన్స్‌పోర్ట్‌పై ఆధారపడేవి) లేని సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లకు ముందస్తు పర్యావరణ అనుమతులు అవసరం లేదని తెలిపింది. ఈ సవరణకు సంబంధించి కేంద్ర పర్యావరణ అటవీ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది.

ముంబయిలోని కల్యాణ్ ప్రాంతంలో అదానీ గ్రూప్ సిమెంట్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ప్రారంభించాలన్న ప్రయత్నాలపై ఆ ప్రాంత ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. కొత్తగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం.. గతంలో మాదిరిగా ప్రజాభిప్రాయ సేకరణ, ప్రభావ నివేదికల సమర్పణ వంటివేవీ అవసరం లేదు. ప్లాంటుపై సూచనలు, సలహాలు, అభ్యంతరాలు తెలపడానికి 60రోజుల సమయం మాత్రం ఇచ్చారు. ఇది కేవలం కంటి తుడుపు చర్య మాత్రమే. అదానీ గ్రూప్‌నకు అనుబంధ సంస్థ అయిన అంబుజా సిమెంట్స్ రూ.1,400 కోట్ల పెట్టుబడితో ఆరు సిమెంట్ గ్రైండింగ్ యూనిట్లను కలాణ్‌లో నెలకొల్పాలని యోచిస్తోంది. ఈ యూనిట్ల నుంచి వెలువడే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్, కార్బన్ మోనాక్సైడ్ వంటి కాలుష్య ఉద్గారాల ప్రభావంతో తమ ఆరోగ్యాలు పూర్తిగా దెబ్బతింటాయని కల్యాణ్ ప్రాంతంలోని ప్రజలు వ్యథ చెందుతున్నారు. సమీపంలోని పదికి పైగా గ్రామాల ప్రజలు కూడా ఈ ఫ్యాక్టరీల ఏర్పాటుకు వ్యతిరేకంగా తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. సంతకాల సేకరణ కూడా జరుపుతున్నారు.

తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ముసాయిదా నోటిఫికేషన్‌తో అదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు ఇక అడ్డూ అదుపు ఉండదు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ ముసాయిదా నోటిఫికేషన్ ప్రజల జీవితాలకు ఉరితాడు కాబోతోందని గుర్తించాలి. ఈ నోటిఫికేషన్ బేషరతు రద్దు కోసం వివిధ రకాల పరిశ్రమలు నిర్మించే ప్రాంతాల ప్రజలతో పాటు వివిధ రంగాల ప్రజా సంఘాలు, ప్రజాతంత్రవాదులు, వామపక్ష శక్తులు సంఘటిత ఉద్యమాన్ని నిర్మించాలి.

○ ముప్పాళ్ళ భార్గవశ్రీ
సీపీఐఎంఎల్ నాయకులు

'మొంథా'తోనైనా మేల్కొందాం!

ఇటీవల సంభవించిన మొంథా తుపాను రైతాంగాన్ని నిలువునా ముంచేసింది. 3 లక్షల ఎకరాలకు పైగా పంట దెబ్బతిని వేలాదిమంది రైతులు నష్టపోయారు. ఇందులో 70 శాతం వరి పంటలే ఉన్నట్లు తెలుస్తోంది. వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, మినుము, పత్తి, కూరగాయలు, ఉద్యాన పంటలకు నష్టం జరిగింది. పలు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రహదారులు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ తుపాను కారణంగా వివిధ రంగాలకు రూ. 5,265.51 కోట్ల మేర నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా.

ప్రతి ఏటా రాష్ట్రంలో ఇదే పరిస్థితి. హుదూద్, తిత్లీ, పెథాయ్, నివర్, ఇప్పుడు మొంథా... ఇలా వరుస ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోంది. గత 37 ఏళ్లలో సుమారు 65కు పైగా ప్రకృతి బీభత్సాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. గత వందేళ్లలో 105కు పైగా తుపాన్లు ఆంధ్రప్రదేశ్‌ను చుట్టుముట్టాయి. ప్రతీ రెండు, మూడేళ్లకోసారి భారీ తుపానో, వరదో రాష్ట్రాన్ని చిగురుటాకులా వణికించేస్తోంది. సాధారణంగా అక్టోబరు, నవంబరు నెలల్లో రాష్ట్రానికి తుపాన్ల ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో సముద్ర ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడడానికి పరిస్థితులు అనుకూలిస్తాయి. అవి క్రమేపీ వాయుగుండాలు, తుపాన్లుగా మారతాయి. వీటి ప్రభావం ఆర్థిక వ్యవస్థ పైనే కాకుండా... విధాన నిర్ణయాలు, రాజకీయ సుస్థిరత, సాధారణ జనజీవనం పైనా పడుతోంది. ప్రకృతి కన్నెర్రజేస్తే ప్రమాదం ఏ స్థాయిలో ముంచుకొస్తుందనేందుకు ఈ తుపాన్ల విధ్వంసమే నిదర్శనం. ఐరాస విపత్తు నష్ట నివారణ కార్యాలయం విడుదల చేసిన నివేదిక ప్రకారం– వివిధ ఉత్పాతాల కారణంగా భారతదేశం ఏటా రూ.65 వేల కోట్ల వరకూ ఆర్థికంగా నష్టపోతోంది. అందులో తుపాన్ల వల్ల సంభవించే నష్టం ఏటా రూ.4 వేల కోట్ల పైమాటే. విపత్తు మరణాల్లో 16.7 శాతం కేవలం తుపాన్ల వల్లే సంభవిస్తున్నాయి. గత రెండు దశాబ్దాలలో మన దేశంలో తుపాన్ల వల్ల మరణించిన వారి సంఖ్య దాదాపు 20 లక్షలు.

ప్రతీ ఏటా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు 'జాతీయ విపత్తుల నివారణ సంస్థ'ను ఏర్పాటు చేసుకుని మనం మరింత అప్రమత్తం కాగలుగుతున్నాం. సైనిక సిబ్బందిని, అధికార సిబ్బందిని మోహరించడంతో పాటు, ప్రజలను సైతం మానసికంగా సన్నద్ధం చేస్తున్నాం. కేవలం ఇటువంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్లనే ఉధృతమైన ఉపద్రవాలలో ప్రాణ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోగలుగుతున్నాం.

విపత్తుల తీవ్రతను తెలుసుకోవడానికే గానీ, ఇంకా వాటిని పూర్తిగా నివారించే స్థాయికి నేటి సాంకేతిక పరిజ్ఞానం ఎదగలేదు. విపత్తుల వల్ల కలిగే ముప్పును తగ్గించే అవకాశాలను ప్రకృతి సహజ సిద్ధంగానే ఏర్పాటు చేసింది. దురదృష్టవశాత్తూ ఆ సహజ రక్షణ కవచాలు మానవ జోక్యంతో నాశనమవుతున్నాయి. మడ అడవులు, సరుగుడు చెట్లు, కొండలమీద పెరిగే దట్టమైన వృక్షాలు... వంటివి తీర ప్రాంతాన్ని కంటికి రెప్పలా కాపాడుతాయి. తుపాన్ల సమయంలో అలల ఉధృతికి, తీరంలోని ఇసుక కోతలకు గురికాకుండా మడ చెట్ల వేర్లు బలమైన వలలుగా పని చేస్తుంటాయి. రెండు దశాబ్దాల క్రితం రాష్ట్రంలో 54 వేల హెక్టార్లలో మడ అడవులు విస్తరించి ఉండేవి. ఇప్పుడు వాటిలో చాలావరకు నాశనమై పోయాయి. ప్రభుత్వ వ్యవస్థల నిర్లక్ష్యం మడ అడవుల విస్తీర్ణం తగ్గిపోవడానికి ముఖ్య కారణమని ఎం.ఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని ఫౌండేషన్ గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది.

> విపత్తుల తీవ్రతను తెలుసుకోవడానికే గానీ, ఇంకా వాటిని పూర్తిగా నివారించే స్థాయికి నేటి సాంకేతిక పరిజ్ఞానం ఎదగలేదు. విపత్తుల వల్ల కలిగే ముప్పును తగ్గించే మడ అడవులు, సరుగుడు చెట్లు.. వంటివాటిని ప్రకృతి సహజ సిద్ధంగానే ఏర్పాటు చేసింది. దురదృష్టవశాత్తూ ఆ సహజ రక్షణ కవచాలు మానవ జోక్యంతో నాశనమవుతున్నాయి.



కృష్ణా, గోదావరి నదుల్లో మంచినీటి ప్రవాహం తగ్గిపోవడం, నదీజలాల్లోకి ఎగువ ప్రాంతాల్లోంచి తరలివచ్చే ఒండ్రు మట్టి తగ్గిపోవడం అడవుల కోతకు దారితీసింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో ఏర్పాటైన భారీ రసాయన పరిశ్రమల వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల జలాల్లో మార్పులు వచ్చాయి. సముద్రంలోని ఓడల నుంచి వెలువడే వ్యర్థాలు, చమురు వెలికితీత కార్యక్రమాలు, పంట పొలాల నుంచి విడుదలయ్యే రసాయనాలు సైతం తీరంలోని సహజ రక్షణ కవచాలపై ప్రతికూల ప్రభావం కనబరుస్తున్నాయి. తూర్పుగోదావరి, గుంటూరు డెల్టా పరిధిలో చాలావరకు అడవులు కబ్జాలకు గురై తరిగిపోతున్నాయి. పర్యావరణాన్ని దారుణంగా దెబ్బకొడుతున్న ఈ ప్రయత్నాలను తక్షణం అడ్డుకోకపోతే– తుపానులు, పెనుగాలులు ప్రతీసారి రాష్ట్రంలోని తీర ప్రాంతాలను అతలాకుతలం చేస్తూనే ఉంటాయి. తీరం నుంచి 500 మీటర్ల వరకూ బోర్‌వెల్స్ వేయకూడదని సి.ఆర్.జెడ్ చట్టం చెబుతోంది. దాన్ని పట్టించుకోకుండా తీరం వెంబడి బోర్లు వేసి భూగర్భ జలాలు తోడేస్తున్నారు.

కోస్తా జిల్లాల్లో మురుగు, వరద నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టం రెట్టింపవుతోంది. చాలాసార్లు కాలువలు, చెరువు గట్లు తెగిపోవడం వల్లే ఎక్కువమంది మృతిచెందిన సందర్భాలున్నాయి. 1977 నాటి దివిసీమ ఉప్పెన తరువాత విశాఖపట్నం– కోస్తా తీరం వెంట 146 తుపాను రక్షణ కేంద్రాలను అధికారులు నిర్మించారు. అయితే సరైన నిర్వహణ లేకపోవడంతో అవి శిథిలమైపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. ఈ కేంద్రాలతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విపత్తు నిర్వహణ అథారిటీలను పునరుద్ధరించాలి. తుపాన్ల తీవ్రతను తట్టుకుని నిలబడాలంటే– తీరప్రాంత వ్యాప్తంగా గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేయాలి. తీరం వెంబడి మడ అడవులు, సరుగుడు చెట్లు, జీడిమామిడి తోటలు పెంచాలి. ఉప్పుగాలులను తట్టుకునే వనాలను తీరంలో పెంచాలి. తీర ప్రాంత నియంత్రణ కోసం రూపొందించిన 'కోస్టల్ రెగ్యులేషన్ జోన్' నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. తీర రక్షణకు అవసరమైన సహజ వనరులను విస్తారంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, పౌర సంఘాలు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

■ కూసంపూడి శ్రీనివాస్
జనసేన పార్టీ అధికార ప్రతినిధి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
గురువారం 6 నవంబరు 2025



పున్నమి వెలుగు







↑ యనమలకుదురు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న యువతులు

దుర్గాఘాట్‌లో భక్తుల పుణ్యస్నానాలు ↓

కార్తీక పౌర్ణమి బుధవారం భక్తి దేదీప్యమానమైంది. కృష్ణాతీరం కాంతివంతమై ప్రకాశించింది. శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. అభిషేకాలు, ప్రత్యేక పూజలతో అంతటా పంచాక్షరీ మంత్రం మార్మోగింది. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులతో కృష్ణాతీర ఘాట్లు, సముద్రతీరాలు కిటకిటలాడగా, శివాలయాలు కళకళలాడాయి. ఇంద్రకీలాద్రిపై గిరిప్రదక్షిణ కనులపండువగా జరగ్గా, సాయంసంధ్య వేళ నిర్వహించిన కోటి దీపోత్సవంతో కార్తీక కాంతులు మిన్నంటాయి. 6



ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం (ఇన్‌సెట్‌లో) గిరిప్రదక్షిణలో గంగా సమేత దుర్గామల్లేశ్వరులు

సంక్రాంతికి సీ ప్లేన్

రూ.20 కోట్లతో వాటర్ డ్రోమ్ నిర్మాణం.. డిసెంబరుకు పూర్తి

» విజయవాడ నుంచి శ్రీశైలం మాత్రమే కాకుండా..

» విజయవాడ-హైదరాబాద్, విజయవాడ-విశాఖపట్నానికి కూడా..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సంక్రాంతికి విజయవాడ నుంచి సీ ప్లేన్ సేవలు ప్రారంభం కానున్నాయి. విజయవాడ నుంచి శ్రీశైలంతో పాటు విజయవాడ-హైదరాబాద్, విజయవాడ-విశాఖపట్నం మధ్య కూడా ఈ సర్వీసులు మిగతా 6లో..



హడలెత్తిస్తున్న ఆఫ్రికా నత్తలు

• పంటల్ని నమిలేస్తున్నాయ్ 8

గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలు ఎన్టీఆర్ జిల్లాలో కలుస్తున్నాయా? పెనమలూరు నియోజకవర్గం కృష్ణాజిల్లాకే పరిమితమవుతుందా? కైకలూరును తిరిగి కృష్ణా జిల్లాలోకి తీసుకురానున్నారా?.. అంటే దాదాపు అవుననే సమాధానమే వస్తుంది. జిల్లాల పునర్విభజనకు సంబంధించి మంత్రుల బృందం బుధవారం అమరావతిలో నిర్వహించిన కీలక సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది.

పునర్విభజన..

పునరుద్ధరణ

మంత్రుల సమావేశంలో కీలక అంశాలపై చర్చ

ఎన్టీఆర్ జిల్లాలోకి గన్నవరం, నూజివీడు వచ్చే చాన్స్

• నూజివీడు రెవెన్యూ డివిజన్ పునరుద్ధరించే అవకాశం
• తిరువూరు రెవెన్యూ డివిజన్ రద్దు చేయవచ్చు
• కైకలూరు నియోజకవర్గం తిరిగి కృష్ణాలో కలుపుతారా?
• పెనమలూరు నియోజకవర్గం కృష్ణాలోనే కొనసాగించే ఆస్కారం
• గ్రేటర్ విజయవాడలో ఉన్న పెనమలూరు పరిస్థితి ఏమిటి?

• క్యాబినెట్ ఆమోదం తర్వాతే అన్ని అంశాలూ కొలిక్కి..



నూజివీడు రెవెన్యూ డివిజన్ పునరుద్ధరణకు అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు సమయంలో.. గన్నవరం, పెనమలూరుతో పాటు ఏలూరు జిల్లాలో కలిపిన నూజివీడును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలనే డిమాండ్ బాగా వినిపించింది. కాగా, అమరావతిలోని సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన మంత్రుల సమావేశంలో గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల విలీన అంశాలు చర్చకు వచ్చాయి. దీనికి సంబంధించి క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తాజా చర్చల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా భౌగోళిక స్వరూపం మార్పు చెందే అవకాశం ఉంది. గన్నవరం, పెనమలూరు, నూజివీడు నియోజకవర్గాలు మూడూ ఎన్టీఆర్ జిల్లాకు దగ్గరగా ఉంటాయి. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని ప్రధాన మండలాల్లో ఉన్న గ్రామాలు విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలోనివి. దీంతో గన్నవరం, పెనమలూరును ఖాయంగా విలీనం చేస్తారని ప్రజలు భావించారు.

విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి గన్నవరం, మైలవరం?

గన్నవరం, మైలవరం నియోజకవర్గాలను పూర్తిగా విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. మైలవరం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, జి. కొండూరు, మైలవరం మండలాలు ప్రస్తుతం విజయవాడ రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. రెడ్డిగూడెం మండలం మాత్రమే తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఉంది. రెడ్డిగూడెం మండలాన్ని కూడా విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. గన్నవరంలోని బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్ (9 గ్రామాలు) కూడా విజయవాడ డివిజన్‌లో విలీనం చేసే పరిస్థితి కనిపిస్తోంది.

గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విజయవాడ రూరల్ (9 గ్రామాలు) విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండగా, మిగతా 6లో..

సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్‌తో కృష్ణా కలెక్టర్ బాలాజీ, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



దీవులకు దారి

కృష్ణానదిపై హైలెవల్ వంతెన నిర్మాణం

» అవనిగడ్డలోని దీవుల రోడ్లకు అనుసంధానం
» 'సాస్కీ' నుంచి నిధుల కేటాయింపు
» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి
» కృష్ణా అధికారులతో ప్రత్యేక సమీక్ష

విజయవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నియోజకవర్గంలో దీవులుగా ఉన్న గ్రామాల రూపురేఖలు మారే సమయం ఆసన్నమైంది. ఇప్పటి వరకు పడవల మార్గం తప్ప ఎలాంటి రవాణా సౌకర్యం లేని దీవుల గ్రామాలకు రాచమార్గం రానుంది. ఇందుకు కృష్ణానదిపై హైలెవర్ వంతెన నిర్మించనున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధి, మొంథా తుఫానులో జరిగిన నష్టంపై కృష్ణాజిల్లా అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నదిపై నిర్మించే హైలెవల్ వంతెనకు దీవులు ఉన్న గ్రామాలను అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ వంతెన మిగతా 6లో..

మాయలోడు

నకిలీ మద్యం కేసులో నిందితుడు మనోజ్ మాయలెన్నో..

ఇప్పటికే సిట్ అధికారులకు తప్పుడు సమాచారం



» కేసులను దాచి తప్పుడు వివరాలు
» సివిల్ వివాదంలో నిందితుడు
» గతంలోనూ పోలీసుల అరెస్టు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నకిలీ మద్యం తయారీ కేసులో ఏ20గా ఉన్న మనోజ్‌కుమార్ జైన్ చేసిన మాయలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. నకిలీ మద్యం తయారుచేస్తున్న వారికి ప్లాస్టిక్ మూతలపై బ్రాండ్ల పేర్లను ముద్రించి సరఫరా చేసిన ఆయన సివిల్ వివాదంలోనూ నిందితుడిగా ఉన్నాడు. వన్‌టౌన్‌లో పులిపాటివారి వీధిలో ప్లాస్టిక్ మూతల వ్యాపారం చేస్తున్న ఆయన సిట్, ఎక్సైజ్ అధికారులకు డొంక తిరుగుడు జవాబులు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, మనోజ్‌కుమార్‌కు మేలు చేయాలనో, ఉద్దేశపూర్వకంగానో సిట్ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. వాస్తవానికి మనోజ్ ప్లాస్టిక్ మూతల వ్యాపారాన్ని పులిపాటి వారి వీధిలో వేరే కాంప్లెక్స్‌లో చేస్తున్నాడు. జనార్దనరావు మాత్రం కొఠారి కాంప్లెక్స్‌లో వ్యాపారం చేస్తున్నట్టు చెప్పాడు. కాగా, ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్న మనోజ్ దానిని ఖాళీ చేయకుండా యజమానులను వేధిస్తున్నాడు. దీనిపై బాధితులు మిగతా 6లో..



సమావేశంలో పాల్గొన్న రెండు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులు

అనుకున్నదే అయ్యింది. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పినట్టు విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణ డీపీఆర్ గందరగోళంగా తయారైంది. కన్సల్టెన్సీ నివేదించిన అంశాలు రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లకు ఆగ్రహం తెప్పించింది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రూ.2,500 కోట్ల నిధులు కేటాయిస్తే రూ.1,000 కోట్లకు డీపీఆర్ తయారు చేస్తారా? అంటూ సదరు సంస్థపై మండిపడ్డారు.

ఇదేం డీపీఆర్

గందరగోళంగా ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణ డీపీఆర్

కన్సల్టెన్సీపై రెండు జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్ల ఆగ్రహం

» డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఉండాల్సిందేనని పట్టు
» అనుసంధానిత రోడ్ల విస్తరణకూ ప్రతిపాదన
» ఫోన్‌లో ఎంపీల దృష్టికి.. వారు కూడా తిరస్కరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌పై రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల నేతృత్వంలో రెండు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో బుధవారం నగరంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్టేక్ హోల్డర్స్ సమావేశం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీతో పాటు ఎన్‌హెచ్-65 పరిధిలోని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ముందుగా కన్సల్టెన్సీ సంస్థ రూ.1,000 కోట్లతో కూడిన ప్రాజెక్టు నివేదికను సమావేశంలో ప్రజెంటేషన్ చేసి చూపించింది. ఆసాంతం విన్న ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంజిసర్కిల్ నుంచి పెనమలూరు వరకు ఎలాంటి వీయూపీలు లేకుండా ప్రతిపాదించటంపై బోడె, గద్దె ప్రశ్నించారు. ఎలివేటెడ్ కారిడార్‌ను ఎందుకు ప్రతిపాదించలేదన్నారు. నాలుగు కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ లేకపోతే ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా మెట్రో కారిడార్-2 వెళ్తుందని, దీనికి సంబంధించిన అధికారులతో చర్చలు మిగతా 6లో..



గతనెలలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

బెంజిసర్కిల్ వరకు విస్తరించాల్సిందే..

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) హద్దుగా ఎన్‌హెచ్-65 విస్తరణకు డీపీఆర్‌ను తయారు చేయటంపై ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో వచ్చే ఓఆర్ఆర్ కోసం విజయవాడ ప్రజలను ఇబ్బంది పెడతారా అని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ ప్రాతిపదికగా కాకుండా బెంజిసర్కిల్ వరకు కూడా విస్తరించాల్సిందేనని పట్టుబట్టారు.

దారి తప్పుతున్న రవాణా

డీటీసీ లేక పాలన పడక

• ఇద్దరు జేటీసీలున్నా పని ఒత్తిడి
• పర్యవేక్షణ అంతంతమాత్రం
• పెరిగిపోతున్న అవినీతి 6
• కాసులిస్తేనే ఫైల్స్‌కు క్లియరెన్స్
• పనిచేయని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు
• ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం.. వసూళ్లు



ఎన్టీఆర్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం

జిల్లాలో రవాణా శాఖ పనితీరు అధ్వానంగా మారింది. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పోస్టు భర్తీ కాకపోవటంతో పాలన ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది. దీంతో నాలుగు నెలలుగా ఫైల్స్ ముందుకు కదలట్లేదు. కార్యాలయంలోని ఉద్యోగులు ఇష్టానుసారంగా పనిచేస్తున్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను గాలికొదిలేశారు. కొందరైతే హైవేలపై ప్రైవేట్ వ్యక్తులతో దారి దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రైవేటు చేతుల్లో ఉన్న ఏటీఎస్‌లో అడ్డగోలు దోపిడీ జరుగుతోంది.

ఎ.కొండూరులో ఆగని కిడ్నీ మరణాలు!

» 10 రోజుల్లో ముగ్గురు మృతి 6



దుర్గమ్మ గిరి ప్రదక్షిణలో ఆలయ అధికారులు, భక్తులు

భక్తితో దుర్గమ్మ గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ భక్తిప్రపత్తులతో సాగింది. ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రి, ఆలయ ఉద్యోగులు, భక్తులు ఉత్సవ మూర్తులను ఉంచిన బండిని లాగారు. జైభవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భక్తుల భజనలు, తదితర భక్తిపారవశ్య వాతావరణంలో కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా బయలు దేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు తదితరాలను సమర్పించి, పసుపు నీళ్లతో వారుపోశారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.



ఊంజల్ సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి : కార్తీక పౌర్ణమి సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను బుధవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచన మండపంలో వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఏఈవో బి.వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులు కార్తీక దీపాలను వెలిగించి ఊంజల్ సేవలో పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హీరో నారా రోహిత్ దంపతులు



ఇంద్రకీలాద్రి : కనకదుర్గమ్మను సినీ హీరో నారా రోహిత్, శిరీష దంపతులు బుధవారం దర్శించుకున్నారు. నూతన దంపతులు అమ్మవారి ఆశీస్సుల కోసం ఆలయాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సంబంధీకుడైన నారా రోహిత్ దంపతులకు దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ అధికారులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈవో వీకే శీనా నాయక్ నూతన దంపతులకు అమ్మవారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

భక్తుల సేవలో నూతన కార్యాలయం..

ఇంద్రకీలాద్రి : వన్‌టౌన్ అర్జునవీధిలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఆర్జిత సేవ టిక్కెట్ల కౌంటర్, వివిధ విరాళాల స్వీకరణ కార్యాలయం, సమాచారకేంద్రం బుధవారం ప్రారంభమైంది. ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ), ఈవో శీనానాయక్, ధర్మకర్తలు కొబ్బరికాయ కొట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పూజా టికెట్‌లు, విరాళాల చెల్లింపుల కోసం కొండపైకి రాలేని భక్తుల సౌకర్యార్థం కొండ దిగువన నూతనంగా ఆర్జిత సేవ కౌంటర్, విరాళాలు తీసుకునే కౌంటర్, సమాచార వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈవో మాట్లాడుతూ, ఏళ్ల నుంచి ఆక్రమణలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన అమ్మవారి స్థలాన్ని భక్తులకు ఉపయోగపడేలా సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులకు అనారోగ్య పరంగా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఆసుపత్రికి తీసుకెళ్లే నిమిత్తం ఆధునిక సదుపాయాలు గల కొత్త అంబులెన్సును బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఓ ఫార్మసీ కంపెనీ యాజమాన్యం దేవస్థానానికి అందించారు.

దీవులకు దారి

(5వ పేజీ తరువాయి)

నిర్మాణానికి ప్రభుత్వ నిధులతో పాటు సాస్కీ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తామని పవన్ వెల్లడించారు. కేంద్రప్రభుత్వ సాయంతో అవనిగడ్డ పరిధిలోని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను పునరుద్ధరిస్తామన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిన అభివృద్ధి పనులను త్వరలోనే మొదలుపెడతామని ఆయన హామీ ఇచ్చారు. ఏటిమొగ, ఎదురుమొండి హైలెవల్ వంతెన నిర్మాణాన్ని సాకారం చేస్తామన్నారు. హైలెవల్ బ్రిడ్జి కోసం ఇప్పటికే రూ.109 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. అలైన్‌మెంట్ మార్పుల కారణంగా నిర్మాణ వ్యయం పెరిగిందని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. రూ.60 కోట్ల వరకు వ్యయం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ, అటవీ, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాయలోడు

(5వ పేజీ తరువాయి)

పోలీసులను ఆశ్రయించారు.

కొన్నాళ్లుగా వాయిదా

పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో జీఈవీ రాధామాధవ్ అపార్టుమెంట్ ఉంది. ఇందులో ఫ్లాట్ నెంబరు 1705కు కె.రాధిక యజమాని. ఆమె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగం చేసి కొద్దినెలల క్రితం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. రాధికకు చెందిన ఫ్లాట్‌లోకి మనోజ్‌కుమార్ 2020లో అద్దెకు దిగాడు. నెలకు రూ.50 వేలు అద్దె చెల్లిస్తానన్నాడు. ప్రస్తుతం రాధిక కుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. తన కుమారుడి వివాహం ఉందని ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని పలుమార్లు రాధిక దంపతులు మనోజ్‌కుమార్‌కు చెప్పారు. నేడు, రేపు, ఎల్లుండి అంటూ వాయిదాలు వేసుకుంటూ వస్తున్నాడు. అతడికి చెప్పిచెప్పి విసిగిపోయిన రాధిక గత నెల 29న మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మనోజ్‌ను పిలిపించి విచారణ చేయగా, ఈనెలాఖరుకు ఖాళీ చేస్తానని చెప్పాడు. ఎక్సైజ్ పోలీసులు ప్రశ్నించినప్పుడు తనపై ఇంతకు ముందు ఎలాంటి కేసులు లేవని చెప్పినట్టు తెలిసింది. నకిలీ మద్యం కేసు నమోదు కావడానికి ముందు మనోజ్‌కుమార్‌ను తెలంగాణ, నరసాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని కూడా గోప్యంగా ఉంచాడు.



మంగినపూడి బీచ్‌లో శివలింగం వద్ద మంత్రి రవీంద్ర పూజలు



దత్త రామేశ్వరం ద్వాదశబావుల వద్ద భక్తుల స్నానాలు



విజయవాడ దుర్గాఘాట్‌లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హర హర మహాదేవ..

- శివానుగ్రహం కోసం కార్తీకపౌర్ణమి పవిత్ర స్నానాలు, దీపారాధనలు
- భక్తులతో పోటెత్తిన శైవాలయాలు
- కోటి దీపాల కాంతిలో మెరిసిన ఇంద్రకీలాద్రి





సముద్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



దత్తరామేశ్వరంలో నగరేశ్వరునికి అభిషేకాలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గగుడిలో దుర్గామల్లేశ్వరులకు బుధవారం ప్రదోషకాలంలో దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక దీపోత్సవ దీప కాంతితో ఇంద్రకీలాద్రి మెరిసింది. అమ్మవారి పంచహారతులు అనంతరం ఆలయప్రధాన రాజగోపురం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయచైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఈవో వీకే శీనానాయక్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని కోటి వత్తుల దీపాన్ని వెలిగించి హర హర మహాదేవ అంటూ మల్లేశ్వరస్వామిని కీర్తించారు. "లక్ష ఒత్తుల దీపం" "కోటి దీపోత్సవం" ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులందరూ కుటుంబాలతో కలిసి ఈ పవిత్రమైన దీపారాధనలో పాలుపంచుకున్నారు. దివ్య దీపకాంతుల శోభతో ఆలయ ప్రాంగణం కనువిందు చేసింది.



యనమలకుదురు శివాలయంలో..

మల్లేశ్వరస్వామికి జ్వాలా తోరణం

కార్తీక పౌర్ణమి సందర్భంగా మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. జ్వాలా తోరణంలో నుంచి స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకువచ్చారు. దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు రోజంతా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, అన్ని ఆచారాలు వేద సంప్రదాయాలకు అనుగుణంగా జరిగేలా చూశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కృష్ణానదికి వేకువ జాము నుంచే భక్తులు రావటం వలన ట్రాఫిక్‌ను మళ్లించారు. నది వైపు వాహనాలను కొన్ని గంటల సేపు నిలిపివేశారు. ఆ మార్గాలన్నీ కూడా వాహనాలతో, భక్తులతో కిక్కిరిశాయి.

సముద్రుడికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా కృష్ణా జిల్లా మంగినపూడి బీచ్‌లో 80 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు విశాఖపట్నం, హైదరాబాద్, తెనాలి, గుంటూరు, రేపల్లె, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు మంత్రి కొల్లు రవీంద్ర బీచ్‌లో ప్రముఖ వేదపండితులు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో సముద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సముద్ర స్నానమాచరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీచ్ వద్ద, పాండురంగ స్వామి దేవస్థానంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. కార్తీక మాసంలో బీచ్‌కి లక్షలాది మంది భక్తులు వచ్చి స్నానమాచరిస్తారన్నారు. చిన్న పిల్లలకు పాలు ఇవ్వడంతో పాటు వారు తప్పిపోకుండా ట్యాగ్‌ల ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు పులిహోర ప్రసాదాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం శ్రీదత్త రామేశ్వరం సందర్శించి నగరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన దత్త రామేశ్వరం

మంగినపూడి బీచ్, దత్త రామేశ్వరం బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. ద్వాదశ బావుల వద్ద వేలాది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. నగరేశ్వరస్వామి వద్ద ఏర్పాటు చేసిన శివలింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రం లోపలికి వెళ్ళకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా ఐదుగురు వేదపండితులతో సముద్రుడికి హారతి నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిబిరాలను ఏర్పాటు చేశారు. భక్తులకు మంచి నీటి ప్యాకెట్లను సరఫరా చేశారు.

ఎ.కొండూరులో ఆగని కిడ్నీ మరణాలు!

- 10 రోజుల్లో ముగ్గురు మృతి
- నత్తనడకన కృష్ణా జలాల పైపులైన్ పనులు
- భయందోళనలో బాధితులు, ప్రజలు



ధర్మా (ఫైల్)

ఎ.కొండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మరో ఉద్దానంగా పేరుగాంచిన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి ప్రజల ప్రాణాలను కబళిస్తున్నది. ఈ వ్యాధి బారినపడిన రోగులు ఒక్కొక్కరిగా మృతి చెందుతున్నారు. 2017 సంవత్సరం నుంచి కిడ్నీ వ్యాధిగ్రస్తులు, గిరిజన ప్రజలు, వామపక్ష పార్టీలు కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం కోసం పోరాటలు చేసినా ఆశించిన ఫలితం రాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామ శివారు దీప్లానగర్ తండాకు చెందిన భరోతు ధర్మా (40) ఐదేళ్ల క్రితం కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. వైద్యుల సలహా మేరకు కొంత కాలం మందులు వాడినా ఇటీవల వ్యాధి తీవ్రత పెరిగి డయాలసిస్ స్థితికి చేరాడు. ఒక్కసారిగా వ్యాధి తీవ్రత పెరగడంతో ప్రైవేట్ అసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించినా ప్రాణాలు దక్కలేదని ఆయన భార్య కన్నీటి పర్యంతమైంది. 10 రోజుల వ్యవధిలో ఎ.కొండూరులోని చైతన్యనగర్ తండాకు చెందిన బాణావతు రాముడు, దీప్లానగర్ తండాకు చెందిన జరబల మంగ్యా, భరోతు ధర్మా మృతి చెందడంతో గిరిజన తండాలో తీవ్ర భయందోళనలు నెలకొన్నాయి.

నత్తనడకన కృష్ణాజలాల పైప్‌లైన్ పనులు

ప్రభుత్వం రూ.50కోట్ల నిధులతో ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత కృష్ణా జలాల పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండలంలోని అన్నిగ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉండగా, ఎక్కువగా గిరిజన తండాలో ఉన్నారు. మరో ఉద్దానంగా పేరుగాంచిన ఎ.కొండూరు మండలానికి ప్రత్యేక కిడ్నీ అసుపత్రి, వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం, నాణ్యమైన మందులు, ప్రతి ఇంటికి కృష్ణాజలాలు అందజేయాలని ప్రజలు, కిడ్నీ బాధితులు కోరుతున్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేస్తున్న బినామీ కాంట్రాక్టర్ రాజకీయ వత్తిడి కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు త్వరగతిన కృష్ణా జలాల పైపులైన్ పనులు పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. కిడ్నీ వ్యాధితో మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు డిమాండ్ చేశారు.

ఇదేం డీపీఆర్

(5వ పేజీ తరువాయి)

జరిపారా? అని ఎమ్మెల్యేలు ప్రశ్నించగా, లేదని కన్సల్టెన్సీ సంస్థ చెప్పింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు.. మెట్రోను కూడా దృష్టిలో పెట్టుకుని డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరికి ఫోన్ చేసిన విషయాన్ని తెలిపారు. దీంతో ఇద్దరు ఎంపీలూ డీ పీఆర్‌ను తిరస్కరించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తన నియోజకవర్గం పరిధిలో సబ్‌వే, వీయూపీల గురించి చెప్పారు.

కలెక్టర్ల అసహనం

డీపీఆర్‌పై కలెక్టర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మెట్రో అధికారులతో కలిసి మూడు రకాల డిజైన్లను సిద్ధం చేయాలని సూచించారు. బెంజిసర్కిల్ నుంచి చిన ఓగిరాల వరకు ఉన్న ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించలేదని, వీయూపీలు తక్కువగా ఉన్నాయన్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ విజయవాడ నగర, శివారు ప్రాంతాలతో పాటు భవిష్యత్తులో పోర్టు ట్రాఫిక్ మరింత పెరగబోతోందని, ఇలాంటపుడు ఎలివే టెడ్ కారిడార్ మాత్రమే పరిష్కారమన్నారు.

అనుసంధానిత రోడ్లు కూడా విస్తరించండి

ఎన్‌హెచ్-65, 16ను అనుసంధానించే రోడ్లు మూడు ఉన్నాయని, వాటిని కూడా ఇదే డీపీఆర్‌లోకి తీసుకొచ్చి విస్తరించేందుకు ప్రతిపాదించాలని ఎమ్మెల్యేలు సూచించారు. ఆటోనగర్ బస్ టెర్మినల్ రోడ్డు ఎన్‌హెచ్-16, 65ను కలుపుతుందని, ఈ రోడ్డును కూడా ఎన్‌హెచ్ పరిధిలోకి చేర్చి విస్తరించాలని సూచించారు. ఎనికేపాడు-తాడిగడప 100 అడుగల రోడ్డును, కంకిపాడు-కేసరపల్లి రోడ్డును కూడా విస్తరించేలా తుది డీపీఆర్ ఉండాలని సూచించారు. వీటి అభివృద్ధికి భూములను ప్రత్యేకంగా చేర్చాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, కృష్ణా జేసీ నవీన్, ఎన్టీఆర్ జిల్లా డీఆర్వో లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, మెట్రో అధికారులు పాల్గొన్నారు.

పునర్విభజన.. పునరుద్ధరణ

(5వ పేజీ తరువాయి)

బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాలు గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాలు ఉయ్యూరు డివిజన్ పరిధిలో ఉన్నాయి. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ల ప్రకారం ఈ రెండు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకొచ్చే క్రమంలో గన్నవరం రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయవచ్చనే చర్చ నడిచింది. తాజాగా మంత్రుల బృందం గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలనే ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న దిశగా చర్చ సాగించటంతో గన్నవరం రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటుచేసే అవకాశమే ఉండకపోవచ్చు. ఒకప్పుడు నూజివీడు రెవెన్యూ డివిజన్‌గా ఉంది. పరిపాలనా భవనం కూడా అక్కడ ఉంది. కాబట్టి ప్రస్తుత తిరువూరు రెవెన్యూ డివిజన్‌ను రద్దుచేసి, నూజివీడు రెవెన్యూ డివిజన్‌ను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాలు, తిరువూరు నియోజకవర్గ పరిధిలోని ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట మండలాలను నూజివీడు డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

కైకలూరు.. కృష్ణాజిల్లాలో కలిపే అవకాశం

కైకలూరు నియోజకవర్గాన్ని తిరిగి కృష్ణాజిల్లాలోకి తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై మంత్రుల సమావేశంలో చర్చ జరిగింది. ఈ నియోజకవర్గంలోని కలిదిండి, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాలను పూర్తిగా గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది.

పామర్రులో రెండు డివిజన్ల సమస్య తీరనుందా?

పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాలు ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ఒక్క పెదపారుపూడి మండలం మాత్రమే గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది. తాజా మార్పుల నేపథ్యంలో పెదపారుపూడి మండలాన్ని కూడా ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే పామర్రులో రెండు డివిజన్ల సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

పెనమలూరు కృష్ణాజిల్లాకే పరిమితమా?

పెనమలూరు నియోజకవర్గం కృష్ణాజిల్లాలోనే కొనసాగించాలన్న ఆలోచనలో మంత్రుల బృందం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక్క పెనమలూరు మండలంలో కొన్ని గ్రామాలు తప్ప మిగిలిన గ్రామాలు, మండలాలుకృష్ణా జిల్లాలోనే అంతర్భాగంగా ఉండటం వల్ల ఆ నియోజకవర్గాన్ని అక్కడే కొనసాగించాలన్న ఆలోచన చేసినట్టు తెలుస్తోంది. కాగా, విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో పెనమలూరు మండలంలోని కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాలతో పాటు కంకిపాడు మండల పరిధిలోని గంగూరు, గోసాల, ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, వేల్పూరు, ఉప్పులూరు గ్రామాలు పాత (45 విలీన గ్రామాల) జాబితాలో ఉన్నాయి. తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదించిన జాబితాలో కంకిపాడు, పెనమలూరు మండలాల్లోని పూర్తి గ్రామాలను చేర్చారు. పెనమలూరు నియోజకవర్గం కృష్ణాజిల్లాలో ఉంటే గ్రేటర్ విజయవాడ ఎలాసాకారం అవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

కైలే అనిల్‌పై కేసునమోదు

- జగన్ పర్యటనలో అత్యుత్సాహం
- మందితో పోలీసుల విధులకు ఆటంకం

పమిడిముక్కల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల మండలం గోపువానిపాలెం వద్ద హైవేపై విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించినందుకు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మరికొందరిపై కేసు నమోదుచేసినట్టు పమిడిముక్కల పోలీసులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా అనిల్‌కుమార్ భారీ సంఖ్యలో అనుచరులను పోగేసుకుని గోపువానిపాలెం క్రాస్‌రోడ్డువద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సీఐ చిట్టిబాబును మీసంగతి చూస్తాం..! అంటూ దుర్భాషలాడుతూ.. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాదనకు దిగినందుకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. డ్రోన్‌పుటేజి ద్వారా ఆధారాలు సేకరించి త్వరలో మిగిలిన వారిని గుర్తించి చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

సంక్రాంతికి సీ ప్లేన్

(5వ పేజీ తరువాయి)

నడపటానికి నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. నూతన సంవత్సరం మొదటి రెండు వారాల్లోనే వాటర్ ఏరోడ్రమ్ పనులు కూడా పూర్తిచేసుకుని ఆపరేషన్‌కు శ్రీకారం చుడతారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఈ సేవలకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం భావించిన నేపథ్యంలో.. కొద్దికాలం కిందట విజయవాడ నుంచి శ్రీశైలానికి ట్రయల్ రన్‌ను కూడా విజయవం తంగా నిర్వహించారు. ఆ తర్వాత ఫీజిబిలిటీ సర్వే, డీపీఆర్ రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విజయవాడ నుంచి సీ ప్లేన్లు నడపటానికి సానుకూలంగా రిపోర్టు వచ్చింది. ఇదే క్రమంలో డీపీఆర్ రూపకల్పన పూర్తయింది.

కృష్ణానదిలో వాటర్ ఏరోడ్రమ్ ఏర్పాటు

కృష్ణానదిలో వాటర్ ఏరోడ్రమ్ ఏర్పాటుకు రూ.20 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందుకయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. సీ ప్లేన్స్‌ను మాత్రం ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తారు. కొద్దికాలం కిందట స్పైస్‌జెట్ సంస్థ ట్రయల్ రన్ నిర్వహించింది. విజయవాడ నుంచి శ్రీశైలానికి రోడ్డు మార్గం అయితే 263 కిలోమీటర్లు ఉండగా, ప్రయాణ సమయం 5.30 గంటలు. సీ ప్లేన్‌లో అయితే కేవలం 45 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అలాగే, హైదరాబాద్, విశాఖపట్నానికి కూడా ఈ సర్వీసులు నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్‌కు వెళ్లే సీ ప్లేన్ హుస్సేన్‌సాగర్‌లో ల్యాండ్ అవుతుంది. విశాఖపట్నం అయితే సముద్రంలో ల్యాండ్ అవుతుంది. ఇందుకోసం విశాఖపట్నంలో కూడా వాటర్ డ్రోమ్‌ను ప్రభుత్వమే నిర్మిస్తుంది. హైదరాబాద్‌లో అక్కడి ప్రభుత్వం నిర్మించే అవకాశం ఉంది. తొలిదశలో అమరావతి, తిరుపతి, గండికోట నుంచి సీ ప్లేన్ ఆపరేషన్లు ప్రారంభించాలని, మలిదశలో అరకువ్యాలీ, లంబసింగి, రుషికొండ వంటి ప్రాంతాలను ప్రభుత్వం ఎంపిక చేసింది.

దారి తప్పుతున్న రవాణా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లా రవాణా శాఖలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) లేరు. కానీ, ఇద్దరు జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు (జేటీసీ) మాత్రం ఉన్నారు. ఒకరు జోన్-2 జేటీసీ కాగా, మరొకరు రాష్ట్రస్థాయి జేటీసీ ఇక్కడ డీటీసీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జోన్-2 జేటీసీ అనేది రెగ్యులర్ పోస్టు. ఆయన విజయవాడ రవాణా శాఖ కార్యాలయంగానే పనిచేస్తారు. జోన్-2లోని పలు జిల్లాల్లో ఉన్న రవాణా శాఖ కార్యాలయాలపై ఆయన పర్యవేక్షణ ఉంటుంది. రాష్ట్రస్థాయి జేటీసీకి ఎన్టీఆర్ జిల్లాకు ఇన్‌చార్జి డీటీసీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ జేటీసీ గతంలో ఇక్కడ డీటీసీగా పనిచేసి పదోన్నతిపై వెళ్లారు. తిరిగి మళ్లీ ఆయనకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అటు జేటీసీగా రవాణా శాఖలో ఆయనకు కీలక బాధ్యతలు ఉంటాయి. ఇటు డీటీసీగా జిల్లాలోనూ కీలక బాధ్యతలు ఉంటాయి. దీంతో ఆయన పూర్తి బాధ్యతలు నిర్వహించలేకపోతున్నారు. ఉదయం రాష్ట్ర కార్యాలయంలో పూర్తిస్థాయిలో, సాయంత్రం జిల్లా కార్యాలయంలో కొద్దిసేపు పనిచేస్తున్నారు. దీంతో పాలన పడకేసింది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ గాలికి..

రవాణా శాఖ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ జరగట్లేదు. విజయవాడ కేంద్రంగా వెయ్యికిపైగా ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో సింహభాగం కోహిమాలో రిజిస్ట్రేషన్ అయినవే. మూడొంతుల బస్సులు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండానే నడుస్తున్నాయి. సేఫ్టీ కోడ్ లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. కర్నూలు బస్సు దుర్ఘటన తర్వాత జిల్లాలోని పలు బస్సులపై కేసులు నమోదు చేశారు. రోడ్లపైకి వచ్చిన బస్సుల్లో 40 వరకు కేసులు నమోదు చేశారు. తనిఖీలకు భయపడి రోడ్లపైకి రాని బస్సులన్నీ నిబంధనలు ఉల్లంఘించినవే. ఇవి బయటకు రాకుండా ఉండటానికి రవాణా శాఖ సిబ్బంది సమాచారాన్ని లీక్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ప్రైవేట్ బస్సులపై రవాణా శాఖ అధికారులు సీరియస్‌గా దృష్టి సారించట్లేదనే వాదన వినిపిస్తోంది.

అంతటా అవినీతిమయం

జిల్లా రవాణా శాఖ అవినీతిమయంగా మారింది. ఫైల్స్ అన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి. డబ్బు వచ్చే ఫైల్స్ మాత్రమే పరిష్కారమవుతున్నాయి. డబ్బు రాని ఫైల్స్ పెండింగ్‌లో ఉంటున్నాయి. అదేమంటే రెగ్యులర్ డీటీసీలేరనే మాట వినిపిస్తోంది. జిల్లాలో కొందరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కూడా పనిచేయటం మానేశారు. రెగ్యులర్ విధులకు డుమ్మా కొడుతున్నారు. డీటీసీ లేకపోవటంతో ప్రైవేట్ ఆధీనంలో నడుస్తున్న ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్)లో అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కొందరు ఇన్‌స్పెక్టర్లు అదునుచూసి దారి దోపిడీకి పాల్పడుతున్నారు. హైవేలపై ప్రైవేట్ వ్యక్తులతో వసూలు చేస్తున్నారు.

విజయవాడ తూర్పు

దుర్గగుడి అన్నదాన పథకానికి విరాళం



ఇంద్రకీలాద్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరిగే అన్నదాన పథకానికి బుధవారం అయ్యప్పనగర్‌కు చెందిన మన్నె సాయి చరణ్ కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళంగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి చైర్మన్ రాధాకృష్ణ అమ్మవారి చిత్రపటం, విరాళం రశీదు, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



త్రిశక్తిపీఠంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న పండితుడు, గురునానక్ కాలనీ శివాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న, పూజలు చేస్తున్న భక్తులు

త్రిశక్తిపీఠంలో ఘనంగా కార్తీక శోభ

- తెల్లవారుజాము నుంచే శివాలయాలకు తరలివచ్చిన భక్తులు
- పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు
- భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నవితరణ

కృష్ణలంక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మహా శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్ నేతృత్వంలో జరిగిన పౌర్ణమి పూజలలో ఆధ్యాత్మిక సలహాదారు కార్తీక దీపాలు వెలిగించారు. మహిళలు పెద్దయెత్తున తరలివచ్చి 365, లక్ష, కోటి ఒత్తులతో కార్తీక దీపాలు వెలిగించి పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గురునానక్ కాలనీ శివాలయంలో ...

భారతీనగర్: గురునానక్ కాలనీ శివాలయంలో శ్రీరామలింగేశ్వర స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులు తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. ఈ నెల 9న ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం కార్తీక అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



జ్యోతి వెలిగిస్తున్న సాహితీవేత్త జీవీ పూర్ణచందు, సైకాలజిస్టు కృష్ణకుమారి

టీటీడీలో అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా పున్నమితోటలోని టీటీడీ దేవస్థానంలో భక్తుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయంలోని ఉసిరి చెట్టుకింద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాక ఆవు నేతితో ఉన్న 365 ఒత్తులను భక్తులకు పంపిణీ చేయగా, వారు ఉసిరి చెట్టుకింద వెలిగించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి, సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు, న్యాయవాదులు పడవల ఏడుకొండలు, విజయకుమార్, ప్రసాద్, వేణు, ప్రసాదరెడ్డి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

గురు విశ్వస్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో ..

మొగల్రాజపురం: ఆధ్యాత్మిక గురువు, సైంటిఫిక్ సెయింట్ గురువిశ్వస్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు కేఎల్ రావు భవన్‌లో బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త జీవీ పూర్ణచందు పాల్గొని జ్యోతి వెలిగించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ గురు విశ్వస్ఫూర్తి రచనలు ప్రతి ఒక్కరు చదవడం ద్వారా జీవితం, మానవత్వం తెలుసుకోవచ్చని చెప్పారు. సైకాలజిస్టు టి. కృష్ణకుమారి మాట్లాడుతూ విశ్వస్ఫూర్తి తన రచనలతో, ప్రసంగాలతో ఆరోగ్యకరమైన సమాజం కోసం కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు సంప్రదాయ నృత్య సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఉద్యమ వర్క్‌షాప్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం మధు



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న జీఎం మధు

ఆటోనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోసుకొని ప్రయోజనం పొందాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం. మధు సూచించారు. జవహర్ ఆటోనగర్‌లోని ఏపీ ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాలులో రాంప్ కార్యక్రమంలో భాగంగా డీఐసీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉద్యమ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిశ్రమలు స్థాపించడంతోపాటు ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. దీనికి బ్యాంక్‌లు రుణాలు అందజేస్తున్నాయని, సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఔత్సాహికపారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా పలువురు ఉద్యమ రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇండస్ట్రీస్ అసిస్టెంట్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణం, ఐపీవో సత్యనారాయణ, మనీషా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆటోనగర్ బ్రాంచ్ అధికారి సునీల్, పీఎంఈజీపి పథకం కింద లబ్ధిపొందిన మువ్వా పూజిత, సుమారు వందమంది పారిశ్రామికులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో వడ్డెరలకు ప్రాధాన్యత కల్పించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్



చల్లా జోసెఫ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మహేష్ తదితరులు

లబ్బీపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలకు అన్ని రంగాలలో రాజకీయ ప్రాధాన్యతతో పాటు, నామినేటెడ్ పదవులు కూడా ఇవ్వాలని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్ డిమాండ్ చేశారు. లబ్బీపేటలోని సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం వడ్డెర కులస్తుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డెరలకు కార్మిక సంక్షేమ చట్టాలను సక్రమంగా అమలే చేయాలని, రాజకీయ ప్రాధాన్యత, నామినేటెడ్ పోస్టులు కూడా కేటాయించాలన్నారు. కృష్ణాజిల్లా కార్యదర్శిగా జోసెఫ్ ను నియమిస్తూ నియామక పత్రం అందజేసి సత్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీను, కార్యదర్శి తమ్మిశెట్టి నాగరాజు, బండారు కుమారి తదితరులు పాల్గొన్నారు.



వర్షపు నీటితో వంద అడుగుల రోడ్డు, ఏపీఐఐసీ జెడ్ఎం కార్యాలయం ఆవరణ

ఆటోనగర్‌లో జోరువాన

రోడ్లు జలమయం.. ఇబ్బందిపడ్డ ప్రజలు.. నిలిచిన ట్రాఫిక్

ఆటోనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో బుధవారం మధ్యాహ్నం సుమారు గంటపాటు జోరువాన కురిసింది. ఈవర్షంతో ఆటోనగర్ వందఅడుగుల రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డుతోపాటు పలు అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. పలు ఖార్కానా ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో ఇబ్బందిపడ్డారు. జనజీవనం స్తంభించడంతో పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. డ్రెయిన్‌లు పొంగి పొర్లాయి. వర్షపునీటికి డ్రెయినేజీ నీరు తోడవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహించింది. ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ జెడ్ఎం కార్యాలయం ఆవరణ వర్షపునీటితో నిండిపోయింది.

పోలీసులే మార్గదర్శకులై...



వాహనదారులకు జాగ్రత్తలు చెబుతున్న నాల్గో పట్టణ ట్రాఫిక్ సీఐ రామారావు, సిబ్బంది

భారతీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి 10వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్ ఏరియా రోడ్డులో వాననీరు నిలిచిపోయింది. ఈ రోడ్డులో నిలిచిన వర్షపునీటితో వాహనదారులు ఇబ్బంది పడకూడదని నాల్గో పట్టణ ట్రాఫిక్ సీఐ రామారావు ఆధ్వర్యంతో సిబ్బంది రోడ్డులో నిలిచిపోయిన వర్షపునీటిని తొలగించడంతో పాటు ప్రయాణికులు, వాహనదారులకు జాగ్రతలు తెలియచేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

నేటి నుంచి వీపీ సిద్ధార్థలో స్పోర్ట్స్ ఏ థాన్

మొగల్రాజపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవంలో భాగంగా తమ పాఠశాలలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ మీట్ స్పోర్ట్స్ ఏ థాన్ నిర్వహిస్తున్నట్లు వీపీ సిద్ధార్థ పాఠశాల కన్వీనర్ సూరెడ్డి విష్ణు, ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి క్రీడలు దోహదం చేస్తాయని అందుకే క్రీడోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన పాఠశాలల జట్లు పాల్గొంటాయన్నారు.

ఫార్మశీ విద్యార్థులకు ఆత్మరక్షణ పద్ధతులపై శిక్షణ

మొగల్రాజపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఆత్మరక్షణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. జపాన్‌లో కరాటే సెవంత్ డాన్ పూర్తి చేసిన కోచ్ జె. విజయకుమార్ విపత్కర పరిస్థితుల్లో విద్యార్థులు తమని తాము ఎలా రక్షించుకోవాలో తెలియచేసే టెక్నిక్‌లను తర్ఫీదు ఇచ్చారు.

చురుగ్గా సాగుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

భారతీనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మూడో డివిజన్ కనకదుర్గ నగర్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న వాటర్‌ట్యాంక్ పనులు చురుకుగా సాగుతున్నాయి. కనకదుర్గ నగర్‌లో సుమారు రూ.2.8 కోట్లతో పార్కు స్థలంలో నిర్మిస్తున్న రిజర్వాయరు(వాటర్ ట్యాంక్)పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణంతో కనకదుర్గనగర్, శ్రీగణేష్ నగర్, కామినేని నగర్ కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి.



పరిష్కారం చూపరూ!



కృష్ణలంక 20వ డివిజన్ గౌతమినగర్ 3వ లైనులో మ్యాన్‌హోల్ పొంగి పొర్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డొంకరోడ్డు చివరన సాయిబాబా గుడి సమీపంలో వారధి రిటైనింగ్‌పై ఉంటున్న ఇళ్లలోని డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి చేరడంతో కాల్వను తలపిస్తోంది. ప్రజలు ఈ నీటిలోనే ఇళ్లకు, ఆలయానికి వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి చేరడం వలన దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-కృష్ణలంక, ఆంధ్రజ్యోతి

ఒరిగిన విద్యుత్ స్తంభాలు...భయపడుతున్న స్థానికులు

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: జవహర్ ఆటోనగర్ ఏటీపీ సెంటర్‌లో 33కేవీ విద్యుత్ లైన్ స్తంభం పక్కకు ఒరిగింది. ఈసెంటర్‌లో మేజర్ డ్రెయినేజీలో పూడికతీయడం వల్ల పక్కనే మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభం కొంతమేర పక్కకు ఒరిగింది. ప్రమాదభరితంగా ఉన్న ఈ స్తంభాన్ని సరిచేసి స్తంభం చుట్టూ సిమెంట్‌తో కాంక్రీట్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరగక ముందే ఆటోనగర్ విద్యుత్‌శాఖ అధికారులు చొరవతీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రామలింగేశ్వరనగర్: పటమట అంబేడ్కర్ నగర్ కాలువగట్టు ప్రాంతం రేవు పక్కన, హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు అమర్చారు కానీ పాత స్తంభాలు తొలగించలేదని, అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా వేసిన స్తంభం ఒరిగి పోవడం వలన నేలకొరిగి ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పటమట పాములు బజారు దేవీ లిటిల్ స్టార్ స్కూల్‌కు సమీపంలో ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం నివాసాలపై పడి ఎటువంటి ప్రాణనష్టం సంభవిస్తుందోననే ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆటోనగర్ ఏటీపీ సెంటర్‌లో, పటమట పాములబజారు దేవీ లిటిల్ స్టార్ స్కూల్‌కు సమీపంలో నివాసంపై ఒరిగిన విద్యుత్ స్తంభం

ఘాట్లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడండి

కమిషనర్ ధ్యానచంద్ర



కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఘాట్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కృష్ణవేణి ఘాట్, వినాయకుని గుడి, కెనాల్ రోడ్డు, దుర్గా ఘాట్ ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా ఎంత మంది భక్తులు వచ్చారు, అక్కడ పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది వంటి అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ఆఫ్రికా నత్తలు

● పంటల్ని నమిలేస్తున్నాయ్ ● కూరగాయ, బొప్పాయి పంటలపై ముప్పేట దాడి ● ఒక జంట నత్తలకు 2 వేల గుడ్లు

ఎక్కడి నుంచి వచ్చాయో కానీ ఈ ఆఫ్రికా నత్తలు.. పంటల్ని గంటల వ్యవధిలో హాంఫట్ చేసేస్తున్నాయి. బొప్పాయి, కూరగాయలపై ముప్పేట దాడి చేసి నమిలే స్తున్నాయి. నత్తలున్నాయని గ్రహించేలోపు పంటలకు తీరని నష్టం జరిగిపోతోంది. ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలతో సతమతమవుతున్న అన్నదాతలకు అప్పుడు నత్తల బెంగ పట్టుకుంది. ఎక్కన్నుంచి వచ్చాయో తెలియదు కానీ పంటలను తినేస్తున్నాయని వారు వాపోతున్నారు. ఒకప్పుడు వంకాయలను గ్రేడ్ చేసే సమయంలో పుచ్చులు కనిపించేవని, ఇప్పుడు నత్తలు తిన్న కాయలను కూడా గ్రేడింగ్ చేసుకోవాల్సి వస్తుందని, నత్తలు తిన్న కాయలను చెట్లకు వదిలేయలేక కోసి బయట పారేసుకోవాల్సి వస్తుందని లబోదిబోమంటున్నారు.

- జి.కొండూరు, ఆంధ్రజ్యోతి




నత్తలు తిన్న వంకాయలు, రోడ్డు పక్కన పారేసిన నత్తలు తిన్న వంకాయలు

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం గడ్డమణుగు పొలంలో కడియాల వెంకటేశ్వరరావు అనే రైతు సాగు చేసిన వంగ తోటలో వంకాయలు కాపుకొచ్చాయి. మంచి ధర లభిస్తోంది రేపో మాపో కోద్దాం అనుకుంటున్న ఆ రైతుకు చెట్టుపై ఒక నత్త కనపడింది. అరే ఒకటి కదా అని తీసేసి రెండు మూడు రోజుల తర్వాత కోతకు కూలీలను పిలిచి కాయలు కోయిద్దామనుకుంటున్న తరుణంలో వంకాయలకు గాట్లు ఉండటం గమనించాడు. చాలావరకు సగం తిని ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఉన్నటుండి ఒక్కొక్క చెట్టుకు అరడజనుకు పైగా నత్తలు దర్శనమివ్వడం రోజురోజుకూ అవి బలిష్టంగా పెరగడాన్ని గమనించి ఏరించాడు. అయితే అప్పటికే పంటకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఇతర ప్రాంతాల నుంచి రాక

మొక్కలపై అభిమానంతో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు తెచ్చుకుంటున్న మొక్కల ద్వారా ఆఫ్రికన్ నత్తలు ఈప్రాంతానికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. నత్త మాంసం తింటే మంచిదనే ఆలోచనతో మంచి నత్తలు అని తెస్తే ఆఫ్రికన్ నత్తలు వచ్చినట్లు తెలుసుకొని వారు అంతా అవాక్కయ్యారు.

ఒక జంట నత్తకు 2 వేలు గుడ్లు

ఒక జంట నత్తలకు 2వేలు గుడ్లు పెడతాయి. ఈక్రమంలో వాటి సంతానం రోజు రోజుకు దినదినాభివృద్ధి చెందుతుంది. బొప్పాయి పండ్లు అంటే చాలా ఇష్టమని మెత్తగా ఉంటాయి కనుక ఇష్టానుసారంగా తినేస్తాయి. బొప్పాయి లేకుంటే ఏ రకం పంటపై అయినా మూకుమ్మడి దాడి చేస్తాయి. కాయలు, పండ్లు లేకున్నా ఎండి ఆకులనైనా కొమ్మలనైనా తినేస్తాయి. భూమిలో నివాసం ఉంటాయి.

పంటకు చాలా నష్టం చేశాయి

కడియాల వెంకటేశ్వరరావు, కౌలు రైతు, జి.కొండూరు



నత్తలు వంగ పంటకు చాలా నష్టం చేశాయి. కోత దశలో ఉన్న కాయల్ని తినేడం వల్ల అవి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. పురుగుల నివారణకు కొట్టే మందులను నత్తలు తట్టుకొని కాయల్ని తినేస్తున్నాయి. ఇప్పటికే రెండు మూడు సార్లు కూలీలతో ఏరించినా మళ్లీ మళ్లీ పుట్టుకొస్తూనే ఉన్నాయి. నత్తల నివారణకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

ఇలా నివారించుకోవచ్చు

వేణు, ఉద్యానశాఖ అధికారి ఇబ్రహీంపట్నం

కాపర్ సల్ఫేట్ 3 గ్రాములు, పెర్రస్ సల్ఫేట్ 3 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి నత్తలు యాక్టివ్‌గా ఉండే ఉదయం వేళల్లో పిచికారి చేసుకోవాలి. ఒక ఎకరానికి 100 లీటర్లలో మందు కలిపిన ద్రావణం పిచికారీ చేస్తే నత్తలు కింద పడిపోతాయి. వాటిని గ్లౌజులు తొడిగిన చేతులతో ఏరి ఉప్పు కలిపిన నీటిలో వేసుకొని నివారించుకోవచ్చు. గ్లౌజులు వేసుకోకుండా నత్తలు పట్టుకుంటే వాటి నుంచి వచ్చే సొంగకు చర్మంపై దద్దుర్లు, దురదలు వచ్చే ప్రమాదం ఉంది.

బీసీలకు ఆధునిక పరికరాలు

● రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ● చైర్మన్లు, డైరెక్టర్ల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం
● ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి ● 3వ రోజు వివిధ కార్పొరేషన్స్ పాలక మండళ్లతో మంత్రి భేటీ



గొల్లపూడిలో వివిధ కార్పొరేషన్ల పాలక మండళ్లతో భేటీ అయిన మంత్రి సవిత

గొల్లపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆదరణ 3.0 ద్వారా ఆధునిక పనిముట్లు అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాలు, డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకం అమలుపై మూడు రోజుల వర్క్ షాప్ ముగింపు కార్యక్రమానికి మంత్రి ఎస్ సవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాలు, డైరెక్టర్లు అందించిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేసేలా కృషి చేస్తామన్నారు. కుల, చేతివృత్తులు వారికి ఆధునిక పరికరాలతో శాశ్వత ఉపాధి కల్పన కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రెండు రోజులుగా ఈ వర్క్ షాపులో 17 మంది చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశం కావడం జరిగిందని, వారి నుంచి అనేక విషయాలు తెలుసుకున్నామన్నారు. కార్పొరేషన్ చైర్మన్ల గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు లభించేలా ప్రాధాన్యతనిచ్చారన్నారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు సంబంధించి ఉచితంగా కోచింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఏ వృత్తిదారుడు ఎలాంటి పరికరాలు ఆశిస్తున్నారనే విషయమై సర్వే రూపంలో ఒక నివేదిక రూపొందించామని, దాన్ని సీఎం చంద్రబాబుకు అందిస్తామన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

తొలుత 17 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత సమావేశమయ్యారు. ఆదరణ 3.0 అమలుపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంతో పాటు చైర్మన్లు, డైరెక్టర్లకు వారి గౌరవాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా కార్పొరేషన్ల పాలక మండళ్లను ఉత్సవ విగ్రహాల మాదిరిగా కాకుండా వారికి బాధ్యతలు అప్పజెబుతామన్నారు. అనంతరం ఆయా కార్పొరేషన్ల వారీగా ముఖాముఖి నిర్వహించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఆయా బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో పారాగ్లైడింగ్..!

● విజయవాడ ఉత్సవ్‌లో తాత్కాలికంగా ఏర్పాటు
● నగర ప్రజల నుంచి అనూహ్య స్పందన
● తక్కువ ఖర్చు కావటంతో ఆదరణ
● శాశ్వత ఏర్పాటు ఆలోచనలో జిల్లా యంత్రాంగం



ఆంధ్రజ్యోతి, విజయవాడ: జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఎన్టీఆర్ జిల్లా వ్యవస్థ సద్వినియోగం చేసుకోవాలనుకుంటోంది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం ఫెర్రీలో పారాగ్లైడింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ - 2025లో భాగంగా తాత్కాలికంగా కొద్దిరోజుల పాటు పారాగ్లైడింగ్‌ను నిర్వహించారు. ఇందిరాగాంధీ స్టేడియంలో హెలీ రైడింగ్ సందర్భంలోనే ఇక్కడ పారాగ్లైడింగ్ ఏర్పాటు చేశారు. పారా గ్లైడింగ్ ఖర్చు తక్కువ కావటంతో పర్యాటకుల నుంచి ఆదరణ వచ్చింది. విజయవాడ ఉత్సవ్ ముగియటంతో పారాగ్లైడింగ్ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా అధికారులు పారాగ్లైడింగ్‌పై దృష్టి సారించారు. హెలీ టూరిజంను అభివృద్ధి చేసే క్రమంలో ముందుగా పారాగ్లైడింగ్‌ను ప్రారంభించాలని భావిస్తోంది. దీనికి సరైన ప్రాంతంగా ఇబ్రహీంపట్నం ఫెర్రీని ఎంచుకుంది. పారాగ్లైడింగ్ నిర్వహించే సంస్థలతో సంప్రదింపులు జరిపి వీలైనంత త్వరగా తక్కువ ఖర్చుతో పారాగ్లైడింగ్‌ను ప్రారంభించాలని భావిస్తోంది. హెలీ రైడింగ్‌తో పోల్చుకుంటే పారాగ్లైడింగ్‌కు ఖర్చు తక్కువగా ఉండటంతో ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ ఉత్సవ్‌లో నిర్వహించిన పారాగ్లైడింగ్ ఈవెంట్ ట్రయల్ రన్‌గా ఉపయోగపడింది. దీంతో పాటు పర్యాటకుల ఆదరణ ఎలా ఉంటుందన్న విషయం తెలిసింది.



ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

● రూ.74,600 స్వాధీనం

విజయవాడ/ఇబ్రహీంపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ సోదాలు జరిగాయి. ఏసీబీ జిల్లా డీఎస్పీ బీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, సత్యనారాయణ ఈ తనిఖీలు చేశారు. కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేస్తుండగా సబ్ రిజిస్టర్ ఎస్కే మహమ్మద్ సమీపంలోని బీరువాలో లెక్కలు లేని నగదు ఉన్నట్లు గుర్తించారు. రూ.74,600ను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు సోదాలు నిర్వహించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులకు వసూళ్లు చేయడానికి కార్యాలయంలో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులున్నట్లు అధికారులు గుర్తించారు. బీరువాలోని నగదు ఎలా వచ్చిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. నగదు విషయంతో పాటు డబుల్ రిజిస్ట్రేషన్ ఏమైనా జరిగాయా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. సోదాల సమయంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన 10 మందిని అధికారులు విచారించారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు నాగరాజు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



హ్యుండయ్ వెన్యూ కారును ఆవిష్కరిస్తున్న కోనేరు హంపి

విజయవాడ మార్కెట్లోకి హుండాయ్ వెన్యూ

గుణదల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల అభిరుచి మేరకు హుండాయ్ వెన్యూ కారును విజయవాడ మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్లు భారత చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి తెలిపారు. ఎనికేపాడులోని లక్కీ హుండాయ్ షోరూమ్‌లో జరిగిన హుండాయ్ వెన్యూ కారు ఆవిష్కరణ బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా కోనేరు హంపి విచ్చేశారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని హుండాయ్ వెన్యూ కారు రూపుదిద్దుకోవడంతో వినియోగదారులు ఈ కారును ఇష్టపడుతున్నారన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కారు రూపకల్పన జరిగిందని హుండాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ సీనియర్ మేనేజర్ డీ ధీరజ్ స్వరూప్ తెలిపారు. పవర్‌లిఫ్టర్, వెయిట్ లిఫ్టర్ సాదియా అల్మాస్ షేక్, ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే నాగుల్ మీరా, లక్కీ హుండాయ్ షోరూమ్ జిమ్ రోహిణీ కుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొడాలి అనుచరుడు అరెస్టు

● నకిలీ పోలీసుగా చలామణి అవుతూ బెదిరింపులు



శ్రీనివాసరావును అరెస్టు చేసిన పోలీసులు

గుడివాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ గా నటిస్తూ, ఆలయ పూజారి, ఇతరులను బెదిరిస్తున్న మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, వైసీపీ గుడివాడ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఘంటా హేమ శేష శ్రీనివాసరావును గుడివాడ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గుడివాడ మండలం మోటూరు గ్రామంలోని శ్రీగంగానమ్మ తల్లి దేవాలయానికి సంబంధించి కమిటీలో అంతర్గత విభేదాలున్నాయి. ఈ క్రమంలో వైసీపీ నేత శ్రీనివాసరావు పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ యూనిఫామ్ ధరించి, పోలీసుగా నటిస్తూ, దేవాలయ పూజారిని, ఇతరులను బెదిరించాడు. దేవాలయ తాళాలు, వాటర్ బోరు మోటార్‌ను బలవంతంగా లాక్కుని తీసుకుని పోయాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన శ్రీగంగానమ్మ తల్లి ఆలయ చైర్మన్ ఆనందాసు వెంకటరామయ్య ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. బుధవారం గుడివాడ మండలం మోటూరులో ఇంటి వద్ద ఉన్న ఘంటా శ్రీనివాసరావును రూరల్ ఎస్ఐ ఎన్ చంటిబాబు అరెస్టు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, శ్రీనివాసరావుకు 19 వరకు రిమాండ్ విధించారు.



కాలువలో బూడిదను తోడి రోడ్డు సగానికి పైగా పోసిన గుట్టలు

బూడిద దందాలో నీకెంత.. నాకెంత..?

● వైసీసీ చోటా నేతతో అధికారుల లాలూచీ..!

ఇబ్రహీంపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ చోటా వైసీపీ నేత బూడిద దొంగతనానికి అడ్డూ అదుపు లేకుండా పోతోందని స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ ఆరోపిస్తున్నారు. ఒకపక్క ఉచిత బూడిద లోడింగ్ కోసం పోరాటం చేస్తుంటే ఆ చోటా నేత బూడిద మేత అధికమయిందని ఆవేదన చెందుతున్నారు. బూడిద చెరువులోకి వెళ్లే పైపులైన్‌కు లీకులు పెట్టి బూడిద నీటితో పాటు కాలువలోకి వచ్చే బూడిదను యంత్రాలతో ఎత్తి రహదారిపై గుట్టలు గుట్టలుగా పోయి అమ్ముకుంటున్నాడని, ఎన్టీటీపీఎస్ అధికారులు అతడితో బేరం మాట్లాడుకొని నీక్కొంత, మాక్కొంత అనే సిద్ధాంతంతో ఎంచక్కా సొమ్ము చేసుకుంటూ తమ కడుపు కొడుతున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో సైతం వైసీపీ చోట నేత చేస్తున్న బూడిద దందాకు చెక్ పెట్టాలని ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

వీఎంసీలోని సబ్జెక్ట్ టీచర్ల పోస్టులు భర్తీచేయాలి

● డీఈవోను కోరిన ఉపాధ్యాయ సంఘ నేతలు

విజయవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ టీచర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఏ సుందరయ్య డీఈవో యూవీ సుబ్బారావును కోరారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం బుధవారం నగరంలోని బిషప్ అజరయ్య స్కూల్‌లో జరిగింది. కిందటేడాది ఎస్ఎస్‌సీ విద్యార్థుల కోసం వంద రోజుల కార్యాచరణలో భాగంగా సెలవుదినాల్లో పనిచేసిన వారికి సీసీఎల్ లీవ్ యాప్ ద్వారా 10రోజుల సెలవులు అప్లై చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లీవ్ యాప్‌లో సెలవులు ఎడిట్ ఆప్షన్‌ను డీడీవోలకు ఇవ్వాలని, ఫేషియల్ అటెండెన్స్‌లో సాంకేతిక సమస్యలున్నా, హాజరు పడకపోయినా ఉపాధ్యాయులు సకాలంలో రావడం లేదని ఉపాధ్యాయుల పేర్లను గ్రూపుల్లో వైరల్ చేయకుండా ఉండాలన్నారు. బదిలీల అనంతరం వేతనం రాని ముగ్గురు టీచర్ల జీతాల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరపాలని డీఈవోను కోరారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

డీసీపీ-1గా కృష్ణకాంత్ పటేల్ బాధ్యతల స్వీకరణ



విజయవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ డీసీపీ1గా కృష్ణకాంత్ పటేల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నంలో డీసీపీగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం విజయవాడకు బదిలీ చేసింది. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణకాంత్ పటేల్‌కు ఇంతకుముందు విజయవాడలో పనిచేసిన అనుభవం ఉంది. దీనిపై కొద్దిసేపు సీపీలో చర్చించారు.

వాస్తవ సాగు రైతులను నమోదు చేయాలి

● ఏపీ కౌలు రైతుల సంఘం

గవర్నర్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటల ఎన్యూమరేషన్‌లో ఎడిట్ ఆప్షన్ ఇచ్చి వాస్తవ సాగు రైతులను నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఇటీవల వచ్చిన తుఫాను వల్ల పంట నష్టం తీవ్రంగా ఉందని, ప్రత్తి, మిర్చి, అరటి, బొప్పాయి లాంటి తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులు, కౌలు రైతులు ప్రధానంగా నష్టపోయారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయాలంటే ఈ-క్రాప్‌లో ఎడిట్ ఆప్షన్ ఇచ్చి వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీఎఫ్‌సీసీఐ కార్యాలయం ప్రారంభం

గాంధీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నూతన కార్యాలయాన్ని ఛాంబర్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు బుధవారం ప్రారంభించారు. గాంధీనగర్‌లోని శ్రీసాయి భగవతి టవర్స్‌లోని మూడవ అంతస్తులోకి కార్యాలయాన్ని మార్చడం జరిగింది. ఇక ఇక్కడి నుంచే తమ కార్యక్రమాలను నిర్వహిస్తామని భాస్కరరావు తెలిపారు. ప్రధానకార్యదర్శి ఎస్.ఎల్.ఎన్.వరప్రసాద్, ఉపాధ్యక్షుడు బొప్పూడి రామకృష్ణ, సీఈవో మహేంద్ర, పలువురు ఛాంబర్ సభ్యులు పొన్నూరు రామకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజ స్థాపనలో

సహకార బ్యాంకుల పాత్ర కీలకం

● విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ అంజయ్య

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజ రూపకల్పనలో సహకార బ్యాంకుల పాత్ర కీలకమని విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఎస్.అంజయ్య అన్నారు. బుధవారం కొత్తపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ విజయవాడ వన్‌టౌన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సహకార సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజయ్య మాట్లాడుతూ సహకార బ్యాంకులు కేవలం ఆర్థిక కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కాకుండా సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తారని చెప్పారు. సమాజ అభివృద్ధిలో సహకార బ్యాంకులు కీలక పాత్ర వహిస్తున్నాయని చెప్పారు. 1916 జనవరి 11న సహకార సంఘంగా రిజిస్టర్ విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ 2025 నాటికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 57 బ్రాంచ్‌లతో 1,15,378 మంది సభ్యులతో సేవలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సి.కోటేశ్వరరావు, బ్యాంక్ జోనల్ మేనేజర్, విజయవాడ బ్రాంచ్ మేనేజర్, విజయవాడ వన్‌టౌన్ బ్రాంచ్ మేనేజర్, పలువురు బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

తిండిలేక.. నీళ్లు లేక.. అమ్మా ఆకలంటూ..!

● బిడ్డలు వదిలేసిన ఓ నాన్న వ్యథ ● ఆస్తి కోసం తండ్రిపై పిచ్చోడని ముద్ర ● ఇంట్లోనే బంధించిన కుమార్తెలు
● సాయం చేసిన వారిపై తిట్ల పురాణం ● పోలీసులకు చెప్పినా పట్టించుకోని వైనం ● బెజవాడలో దారుణం



కూతుళ్ల చేతిలో ఇంట్లోనే బందీగా వెంకట స్వామి

గుణదల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆటో నడిపి.. రేయింబవళ్లు కష్టించి ఇద్దరు ఆడ బిడ్డల్నీ అల్లారుముద్దుగా పెంచిన ఆ తండ్రి.. నేడు వారి చేతిలోనే బందీ అయ్యాడు. వృద్ధాప్యంలో ఆయనకు కొంచెం మానసిక స్థితి సరిగా లేకపోవడంతో.. పిచ్చోడని ముద్ర వేసి ఇంట్లో పెట్టి తాళం వేశారు. ఆస్తిపై అత్యాశతో.. కనీసం తిండికూడా పెట్టకుండా ఆయనను.. దయనీయ స్థితికి నెట్టారు. తండ్రి ప్రాణం పోతే ఆస్తిని త్వరగా దక్కించుకోవాలని రాక్షసత్వంగా వ్యవహరిస్తున్నారు. విజయవాడ రెండో డివిజన్‌లో వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు ఇలా.. ఇక్కడి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురుగా గల జమిందార్ రోడ్డులో నివాసముంటున్న డేరంగుల వెంకట స్వామి, పద్మ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. వెంకట స్వామి ఆటో నడిపి జీవనం సాగించేవారు. వీరు తమ ఇద్దరు ఆడపిల్లల్నీ అల్లారు ముద్దుగా పెంచి, శక్తికొలదీ ఇచ్చి పెళ్లి చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. తొమ్మిదేళ్ల క్రితం భార్య చనిపోయింది. వెంకట స్వామి బ్రెయిన్‌కు చిన్న సమస్య రావడంతో కుమార్తెలు వైద్యం చేయించారు. అప్పటి నుంచి ఆటో తోలడం మానేయాల్సి వచ్చింది. మానసిక స్థితి కొంతవరకు బాగోలేదు. దీంతో కుమార్తెలు తండ్రిని వృద్ధాశ్రమంలో పెట్టారు. అక్కడ వారికి నగదు చెల్లించకపోవడంతో వారు వెంకటస్వామిని అక్కడి నుంచి తీసుకెళ్లిపొమ్మని చెప్పారు. దీంతో తండ్రిని తీసుకొచ్చి జమిందార్ వీధిలోని ఆయన సొంత ఇంట్లోనే పెట్టి తాళం వేసుకుని, ఇంట్లో సామగ్రి మొత్తం తీసుకుని వెళ్లిపోయారు. తిండీ తిప్పలు లేకుండా ఉంటే చనిపోతాడని, అప్పుడు ఆస్తి పంపకాలు చేసుకోవచ్చన్నది వారి ఆలోచన. ఆయన అన్నమో రామచంద్రా అంటూ కేకలు వేస్తుండటంతో.. చుట్టుపక్కల వారు తోచింది ఏదో ఒకటి పెట్టి వస్తున్నారు. ఈవిషయం తెలిసి కూతులిద్దరూ అక్కడికి వచ్చి.. స్థానికులపై దారుణమైన తిట్లపురాణం లంకించుకుంటున్నారు. వెంకటస్వామి ఒంటిపై నూలుపోగు వస్త్రం లేదు. స్థానికుల సమాచారంతో పోలీసులు సైతం అక్కడికి వచ్చినా.. వారు కూడా.. వెంకటస్వామి పిచ్చివాడనే ముద్రనే నమ్మి వెళ్లిపోయారని చెబుతున్నారు. ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వెంకట స్వామి ప్రాణాలు గాల్లో కలవకుండా చూడాలని స్థానికులు కోరుకుంటున్నారు.

జీవ ఎరువులతో భూమాతకు రక్ష: కలెక్టర్

కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల స్థానంలో జీవ ఎరువులను (బయో ఫెర్టిలైజర్స్) ప్రోత్సహించాలని, వీటిని విరివిగా వాడేలా రైతుల్ని చైతన్యపరచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి భూమాత రక్షణ కమిటీ (మదర్ ఎర్త్ ప్రొటెక్షన్ కమిటీ) సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం భూమాత రక్షణ చేపట్టిందన్నారు. జిల్లా, సబ్ డివిజన్, గ్రామస్థాయిలలో వివిధ శాఖల అధికారులతో భూమాత రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. 12వ తేదీ నాటికి కమిటీలను ఏర్పాటుచేసి గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. డ్రోన్‌లున్న గ్రామాల్లో లిక్విడ్ యూరియా/నానో యూరియా వినియోగించాలన్నారు. ఎరువులు పక్కదారి పట్టకుండా కమిటీలు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాస్థాయి భూమాత రక్షణ కమిటీ సభ్యులైన జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, పోలీసు అధికారి తిరుమలేశ్వరెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి త్రినాథ్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రవికిషోర్, ఏడీఏ అనిత పాల్గొన్నారు.

ఆర్టీఐహెచ్ కార్యాలయం సందర్శించిన కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్: ఎనికేపాడులోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) స్పోక్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సందర్శించారు. స్పోక్ ద్వారా కొనసాగుతున్న ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్ కార్యక్రమాలను సమీక్షించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్యూచర్ ఫౌండర్స్, లీడర్స్ లెన్స్ గురించి స్పోక్ బృందం కలెక్టర్‌కు వివరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆశయాలకు అనుగుణంగా ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఆర్టీఐహెచ్ విజయవాడ సీఈఓ జి.కృష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్ డి.రవితేజ, బృంద సభ్యులు నందన్, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సంస్థను బలోపేతం చేయండి

● ఏపీ నూతన కమిటీకి తెలంగాణ అధ్యక్షుడు సూచన

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్)ను ఏపీలో బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐవీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్‌కు నూతన కమిటీ నియామకం జరిగింది. తెలంగాణ ఐవీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు. ఏపీ ఐవీఎఫ్ అధ్యక్షుడిగా కోన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి.రామ్మోహన్‌రావు, ట్రెజరర్‌గా సుబ్బారాయుడు, మరికొంతమందిని వివిధ పదవుల్లో నియమించారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ తనను ఐవీఎఫ్ గౌరవాధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐవీఎఫ్ అదనపు కార్యదర్శి కె.మహేష్, యువజన విభాగం అధ్యక్షుడు అభినయ్, మహిళా విభాగం అధ్యక్షురాలు సుప్రజ పాల్గొన్నారు.

'నిర్వాణ' గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కామ్రేడ్ బీఆర్‌కే, పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత, నాటకకర్త, ప్రయోక్త డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన నిర్వాణ (నవల) గ్రంథావిష్కరణను ఏఎండి ఇంతియాజ్ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతికి, ప్రశాంతతకు బుద్ధుడు ప్రతీకన్నారు. బుద్ధుడు మానవుని అజ్ఞానానికి, కష్టాలకు కారణాలను, వాటి నుంచి విముక్తి పొందడానికి మార్గాలను తెలుసుకోగలిగాడన్నారు. జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి కార్యదర్శి గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ఆచరణీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు, పీఎస్‌పీ నరేంద్రనాథ్, రేకా కృష్ణార్జున బోధి పాల్గొన్నారు.

9 ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 6 నవంబరు 2025



మన అమ్మాయిలు ప్రపంచ క్రికెట్ కప్ గెలుచుకోవటంతో దేశమంతా ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకుంది. ఇప్పటి దాకా కేవలం పురుషుల క్రికెట్‌కు మాత్రమే దక్కిన గౌరవం మహిళా క్రికెట్‌కు కూడా దక్కుతోంది. కానీ ఈ గౌరవాలేవీ అందకపోయినా- కేవలం క్రికెట్ మీద ప్రేమతో ఆటనే నమ్ముకున్నవారెందరో. అలాంటివారిలో ఒకరు లెవల్ 2 కోచ్‌గా అర్హత సాధించిన **సిరిగుడి కవిత**. ప్రస్తుతం అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్న షబ్నం, మహంతి, తమన్నా లాంటి క్రికెటర్లకు బేసిక్ స్థాయిలో కోచింగ్ ఇచ్చింది కూడా కవితే! ఆమె తన ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

కష్టాలను గెలిచి కోచ్‌గా ఎదిగి

"మా నాన్న టాక్సీ డ్రైవర్. అమ్మ సాధారణ గృహిణి. రెక్కాడితే తప్ప డొక్కాడని పరిస్థితి. 'మన ఆర్థిక స్థితికి ఆటలు సరిపడవు. బాగా చదువుకో..' అంటూ ఉండేవారు. కానీ క్రికెట్ అంటే ఆసక్తి. స్కూల్లో చదువుతున్న సమయంలో క్రికెట్‌లో శిక్షణ పొందా. కానీ క్రికెట్ మీద మాత్రమే దృష్టి పెట్టలేని స్థితి. అందువల్ల ఒక వైపు చదువుకుంటూనే మరో వైపు క్రికెట్ ప్రాక్టీసు చేస్తూ ఉండేదాన్ని. అంతే కాకుండా నా చిన్నప్పుడు క్రికెట్ ఆడే మహిళలు తక్కువే ఉండేవారు. ఎందుకంటే- మహిళా క్రికెట్‌కు ఎక్కువ ప్రోత్సాహం ఉండేది కాదు. 2004 నుంచి పురుషుల క్రికెట్ బోర్డు- మహిళా క్రికెట్‌ను కూడా నియంత్రించటం మొదలుపెట్టింది. దీనితో మహిళా క్రికెటర్లకు కొంత ప్రోత్సాహం లభించింది. విశాఖ జిల్లా క్రికెట్ సంఘం కూడా అమ్మాయిలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేది. నేను కూడా వేసవి క్రీడా శిక్షణ శిబిరంలోనే మెలకువలు అభ్యసించా. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి టోర్నీలలో ఆడే అవకాశం లభించింది. 2013లో సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాను. ఆ టోర్నీలో స్వర్ణ పతకం సాధించాం.

కోచ్‌గా ప్రస్థానం..

2014లో కోచ్‌గా నా ప్రస్థానం ప్రారంభమయింది. ఆ సమయంలోనే షబ్నం, మహంతి లాంటి క్రికెటర్లకు ప్రాథమిక శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాను. వీరందరూ ప్రస్తుతం అండర్-19 భారత జట్టులో ఆడుతున్నారు. అలాగే ఏయూ సౌత్ జోన్, ఆలిండియా యూనివర్సిటీల మహిళా క్రికెట్ టోర్నీలలో స్వర్ణ పతకాలు గెలిచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు కోచింగ్ ఇచ్చాను. సీనియర్ విమెన్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన తొలి మహిళా క్రికెటర్‌ను నేనే! వృత్తిపరంగా



అంతా బాగా సాగుతోందని భావిస్తున్న సమయంలో- మా అమ్మా, నాన్నా ఒకే ఏడాది మరణించారు. దీనితో తమ్ముళ్ల బాధ్యత కూడా నాపై పడింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక వైపు క్రికెట్ కోచ్‌గా.. మరో వైపు ఫిజికల్ ఫిట్‌నెస్ టీచర్‌గా పనిచేశాను. ఉదయం, సాయంత్రం కోచింగ్ ఇస్తూ.. రోజంతా స్కూల్లో పనిచేయటం చాలా కష్టమయ్యేది. రెండింటిలో ఒకటి మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్రికెట్ మీద మక్కువతో కోచ్‌గానే స్థిరపడాలనుకున్నాను.

కోచింగ్‌తో పాటు..

చాలా మంది కోచింగ్ అంటే కేవలం ఆటలో మెలకువలు తెలియచెప్పటం అనుకుంటారు. కానీ కోచింగ్ అంటే- ఒక క్రీడాకారుల వ్యక్తిత్వాన్ని పూర్తిగా తీర్చిదిద్దటం. మెలకువలతో పాటుగా మానసిక స్థైర్యాన్ని ఇవ్వటం కూడా చాలా ముఖ్యమైన పని. అందుకే క్రికెట్‌తో పాటుగా నేను యోగా, ప్రాణిక్ హీలింగ్ లాంటి కోర్సులు చేశాను. ఇవన్నీ నాకు కోచింగ్‌లో ఎంతో ఉపకరిస్తాయి. ఒక వైపు ఈ కోర్సులు చేస్తూనే- గత ఏడాది నేను లెవెల్-2 కోచ్‌గా అర్హత సాధించాను. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ అర్హతను సాధించిన రెండో మహిళను కావటం చాలా గర్వంగా అనిపిస్తోంది. ప్రస్తుతం నా దృష్టంతా కోచింగ్ పైనే ఉంది. అందుకే పెళ్లి కూడా చేసుకోలేదు. మన దేశానికి ప్రతిష్ఠను తీసుకువచ్చే మహిళా క్రీడాకారులను తీర్చిదిద్దటమే నా లక్ష్యం. దాని కోసమే శ్రమిస్తున్నాను."

• భాస్కర్, విశాఖపట్నం

కౌన్సెలింగ్

విడాకులే శరణ్యమా?

Q A

డాక్టర్! మా అమ్మాయికి ఇటీవలే పెళ్లైంది. అల్లుడిది సంప్రదాయ కుటుంబం. అతను మంచివాడు, మంచి ఉద్యోగం చేస్తున్నాడు. అయితే అతను లైంగిక జీవితంలో చొరవ తీసుకోవడం లేదనీ, తమ అభిప్రాయాలూ, అభిరుచులూ కలవడం లేదనీ, అలాంటి వ్యక్తితో జీవితం కొనసాగించలేననీ మా అమ్మాయి అంటోంది. స్నేహితురాళ్ల వైవాహిక జీవితాలతో పోల్చుకొని నిరుత్సాహపడుతోంది. అంతిమంగా విడాకులు తీసుకోవాలని నిశ్చయించుకుంది. దాంతో అల్లుడిని వైద్యులకు చూపించాం. అతనిలో శారీరకపరమైన లోపం లేదని తేలింది. అలాంటప్పుడు మంచివాడైన అల్లుడిని వదులుకోవడం మాకు ఇష్టం లేదు. వీరి మధ్య సఖ్యత కుదిరే మార్గం లేదా? మందులతో ఉపయోగం ఉంటుందా?

- ఓ సోదరి, హైదరాబాద్.



అభిరుచులు, ప్రవర్తనలు పెరిగిన వాతావరణాన్ని బట్టి ఏర్పడతాయి. మీ అల్లుడు సంప్రదాయ కుటుంబంలో, కఠినమైన కట్టుబాట్ల మధ్య పెరిగినట్టు అర్థమవుతోంది. మీ అమ్మాయి సిటీలో, స్వేచ్ఛగా పెరిగింది. కాబట్టి వీళ్లిద్దరి ఇష్టాఇష్టాల్లో, అభిప్రాయాల్లో, అభిరుచుల్లో తేడాలు ఉండడం సహజం. లైంగికపరమైన అంశాల్లో కూడా ఇద్దరి ఆలోచనలూ విభేదించవచ్చు. మీ అల్లుడికి ఉన్న ఇన్హిబిషన్స్ వల్ల అమ్మాయితో లైంగికంగా చొరవ చూపించలేకపోయి ఉండవచ్చు. ఆమె దూకుడుగా వ్యవహరించడంతో అతను మరింత బెరుకుగా వెనుకంజ వేస్తూ ఉండి ఉండవచ్చు. ఈ ధోరణితో మీ అమ్మాయి విసుగుచెంది విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకుని ఉంటుంది. అయితే విడాకులు తీసుకుని, మరో పెళ్లి చేసుకున్నా... అతనితో అన్ని అంశాలూ మ్యాచ్ అవుతాయని చెప్పలేం కదా? అలాంటప్పుడు మంచివాడైన భర్తని దూరం చేసుకోవడం ఎంతవరకు సమంజసం? కాబట్టి మ్యారేజ్ కౌన్సెలర్ల ద్వారా ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇప్పించండి. సమస్య అతని శరీరంలో లేదు కాబట్టి మనసు మార్చి, అమ్మాయికి తగ్గట్టు నడుచుకునేలా కౌన్సెలింగ్ చేయాలి. కౌన్సెలింగ్‌తో అతనిలో ఆత్మవిశ్వాసం పెరిగి అమ్మాయికి తగ్గట్టు నడుచుకునే వీలుంది. అలాగే మీ అమ్మాయి, సాటి స్నేహితురాళ్ల లైంగిక జీవితాలతో తన జీవితాన్ని పోల్చుకుంటూ, అతన్ని అవమానించడం మానుకోమని చెప్పండి. పెరిగిన వాతావరణంతో భర్తకు అలవడిన ప్రవర్తనా తీరును అర్థం చేసుకుని, అతనిలో క్రమేపీ మార్పు తీసుకురావడానికి ప్రయత్నించమనండి. ఇలా నడుచుకుంటే క్రమేపీ ఇద్దరి మధ్యా సఖ్యత పెరిగి వారి మధ్య దూరాలు మాయం అవుతాయి.

• డాక్టర్ రాహుల్ రెడ్డి, ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్... మన హైదరాబాదీ!

ముస్లింలు అత్యధికంగా ఉన్న దేశాలపై 2017లో డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రయాణ ఆంక్షలు గజాలా హష్మీలో ఆగ్రహావేశాలను రేకెత్తించాయి. అమెరికన్ పరిపాలనలో సమ్మిళితత్వం, సమానత్వం ఉండాలని కోరుకొనే వారి ప్రతినిధిగా... ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇప్పుడు... అదే ట్రంప్ అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో... ప్రతిష్ఠాత్మకమైన వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఘనమైన విజయాన్ని గజాలా సాధించారు. ఆమె ఆ పదవికి ఎన్నికైన మొదటి ఇండియన్-అమెరికన్‌గా, తొలి సౌత్-ఏషియన్ అమెరికన్‌గా, తొలి ముస్లింగా... చరిత్ర సృష్టించారు. మార్పు దిశగా సాగుతున్న వర్జీనియాలో... డెమొక్రటిక్ పార్టీ కొత్త తరం నాయకత్వానికి ప్రతినిధిగా పరిశీలకులు అభివర్ణిస్తున్న గజాలా తొలి అడుగులు వేసింది మన హైదరాబాద్‌లోనే!



తల్లిదండ్రుల స్ఫూర్తితో...

1964 జనవరి 17న... హైదరాబాద్‌లో గజాలా జన్మించారు. ఆమె బాల్యం మలక్‌పేటలోని అమ్మమ్మ ఇంట్లో గడిచింది. ఆమె తాత రాష్ట్ర ఆర్థిక శాఖలో ఉద్యోగి. తండ్రి జియా హష్మీకి జార్జియాలో ఉద్యోగం రావడంతో... తల్లి, అన్నలతో పాటు నాలుగేళ్ళ వయసున్న గజాలా భారతదేశాన్ని వదిలి అమెరికాకు వలస వెళ్ళారు. జియా హష్మీ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో ఎంఏ, ఎల్‌ఎల్‌బి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినాలో అంతర్జాతీయ సంబంధాలపై పిహెచ్‌డి చేశారు. తరువాత ప్రొఫెసర్‌గా పనిచేశారు. 'సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్'ను స్థాపించి, పదవీ విరమణ చేసేవరకూ ఆ సంస్థ డైరెక్టర్‌గా కొనసాగారు. హైదరాబాద్‌లోని కోఠీ ఉమెన్స్ కాలేజీలో చదివిన గజాలా తల్లి తన్వీర్ హష్మీ... బీఏ, బీఈడీ చేశారు. తల్లిదండ్రుల స్ఫూర్తితో... బోధనా వృత్తి మీద గజాలా మక్కువ పెంచుకున్నారు. హైస్కూల్ స్థాయిలోనే ఉపకారవేతనాలు, ఫెలోషిప్‌లు అందుకున్నారు. జార్జియా సదరన్ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్, అట్లాంటాలోని ఎమోరీ యూనివర్సిటీలో... అమెరికన్ సాహిత్యంలో పిహెచ్‌డి చేశారు.



ప్రజా సమస్యలపై గళం విప్పి...

అజహర్ రఫీతో వివాహం తరువాత... రిచ్మాండ్ ప్రాంతంలో గజాలా స్థిరపడ్డారు. వారికి యాస్మిన్, నూర్ అనే ఇద్దరు అమ్మాయిలున్నారు. యూనివర్సిటీ ఆఫ్ రిచ్‌మండ్‌లో ప్రొఫెసర్‌గా గజాలా వృత్తి జీవితం ప్రారంభించారు. ఆ తరువాత రెనాల్డ్స్ కమ్యూనిటీ కాలేజీలో పని చేశారు. ఆ కాలేజీలో 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అండ్ లెర్నింగ్' (సిఇటిఎల్)కు వ్యవస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు. ముప్ఫయ్యేళ్ళపాటు ప్రొఫెసర్‌గా పని చేసిన గజాలా... 2019లో రాజకీయాల్లో ప్రవేశించారు. రిపబ్లికన్ ప్రాబల్యం ఉన్న స్టేట్ సెనెట్ సీటులో సంచలన విజయం సాధించారు. 2023లో మరోసారి గెలిచారు. 2024లో... 'సెనెట్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ కమిటీ'కి చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. 'రైట్ టు వర్క్' చట్టాలకు మద్దతివ్వడంతో పాటు విద్య, ఆరోగ్య సంబంధమైన బిల్లులను సెనేట్‌లో ప్రవేశపెట్టడం ద్వారా ఆమె ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారు.

తాజాగా లెఫ్టినెట్ గవర్నర్ పదవికోసం పోటీ పడిన గజాలా... గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్యం లాంటి అంశాల్లో నెలకొన్న అసమానతలను తొలగిస్తాననీ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు. పౌరుల జీవితాలను మెరుగుపరచడానికి అంకితమవుతానని ప్రకటించారు. ఇటీవలి ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి జాన్ రీడ్‌పై ఘన విజయం సాధించారు.

తగ్గేది లేదు...

తను గెలిచిన తరువాత గజాలా మాట్లాడుతూ... "ప్రజలను అధోగతి పట్టించేవారిని కాకుండా వారి అభ్యున్నతికి పాడుపడే నాయకత్వాన్ని వర్జీనియా ఎన్నుకొంది. వర్జీనియాకు ఎంతో వైవిధ్యం ఉంది. భవిష్యత్ పట్ల దార్శనికత ఉంది. వాటి పట్ల విశ్వాసం ఉంచిన ఓటర్లకు ధన్యవాదాలు. 'మన వైవిధ్యమే మనకున్న గొప్ప బలం' అని ఈ రోజు వర్జీనియా రుజువు చేసింది.

మనం వెనక్కి తగ్గేది లేదు... కలిసి కట్టుగా ముందుకు సాగుదాం" అని పిలుపునిచ్చారు. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఆమె ఎన్నిక కావడంతో... సెనేట్‌లో ఖాళీ అయిన ఆమె స్థానాన్ని ప్రత్యేక ఎన్నిక ద్వారా భర్తీ చేస్తారు. వర్జీనియా స్టేట్ సెనేట్లో ప్రస్తుతం డెమొక్రాట్లకు ఇరవై ఒక్క స్థానాలు, రిపబ్లికన్లకు పంతొమ్మిది స్థానాలు ఉన్నాయి. సీట్ల మధ్య వ్యత్యాసం తక్కువ కావడంతో... గజాలా పాత్ర కీలకం కాబోతోంది.

ఇలా చేస్తే పిగ్మెంటేషన్ మాయం

ఎండలో ఎక్కువగా తిరగడం, వాతావరణ కాలుష్యం వల్ల చర్మం ఛాయ తగ్గి ముఖంపై పిగ్మెంటేషన్ ఏర్పడుతూ ఉంటుంది. చిన్న చిట్కాలతో దీన్ని పోగొట్టుకోవచ్చు. ఆ వివరాలు...

- బయటికి వెళ్లేటప్పుడు ముఖానికి సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటే పిగ్మెంటేషన్ సమస్య రాదు.
- రాత్రి పడుకునేముందు ముఖానికి కలబంద గుజ్జు పట్టించి ఉదయాన్నే చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే కలబంద లోని అలోయిన్ పదార్థం చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది.
- రోజూ ఉదయాన్నే ఆలుగడ్డ రసం లేదా పెరుగును ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండురోజులకు ఒకసారి చేస్తూ ఉంటే ముఖం కళకళలాడుతుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, ఒక చెంచా పసుపు వేసి నాలుగు చెంచాల గులాబీ నీరు చిలకరించి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తరువాత వేళ్లతో మెల్లగా రుద్దుతూ పిండిని తొలగించాలి. ఆపైన గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖమంతా రాయాలి. పావు గంట తరువాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే సమస్య తీరుతుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల బియ్యప్పిండి, ఒక చెంచా ముల్తాని మిట్టి, నాలుగు చెంచాల పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తూ ఉంటే ముఖంపై పిగ్మెంటేషన్ మచ్చలు తొలగిపోతాయి.
- ఒక పళ్లెంలో బియ్యప్పిండి లేదా శనగపిండి తీసుకుని మధ్యకు కోసిన టమాటా ముక్కతో అద్దాలి. దీంతో ముఖాన్ని పది నిమిషాలు మెల్లగా రుద్దాలి. తరువాత చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే ఫలితం ఉంటుంది.
- ముఖానికి బాగా పండిన బొప్పాయిపండు గుజ్జు లేదా టమాటా రసం రాసినా నలుపుదనం తగ్గుతుంది.



పాతకాలపు చీరలకు కొత్త వైభవం

పాత రోత, కొత్త వింతగా చలామణి అవుతున్న నేటి ఆధునిక యుగంలో పాతకాలపు చీరలకు పూర్వ వైభవాన్ని తెచ్చిపెట్టాలనుకుంది ఒక జంట. అందుకోసం ఇంజనీరు ఉద్యోగాలకు రాజీనామా చేసి, పూర్వానుభవం లేని చీరల వ్యాపారంలోకి అడుగుపెట్టి, నేడు నెలకు కోటి రూపాయలను ఆర్జించే స్థాయికి ఎదిగింది. వినూత్నమైన ఆలోచనతో విజయం సాధించిన బెంగుళూరుకు చెందిన దంపతులు, పూజ నడిగ్, శశాంక్ శివపురపుల ఆసక్తికరమైన కథ ఇది...

వినూత్నం

బెంగళూరుకు చెందిన పూజ, బి.ఎమ్.ఎస్ కాలేజీలో ఇంజినీరింగ్ చదివింది. ఆ తర్వాత టిసిఎస్‌లో ఐదేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ విభాగంలో కొనసాగింది. మంచి సంపాదన, చేతి నిండా పని. అయినా ఎక్కడో ఏదో అసంతృప్తి. శశాంక్ కూడా హైదరాబాద్‌కు చెందిన సివిఆర్ కాలేజీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఆ తర్వాత కెరీర్ మార్చి, హెచ్‌పి సేల్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేశాడు. అక్కడ కూడా ఇమడలేక చిన్న స్టార్టప్ మొదలుపెట్టి, అనుభవరాహిత్యంతో దానికి మధ్యలోనే గుడ్‌బై చెప్పేశాడు. ఆ సమయంలోనే వాళ్లిద్దరూ ఒకరికొకరు ఎదురుపడ్డారు. ప్రేమలో పడ్డారు. అయితే పెళ్లికి ముందే, జీవితంలో స్థిరత్వం సాధించాలనే ఆలోచనతో ఆ తర్వాత శశాంక్ ఫిలిప్పైన్స్ వెళ్లి ఎమ్‌బిఏ చేశాడు. ఆ అనుభవంతో ఒక చిన్న వ్యాపారంలోకి దిగాడు. 2019లో వాళ్లిద్దరూ పెళ్లితో ఒకటయ్యారు. ఎమ్‌బిఏ పూర్తి చేసిన శశాంక్‌కు సాంకేతిక రంగంలో అవకాశాలు కుప్పలుతెప్పలుగా వచ్చిపడుతున్నాయి. అలా అంతా సవ్యంగా సాగుతుందనుకున్న సమయంలో పూజ.. ఇంజనీర్ ఉద్యోగానికి స్వస్తి చెప్పి, చీరల వ్యాపారం మొదలుపెట్టాలని నిర్ణయించుకుంది. ఆ నిర్ణయాన్ని శశాంక్‌తో పంచుకున్నప్పుడు, అతను సందిగ్ధంలో పడిపోయాడు. కానీ చీరల డిజైనింగ్ పూజకు కొత్త కాదు. ఆమె ముందు నుంచే తన దుస్తులను తానే స్వయంగా డిజైన్ చేసుకుని కుట్టించుకుంటూ ఉంటుంది. పాత చీరల పట్ల మక్కువతో అమ్మమ్మ బీరువాలో నుంచి ఆవిడ చీరలను తీసుకొని, వేడుకలకు కట్టుకుంటూ ఉంటుంది. ఈ విషయం తెలుసుకున్న శశాంక్.. పూజ ఆలోచనతో ఏకీభవించాడు. కానీ అదే సమయంలో కొవిడ్ లాక్‌డౌన్ మొదలైంది. దాంతో చీరల వ్యాపారానికి సంబంధించి చక్కని ప్రణాళిక రూపొందించుకోడానికి వాళ్లిద్దరికీ సరిపడా తీరిక చిక్కింది. అలా కొవిడ్ కాలంల.. ఇద్దరూ ఉద్యోగాలకు స్వస్తి పలికి, 'నరిగె స్టోరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా తమ చీరల వ్యాపారానికి శ్రీకారం చుట్టారు.



అంచెలంచెలుగా ఎదిగి...

ప్రారంభంలో శశాంక్ ఫొటోగ్రాఫర్‌గా, పూజ మోడల్‌గా ఇన్‌స్టాగ్రామ్ ప్రమోషన్ రీల్స్, ఫొటోస్‌ను రూపొందించుకున్నారు. అప్పటికే విపణిలో ఉన్న చీరల స్థానాన్ని అధిగమించాలనే ఆలోచన వాళ్లకు లేదు. మనుగడలో ఉన్న చీరల సామ్రాజ్యంలో ఖాళీలను భర్తీ చేయాలనే సంకల్పం మాత్రం మెండుగా ఉంది. పలు రకాల పోకడలు, పలు రకాల శైలులు రాజ్యమేలుతున్న ఆధునిక యుగంలో పాతకాలపు చీరలు కనుమరుగైపోతూ ఉండడం పూజ భరించలేకపోయింది. ఆ చీరల ప్రాశస్త్యాన్ని, ప్రత్యేకతలను చాటడంతో పాటు, పాతచీరలకు పూర్వ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో, తన వ్యాపారానికి 'నరిగె స్టోరీ' అనే పేరును ఎంచుకుంది. కన్నడంలో 'నరిగె' అంటే 'కుచ్చిళ్లు' అని అర్థం. పాతకాలపు చీరల వైపు మహిళలను ఆకర్షించడానికి అదే తగిన పేరని భావించిందామె. చీర తయారీ, నేతల పుట్టుపూర్వోత్తరాలను తెలుపుతూ, వాటి ప్రత్యేకతను సగర్వంగా చాటుకోగలిగేలా మహిళలను ఆకట్టుకోగలిగిందామె.



పాతకాలపు పేర్లు, రంగుల్లో...

1950ల నాటి శైలులను ప్రతిబింబించే నరిగె నేత చీరలు ప్రధానంగా దక్షిణ భారతీయ సాంస్కృతిక మూలాలనూ, కళాత్మకతలనూ ప్రతిబింబిస్తూ ఉంటాయి. రూపొందే ప్రాంతాల పేర్లనే చీరలకు పెట్టడంతో పాటు, పాతకాలపు కాఫీ బ్రౌన్, నీలం రంగు చీరలను కూడా పరిచయం చేస్తోంది పూజ. ఆమె విక్రయించే చీరల్లో, సిహి నెనపు, గగన మయూరి, ఇరవు వానం, లాల్ ఇష్క్ పేర్లతో చీరలున్నాయి. వారణాసి, మదురై, తమిళనాడు, కర్నాటక, జైపూర్, కోల్‌కతాలలోని చేనేత కళాకారుల చేత ప్రత్యేకంగా వస్త్రాలను నేయించి, వాటిని స్వయంగా చీరల రూపంలో డిజైన్ చేయడం 'నరిగె స్టోరీ' ప్రత్యేకత. ఈ చీరలన్నీ 2 వేల నుంచి 25 వేల రూపాయల ధర పలుకుతాయి. 2021లో 30 లక్షల వార్షిక ఆదాయాన్ని ఆర్జించిన 'నరిగె స్టోరీ' ఇప్పుడు నెలకు కోటి రూపాయలను ఆర్జించే స్థాయికి ఎదిగింది.

"మేం కేవలం చీరలను విక్రయించడం లేదు... చీరల రూపంలో ఆనందాన్ని విక్రయిస్తున్నాం. మరుగున పడిపోయిన పాత జ్ఞాపకాలను, అనుబంధాలనూ తిరిగి పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నాం" అంటున్న పూజ... అంతరించిపోతున్న చీరల సంస్కృతికి నరిగె చీరలతో పూర్వ వైభవాన్ని తెచ్చిపెట్టడంలో విజయం సాధించిందనే చెప్పుకోవచ్చు.

కివీ... ఈ పండు ఖరీదు కాస్త ఎక్కువే కానీ మన ఆహారంలో చేర్చుకొంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఇందులో విటమిన్-సి, ఎ, ఇ విటమిన్లు లభిస్తాయి. పొటాషియం, కేల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ లాంటి మినరల్స్‌తో పాటు డైటరీ ఫైబర్ కూడా పుష్కలం. పిండిపదార్థాలు, కేలరీలు తక్కువ.

మినరల్స్... విటమిన్ల గని

రోగనిరోధకశక్తి: కివీలో సి-విటమిన్ అధికంగా లభిస్తుంది. హానికర వ్యాధులు, వైరస్‌లతో పోరాడే యాంటీఆక్సిడెంట్‌లు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. తరచూ ఇబ్బందిపెట్టే జలుబు, ఫ్లూ బారిన పడే అవకాశాలను తగ్గిస్తుంది. కివీలోని విటమిన్-ఇ శరీరంలో టి-సెల్స్ కౌంట్‌ను పెంచుతుంది. మొత్తంగా రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. మధుమేహం ఉన్నవారు కూడా కివీని తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

నిద్రలేమికి: కివీలోని సెరోటోనిన్ నిద్రలేమి సమస్యకు చక్కగా పని చేస్తుంది. పడుకోబోయే ముందు ఒక పండు తింటే సుఖనిద్ర పడుతుంది. అలాగే దీనిలో నారింజ, నిమ్మలో కంటే రెండు రెట్లు అధికంగా సి-విటమిన్ కివీలో లభిస్తుంది. దగ్గు, ముక్కు కారడం, శ్వాస ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.



జీర్ణక్రియ: కివీలో ఉండే డైటరీ ఫైబర్, ఆక్టినిడైన్ ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. బొప్పాయిలోని పపైన్, పైనాపిల్‌లోని బ్రోమేలైన్‌లా కివీలోని ఆక్టినిడైన్ పని చేస్తుంది. పెరుగు, ఛీజ్, చేపలు, గుడ్లలో ఉండే కొన్ని పోషకాలు అరగడానికి సహకరిస్తుంది. ఫలితంగా మలబద్ధకం సమస్యను తగ్గుతుంది.

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 6 నవంబరు 2025

చెరగని గుర్తుగా!

● కెప్టెన్ హర్మన్ 'వరల్డ్‌కప్' టాటూ



న్యూఢిల్లీ: భారత మహిళల జట్టుకు తొలి వరల్డ్ కప్ అందించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆ ఘట్టాన్ని చెరగని గుర్తుగా మార్చుకొంది. తన చేతిపై ప్రపంచ కప్ టాటూను వేయించుకొంది. ఈ ఫొటోను ఆమె నెట్‌లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ప్రపంచకప్ ట్రోఫీతోపాటు గెలిచిన సంవత్సరం '2025'తో పాటు ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల విజయాన్ని గుర్తుచేసేలా '52' టాటూపై కనిపిస్తున్నాయి.

త్వరలో ఆటకు వీడ్కోలు

● క్రిస్టియానో రొనాల్డో



న్యూఢిల్లీ: సాకర్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో (40) కెరీర్ ముగింపు దశకు వచ్చినట్టే. త్వరలోనే తాను ఆటకు గుడ్‌బై చెప్పనున్నట్టు ఓ ఇంటర్వ్యూలో రొనాల్డోనే ఈ విషయాన్ని వెల్లడించాడు. కెరీర్‌కు ఎప్పుడు వీడ్కోలు పలుకుతున్నావంటూ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'త్వరలోనే.. అందుకు మానసికంగా సన్నద్ధమవుతున్నా. ఆటను వదిలేయడం చాలా కష్టం. ఆ సమయం వస్తే మాత్రం కన్నీళ్లు ఆపుకోలేను' అని పోర్చుగల్‌కు చెందిన రొనాల్డో తెలిపాడు. ప్రస్తుతం అల్ నాసర్ క్లబ్‌కు ఆడుతున్న రొనాల్డోకు ఆ జట్టుతో 2027 వరకు ఒప్పందం ఉంది.

మూడోరౌండ్‌కు అర్జున్, హరి

పనాజీ: భారత గ్రాండ్ మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ, వరల్డ్ చాంపియన్ గుకేశ్‌తోపాటు దీప్తయన్ ఘోష్‌లు చెస్ వరల్డ్‌కప్ మూడో రౌండ్‌కు చేరుకొన్నారు. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో అర్జున్ 2-0తో మార్టిన్ పెట్రో (బల్గేరియా)పై, హరి 1.5-0.5తో నెస్టోరోవ్‌పై, గుకేశ్ 1.5-0.5తో నోజర్‌బెక్ (కజకిస్థాన్)పై, కార్తీక్ వెంకట్రామన్ 1.5-0.5తో అరవింద్ చిదంబరంపై నెగ్గారు. నెపోమినియాచి (రష్యా)పై ఘోష్ సంచలన విజయం సాధించాడు.



అమన్‌జోత్ క్యాచ్‌తో ట్రోఫీ కనిపించిందా!

విశ్వవిజేతలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టును ప్రధాని మోదీ బుధవారం తన నివాసంలో కలుసుకున్నారు. టోర్నమెంట్‌లో జట్టు అద్భుతంగా పుంజుకొని విజేతగా నిలిచిన తీరును ఆయన కొనియాడారు. ఫైనల్లో అమన్‌జోత్ పట్టిన అద్భుత క్యాచ్‌తో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు వరల్డ్ కప్ ట్రోఫీ కనిపించి ఉంటుందని ఈ సందర్భంగా మోదీ నవ్వుతూ అన్నారు. 2017 వన్డే వరల్డ్ కప్ అనంతరం మోదీని కలిసిన క్షణాలను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గుర్తు చేసుకొంది. అప్పుడు కప్ లేకుండా ప్రధానిని కలిశామని, ఇప్పుడు ట్రోఫీతో భేటీ అవడం గర్వంగా ఉందని చెప్పింది. నిరంతరం వర్తమానంలో ఎలా ఉండగలుగుతారని ప్రధానిని హర్మన్ ప్రశ్నించింది. అది తన జీవితంలో ఒక భాగమైందని, క్రమంగా అలవాటుగా మారిందని ఆయన బదులిచ్చారు. ఫైనల్ అనంతరం బంతిని హర్మన్ తన జేబులో దాచుకోవడాన్ని గురించి మోదీ సరదాగా అడిగారు. ఆ బంతి తన వద్దకు రావడం అదృష్టమని హర్మన్ తెలిపింది.

దీప్తీశర్మ 'జై శ్రీరామ్' బయో గురించి ప్రస్తావన..

ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ దీప్తీశర్మ.. ఇన్‌స్టాలో 'జైశ్రీరామ్' బయోతో పాటు హనుమాన్ టాటూ గురించి ఆమెను ప్రధాని అడిగారు. ఆ రెండు తనకు ఎంతో బలాన్ని ఇస్తాయని దీప్తీశర్మ తెలిపింది. 'ఫిట్ ఇండియా' సందేశాన్ని బాలికల్లో బాగా ప్రచారం చేయాలని ప్లేయర్లను కోరారు. పాఠశాలలను సందర్శించి బాలబాలికలు క్రీడలపట్ల ఆకర్షితులయ్యేలా స్ఫూర్తి నింపాలని సూచించారు.

పంత్ వచ్చేశాడు



షమికి మొండిచేయి ● దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌కు జట్టు

న్యూఢిల్లీ: వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌కు బుధవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో పంత్‌కు చోటు కల్పించారు. అయితే సుదీర్ఘకాలంగా జట్టులోకి రావాలని చూస్తున్న పేసర్ మహ్మద్ షమికి నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో 35 ఏళ్ల షమి కెరీర్ ముగిసినట్టేనని భావిస్తున్నారు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ 14నుంచి కోల్‌కతాలో జరగనుంది. ఈ టెస్ట్ సిరీస్‌కు ఎన్. జగదీశన్ స్థానంలో పంత్‌కు చోటు దక్కింది. అంతేకాదు రిషబ్‌ను వైస్-కెప్టెన్‌గానూ నియమించారు. భుజం గాయంనుంచి కోలుకున్న బెంగాల్ పేసర్ ఆకాశ్‌దీప్ కూడా సఫారీలతో టెస్ట్ సిరీస్‌కు జట్టులోకి వచ్చాడు. స్పిన్ విభాగం బాధ్యతలను జడేజా, అక్షర్, కుల్దీప్, సుందర్ పంచుకోనున్నారు. కాగా..బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్‌లతో పేస్ బౌలింగ్ బలంగా ఉంది.

భారత టెస్ట్ జట్టు: గిల్ (కెప్టెన్), పంత్ (వైస్-కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, పడిక్కళ్, జురెల్, జడేజా, సుందర్, బుమ్రా, అక్షర్, నితీశ్ రెడ్డి, సిరాజ్, కుల్దీప్, ఆకాశ్‌దీప్.

భారత్ 'ఏ' కెప్టెన్ తిలక్ వర్మ

దక్షిణాఫ్రికా 'ఏ'తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత్ 'ఏ' జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టుకు హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మను కెప్టెన్‌గా ప్రకటించారు. ఈ మ్యాచ్‌లు ఈనెల 13, 16, 19 తేదీల్లో రాజ్‌కోట్‌లో జరగనున్నాయి.

షమికి ఇక కష్టమేనా?

ఇటీవల మూడు రంజీ మ్యాచ్‌ల్లో బెంగాల్ తరపున 15 వికెట్లతో రాణించిన పేసర్ షమిని సెలెక్టర్లు జట్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోలేదు. కానీ సుదీర్ఘ స్పెల్స్ వేయాల్సిన టెస్ట్‌లకు అతడి శరీరం సహకరించదేమోనన్న అభిప్రాయంలో సెలెక్టర్లు ఉన్నట్టు తెలిసింది. అలాగే తన ఫిట్‌నెస్ గురించి తాజా సమాచారం తెలియజేయాల్సిన బాధ్యత తనది కాదని ఇటీవల షమి వ్యాఖ్యానించడం ప్రతికూలంగా మారినట్టు భావిస్తున్నారు.

పాక్ ఆటగాళ్లతో మేం కరచాలనం చేస్తాం

హాకీ ఇండియా

న్యూఢిల్లీ: భవిష్యత్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌ల సందర్భంగా పాకిస్థాన్ ఆటగాళ్లతో మన జట్టు కరచాలనం చేయకుండా నిరోధించలేమని హాకీ ఇండియా (హెచ్ఐ) స్పష్టంజేసింది. వారితో కరచాలనం చేయవద్దంటూ తమకు ఎవరి నుంచీ ఆదేశాలు లేవని తేల్చింది. ఇటీవల మలేసియాలో జరిగిన సుల్తాన్ జొహర్ కప్ మ్యాచ్ సందర్భంగా పాక్ హాకీ జట్టుతో భారత ఆటగాళ్లు కరచాలనం చేయడంపై వివాదం ఏర్పడిన విషయం విదితమే. భారత పురుషులు, మహిళల జట్లు పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వని నేపథ్యంలో..హాకీ జట్టు అందుకు విరుద్ధంగా ప్రవర్తించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. 'మేం క్రికెట్ నియంత్రణలో లేము. క్రికెటర్లు ఎలా ప్రవర్తిస్తారన్నది వారి ఇష్టం. ఒలింపిక్ చార్టర్‌ను, అంతర్జాతీయ హాకీ సమాఖ్య నిబంధనలను మేం పాటిస్తాం' అని హెచ్ఐ కార్యదర్శి భోలానాథ్ సింగ్ స్పష్టంజేశారు.

కెప్టెన్ జూనియర్లను కొడుతోంది

● బంగ్లా సారథి సుల్తానాపై జట్టు సభ్యురాలి ఆరోపణ



నిగర్ సుల్తానా

ఢాకా: బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ కెప్టెన్ నిగర్ సుల్తానా జూనియర్ క్రికెటర్లను తన రూముకి పిలిచిమరీ కొడుతోందని ఆ జట్టు పేస్ బౌలర్ జహనారా ఆలమ్ సంచలన ఆరోపణలు చేసింది. 'ఇది కొత్తేంకాదు. జూనియర్లను కొట్టడం నిగర్‌కు అలవాటే. ఇటీవల ముగిసిన వన్డే వరల్డ్ కప్‌లోనూ నిగర్ తమను పలుమార్లు కొట్టిందని జూనియర్ క్రికెటర్లు నాతో చెప్పారు. ఇటీవలి దుబాయ్ పర్యటనలోనూ ఓ జూనియర్‌ను తన గదికి రప్పించుకొన్న నిగర్ ఆమె చెంప ఛెళ్లుమనిపించింది' అని ఆలమ్ ఆరోపించింది. అయితే జట్టులో చోటు దక్కనందుకే జహనారా ఇలా ఆరోపణలు చేస్తోందని బంగ్లా క్రికెట్ బోర్డు వ్యాఖ్యానించింది.

డ్రగ్స్‌కు బానిస.. సీన్ విలియమ్స్‌పై వేటు

హరారే: మాదక ద్రవ్యాలకు బానిసైన జింబాబ్వే క్రికెట్ మాజీ కెప్టెన్ సీన్ విలియమ్స్(39)పై ఆ దేశ బోర్డు జీవితకాల నిషేధం విధించారు. సెప్టెంబరులో టీ20 వరల్డ్‌కప్ ఆఫ్రికా క్వాలిఫయింగ్ పోటీలకు ముందు సీన్ జట్టు నుంచి తప్పుకోవడానికి కారణాలపై ఆరాతీయగా అతడు డ్రగ్స్‌కు బానిసైన విషయం బయటపడింది.

భారత్‌కు భలే చాన్స్!

నేడు ఆస్ట్రేలియాతో నాలుగో టీ20
మ. 1.45 నుంచి



ప్రాక్టీస్‌లో కెప్టెన్ సూర్య, బుమ్రా

● ఆధిక్యంపై సూర్య సేన గురి
● గిల్ ఫామ్ ఆందోళనకరం

కరారా (గోల్డ్‌కోస్ట్): ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో తిరుగులేని ఆధిక్యం దక్కించుకొనేందుకు భారత్‌కు అద్భుత అవకాశం. ఐదు టీ20ల సిరీస్ 1-1తో సమమైన నేపథ్యంలో గురువారం జరిగే నాలుగో మ్యాచ్‌లో గెలిచి టీమిండియా సిరీస్ కోల్పోని స్థితిలో నిలవాలనుకొంటోంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్, పేసర్ హాజెల్‌వుడ్ సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో కంగారూల పనిపట్టడానికి సూర్యకుమార్ సేనకు ఇదో మంచి చాన్స్. అయితే, మూడో టీ20లో విజయంతో జోష్ మీదున్న భారత్‌కు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వరుస వైఫల్యాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత ఆరు మ్యాచ్‌ల్లో గిల్ ఒక్క అర్ధ శతకం కూడా సాధించలేదు. ఫుల్లర్ డెలివరీలు ఆడేందుకు గిల్ ఇబ్బంది పడుతున్నాడు. వికెట్ల ముందు దొరికిపోవడం అతడి ప్రధాన బలహీనతగా మారింది. మరోవైపు అభిషేక్ శర్మ తనదైన శైలిలో అదరగొడుతున్నాడు. గిల్ అతడికి ఏమాత్రం సరితూగడం లేదు. కెప్టెన్ సూర్యకుమార్ మెరుగ్గానే ఆరంభిస్తున్నా..భారీస్కోర్లు చేయడంలో విఫలమవుతున్నాడు. తిలక్ వర్మ, సుందర్ నమ్మదగ్గ ప్లేయర్లుగా ఎదుగుతున్నారు. ఈ మ్యాచ్‌కు కూడా శాంసన్ స్థానంలో జితేశ్ శర్మకు కీపింగ్ బాధ్యతలు అప్పగించే చాన్సులున్నాయి. ఆల్‌రౌండర్ శివం దూబేతోపాటు అర్ష్‌దీప్, బుమ్రా పేస్ బౌలింగ్‌ను నడిపించనున్నారు. మరోవైపు కెప్టెన్ మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్ దూకుడైన ఆటపై ఆసీస్ ఎక్కువగా ఆధారపడుతోంది. హెడ్ స్థానంలో మాట్ షార్ట్ ఓపెనర్‌గా బరిలోకి దిగనుండగా.. మ్యాక్స్‌వెల్ జట్టులోకి రావడం సానుకూల పరిణామం. అబాట్ బదులు డ్వార్షుయిస్‌కు చాన్స్ దక్కనుంది.

జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, అక్షర్ పటేల్, సుందర్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), దూబే, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

ఆస్ట్రేలియా: మాట్ షార్ట్, మార్ష్ (కెప్టెన్), ఇంగ్లిస్ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, మిచ్ ఓవెన్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, బ్రాట్‌లెట్, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లీస్, కునేమన్.

అతడికి అంతా తెలుసు: మోర్కెల్

టీ20ల్లో అర్ష్‌దీప్ కీలకమైన బౌలర్. కానీ, అతడికి ఈ టూర్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు టీమ్‌లో చోటుదక్కలేదు. అయితే, మేనేజ్‌మెంట్ ఉద్దేశమేంటో అర్ష్‌దీప్‌నకు అర్థమయ్యే ఉంటుందని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. మరో మూడు నెలల్లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని టీమిండియా మేనేజ్‌మెంట్ జట్టును సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఉన్న వనరులను పరీక్షిస్తోంది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,21,480 ▼	1,11,350 ▼	1,63,000 ▼
విజయవాడ	1,23,000 ▼	1,17,000 ▼	1,50,000 ▲
విశాఖపట్నం	1,23,520 ▼	1,12,250 ▼	1,63,000 ▼
రాజమండ్రి	1,21,470 ▼	1,11,350 ▼	1,47,900 ▼
ప్రొద్దుటూరు	1,20,400 ▼	1,10,770 ▼	1,50,000 ▼
ముంబై	1,20,419 ▼	1,10,304 ▼	1,46,150 ▼

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ లాభాలకు బ్రేక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్) కంపెనీ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.188 కోట్ల ఆదాయంపై రూ.20 కోట్ల నికర లాభం నమోదు చేసింది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 5.6% పెరిగినా, నికర లాభం మాత్రం 3.25% తగ్గింది. అయితే గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే మాత్రం కంపెనీ రూ.366 కోట్ల ఆదాయంపై రూ.42 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ఆదాయం 17.4%, నికర లాభం 14.6% పెరిగాయి.

11న ఫిజిక్స్‌వాలా, ఎమ్వీ ఐపీఓలు

న్యూఢిల్లీ: వచ్చే మంగళవారం (తేదీ 11) రెండు ఐపీఓలు మార్కెట్ తలుపు తట్టనున్నాయి. వాటిలో ఎడ్‌టెక్ రంగంలోని ఫిజిక్స్‌వాలా, సోలార్ ఫొటోవోల్టాయిక్ తయారీదారు ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్ ఉన్నాయి. రెండు ఇష్యూలు 13వ తేదీన ముగుస్తాయి.

● ఈ ఇష్యూ ద్వారా రూ.3,480 కోట్లు సేకరించాలన్నది ఫిజిక్స్‌వాలా లక్ష్యం. ఇందులో రూ.380 కోట్లు ఓఎఫ్ఎస్ విధానంలోనూ, రూ.3,100 తాజా షేర్ల జారీ ద్వారానూ సేకరించనుంది.

● ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్ ఈ ఇష్యూ ద్వారా రూ.2,900 సేకరించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	585
వరంగల్	577	గోదావరి	590
చిత్తూరు	603	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	105
కర్నూలు	107	నెల్లూరు	110
విశాఖపట్నం	108	అనంతపురం	110
గోదావరి	109		

వచ్చే జూన్ నాటికి సెన్సెక్స్ 1,00,000



మార్కెట్లో కరెక్షన్ దశ ముగిసింది, ఇక దూకుడే
మోర్గాన్ స్టాన్లీ అంచనా

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్‌లో కరెక్షన్‌కు తెర పడిందనే అంచనాలు వినిపిస్తున్నాయి. మోర్గాన్ స్టాన్లీ వంటి ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు కూడా ఇదే అంచనాకు వస్తున్నాయి. మార్కెట్‌పై బుల్ ఆపరేటర్లు పట్టు బిగించి, పెద్ద అడ్డంకులేమీ లేకపోతే వచ్చే ఏడాది జూన్ నాటికి బీఎస్ఈ సెన్సెక్స్ లక్ష పాయింట్ల మైలురాయిని చేరుకుంటుందని మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో అంచనా వేసింది. సెన్సెక్స్ ప్రస్తుత స్థాయితో పోలిస్తే ఇది 16,541 పాయింట్లు ఎక్కువ. ఒక వేళ చిన్నపాటి అడ్డంకులు ఎదురైనా ప్రస్తుత స్థాయి నుంచి 6.6 శాతం వృద్ధితో 89,000 పాయింట్లను తాకడానికి 50 శాతం అవకాశం ఉందని తెలిపింది. తమ అంచనాలు తలకిందులై మార్కెట్‌పై బేర్ పట్టు పెరిగితే మాత్రం సెన్సెక్స్ ఇప్పుడున్న స్థాయి నుంచి 16 శాతం నష్టపోయి 70,000 పాయింట్లకు పడిపోయే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించింది. అయితే వచ్చే ఎనిమిది నెలల్లో భారత స్టాక్ మార్కెట్‌పై బేర్ పట్టుకు 20 శాతం మాత్రమే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ అంచనా.

మారుతున్న పరిస్థితులు: నిన్న మొన్నటి వరకు దేశీయ స్టాక్ మార్కెట్ అనేక ఆటుపోట్లకు లోనైంది. మదుపరులు కూడా ఎంపిక చేసిన కొన్ని మంచి కంపెనీల షేర్లలోనే ఇన్వెస్ట్ చేసే వారు. మారుతున్న స్థూల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మదుపరుల పెట్టుబడుల వ్యూహం సైతం మారుతోందని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది. జీడీపీ వృద్ధితో పాటు అభివృద్ధి పథంలోని కంపెనీల షేర్లపై వారు ఇప్పుడు దృష్టి పెడుతున్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాల పోటు భయపెడుతున్నా, మిగతా దేశాలతో పోలిస్తే భారత జీడీపీ వృద్ధి రేటు ఆశాజనకంగా కనిపిస్తోందని ఈ నివేదిక రూపొందించిన మోర్గాన్ స్టాన్లీ ఇండియా ఎండీ, చీఫ్ ఈక్విటీ స్ట్రాటజిస్టు రిధం దేశాయ్, నయంత్ పరేఖ్ తెలిపారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలతో పాటు ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లు, నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) తగ్గించడం, బ్యాంకుల డీ రెగ్యులేషన్, పెరగనున్న లిక్విడిటీ, జీఎస్‌టీ రేట్ల కుదింపు సైతం దేశీయ స్టాక్ మార్కెట్‌కు కలిసి వస్తాయని వీరి అంచనా.

ఇతర సానుకూల అంశాలు : చైనాతో మెరుగుపడుతున్న సంబంధాలు, భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మెరుగుపతున్న ఆశలు, పెరుగుతున్న ఎగుమతులు, నిలకడగా ఉన్న ముడి చమురు ధరలు, అదుపులో ఉన్న ద్రవ్య లోటు కూడా సెంటిమెంట్‌ను మరింత పెంచుతాయని మోర్గాన్ స్టాన్లీ అంచనా. ఈ సానుకూల అంశాలన్నీ కలిసి కుటుంబాల పొదుపులో ఎక్కువ భాగం స్టాక్ మార్కెట్‌వైపు ఆకర్షించే అవకాశం ఉందని పేర్కొంది.

ఇబ్బందులూ ఉన్నాయ్: సానుకూలాంశాలతో పాటు భారత ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్‌కు కొన్ని ప్రతికూల అంశాలూ పొంచి ఉన్నట్టు మోర్గాన్ స్టాన్లీ నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా నీరసిస్తున్న ప్రపంచ వృద్ధిరేటు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు మార్కెట్లకు పొంచి ఉన్న పెద్ద ముప్పు అని తెలిపింది. ఎఫ్‌పీఐల వెనుకంజ కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

మెరిసే కంపెనీల షేర్లు : దేశీయ స్టాక్ మార్కెట్‌లో బుల్ రన్ ప్రారంభమైతే ఈ కింది కంపెనీల షేర్లు మంచి లాభాలు పంచే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

- మారుతి సుజుకీ
- ట్రెంట్, టైటాన్
- వరుణ్ బేవరేజెస్
- రిలయన్స్ ఇండస్ట్రీస్
- బజాజ్ ఫైనాన్స్
- ఐసీఐసీఐ బ్యాంక్
- ఎల్ అండ్ టీ.
- అల్ట్రాటెక్ సిమెంట్
- కోఫోర్జ్ లిమిటెడ్.

మారుతి 3 కోట్ల అమ్మకాల మైలురాయి

న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ మరో రికార్డును సొంతం చేసుకుంది. కంపెనీ ప్రారంభం నుంచి ఇప్పటికి దేశీయ మార్కెట్లో 3 కోట్ల కార్లను విక్రయించి సరికొత్త మైలురాయిని అధిగమించింది. మొదటి 1 కోటి విక్రయాల మార్కును సాధించడానికి 28 సంవత్సరాల 2 నెలలు పట్టగా, తదుపరి 1 కోటి యూనిట్ల మైలురాయిని 7 సంవత్సరాల 5 నెలల్లో చేరింది. తాజాగా మరో 1 కోటి యూనిట్లు కేవలం 6 సంవత్సరాల 4 నెలల్లోనే విక్రయించినట్లు మారుతి సుజుకీ తెలిపింది. ఈ మూడు కోట్ల అమ్మకాల్లో, ఆల్టో 47 లక్షలకు పైగా యూనిట్లతో అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్‌గా నిలిచింది. వ్యాగన్ ఆర్ (34 లక్షల యూనిట్లు), స్విఫ్ట్ (32 లక్షల యూనిట్లు) కార్లు ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయి. 1983 డిసెంబర్‌లో ఐకానిక్ మారుతి 800తో ప్రారంభమైన కంపెనీ ప్రస్థానం, నేడు 19 మోడళ్లలో 170కి పైగా వేరియంట్లతో దేశంలో అగ్రగామిగా కొనసాగుతోంది.

అరబిందో ఫార్మా లాభం రూ.817 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో స్థానిక అరబిందో ఫార్మా మంచి ఆర్థిక ఫలితాలు సాధించింది.ఈ కాలానికి కంపెనీ రూ.8,286 కోట్ల ఆదాయంపై రూ.817 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర లాభం నాలుగు శాతం పెరిగింది. అమెరికా, యూరోపియన్ మార్కెట్లు బాగా పుంజుకోవడం ఇందుకు కలిసివచ్చినట్టు కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ నిత్యానంద రెడ్డి తెలిపారు.

తగ్గిన ఎంటార్ టెక్నాలజీస్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎంటార్ టెక్నాలజీస్ ఆదాయం, లాభాలకు రెండో త్రైమాసికంలో గండి పడింది. రెండో త్రైమాసికంలో కంపెనీ రూ.135.6 కోట్ల ఆదాయంపై రూ.17 కోట్ల స్థూల లాభం, రూ.4.2 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొదటి త్రైమాసికంతో పోల్చితే క్యూ2లో కంపెనీ ఆదాయం రూ.21 కోట్లు, స్థూల లాభం రూ.11.4 కోట్లు, నికర లాభం రూ.6.6 కోట్లు పడిపోయాయి. అయితే మెరుగైన ఆర్డర్లు, ఉత్పాదకత వినియోగంతో ఈ ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగు త్రైమాసికాల్లో మెరుగైన ఆర్థిక ఫలితాలు సాధిస్తామని కంపెనీ ఎండీ, ప్రమోటర్ పర్వత్ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

క్యూ2లో ఇళ్ల ధరల్లో 19% వృద్ధి


ప్రాప్ టైగర్ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలోని ఎనిమిది అగ్రగామి నగరాల్లో ఇళ్ల ధరలు జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో 7-19% పెరిగాయి. రియల్టీ కన్సల్టెంట్ ఆరమ్ ప్రాప్‌టెక్ తాజా నివేదికలో ఈ విషయం వెల్లడించింది. ఇళ్ల ధరలు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో గరిష్ఠంగా 19% పెరిగినట్టు తెలిపింది. ప్రధానంగా విలాసవంతమైన ఇళ్లకు డిమాండు గణనీయంగా పెరిగినట్టు పేర్కొంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో అక్కడ చదరపు అడుగు ధర రూ.7,479 ఉండగా ఇప్పుడు రూ.8,900 పలుకుతోంది. హైదరాబాద్, బెంగళూరు నగరాలు రెండూ కూడా బలమైన వృద్ధిని నమోదు చేశాయి. హైదరాబాద్‌లో ఇళ్ల ధర 13% వృద్ధితో చదరపు అడుగు రూ.6,858 నుంచి రూ.7,750కి పెరిగింది. బెంగళూరులో చదరపు అడుగు ధర 15% వృద్ధితో రూ.7,713 నుంచి రూ.8,870కి పెరిగింది.

అమ్మకాలు నీరసం

ఇళ్ల ధరలు దూసుకుపోతుండడం అమ్మకాలను ప్రభావితం చేసినట్టు తెలుస్తోంది. జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో టాప్ 8 నగరాల్లో ఇళ్ల అమ్మకాల్లో వృద్ధి స్వల్పంగానే ఉన్నట్టు హౌసింగ్ డాట్ కామ్ తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ ఎనిమిది నగరాల్లోనూ కలిపి మొత్తం 96,544 ఇళ్లు అమ్ముడుపోగా ఈ ఏడాది 96,827 ఇళ్లు అమ్ముడుపోయాయి. అలాగే కొత్తగా ప్రారంభమైన ఇళ్ల నిర్మాణం 91,863 నుంచి 94,419కి పెరిగింది. గత అర్ధ దశాబ్ది కాలంలోనూ ధరలు విపరీతంగా పెరిగిపోవడం అఫర్డబుల్ హౌసింగ్ విభాగంలో అమ్మకాలు తగ్గడానికి కారణమయిందని ఈ పోర్టల్ యాజమాన్య సంస్థ రియా సీఈఓ ప్రవీణ్ శర్మ అన్నారు. అయితే ప్రీమియం విభాగంలో మాత్రం డిమాండు బలంగా ఉన్నట్టు చెప్పారు. ఇళ్ల అమ్మకాలు పెరగాలంటే అఫర్డబుల్ విభాగంలో సరఫరా పెంచేందుకు డెవలపర్లను ప్రోత్సహించాలని, కొనుగోలుదారుల భరించగల స్థాయిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. 8 నగరాల్లోనూ ఇళ్ల అమ్మకాల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. హైదరాబాద్‌లో అమ్మకాలు 5% పెరిగి 11,164 యూనిట్ల నుంచి 12,138 యూనిట్లకు చేరాయి. ప్రధానంగా అహ్మదాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై రీజిన్, పుణె నగరాల్లో అమ్మకాలు క్షీణించగా బెంగళూరు, చెన్నై, కోల్కతా నగరాల్లో పెరిగాయి.

జీసీసీ నాయకత్వ ప్రతిభలో హైదరాబాద్ టాప్



న్యూఢిల్లీ: దేశంలో ఏర్పాటవుతున్న గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ) నాయకత్వం పూర్తిగా హైదరాబాద్, బెంగళూరు నగరాల్లోనే కేంద్రీకృతమయింది. జీసీసీల్లో ప్రతీ 10 నాయకత్వ స్థానాల్లోనూ 7 ఈ రెండు నగరాల్లోనే ఉన్నట్టు క్వెస్ కార్పొరేషన్ విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. నాయకత్వ స్థానాలకు ప్రతిభావంతులను ఎంపిక చేసుకోవడంలో హైదరాబాద్ 42% వృద్ధితో అగ్రస్థానంలో ఉంది. పోటీ ప్రీమియం 6-8% ఉంది. ప్రతిభావంతుల సంఖ్యలో బెంగళూరు టాప్‌లో ఉంది. ఇక్కడ వ్యయ సూచీ మార్కెట్ సగటు కన్నా 8-10% అధికంగా ఉంది. ఫైనాన్స్; రిస్క్, అదుపు ఆధారిత పని విభాగంలో చెన్నై ప్రాధాన్యతా నగరంగా నిలిచింది. ఇక్కడ రిటెన్షన్ స్థాయి 94% ఉంది. ప్రథమ శ్రేణి నగరాల్లో ఇది గరిష్ఠ స్థాయి.

నిపుణుల కొరత: టెక్నాలజీ విభాగాల్లో ప్రతిభావంతుల కొరత తీవ్రంగా ఉన్నట్టు కూడా క్వెస్ కార్ప్ తెలిపింది. ప్రధానంగా జెనరేటివ్ ఏఐ, ఎల్ఎల్ఎం ఇంజనీరింగ్ విభాగాల్లో ఈ కొరత 50% వరకు ఉన్నట్టు అంచనా. ఇతర విభాగాల్లో కొరత 38-45% ఉంది. కీలకమైన నాయకత్వ బాధ్యతల్లో నియామకాలకు 90 నుంచి 120 రోజుల సమయం పడుతోంది. ఆఫర్ ప్రకటించిన తర్వాత జాయిన్ కావడానికి జరుగుతున్న వ్యత్యాసం 68-72% ఉంది. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఈ కొరత అధికంగా ఉన్నందు వల్ల ప్రాజెక్టుల అమలు నత్తనడకన సాగుతున్నట్టు క్వెస్ కార్ప్ నివేదిక వెల్లడించింది.


ప్రతి యువకుడి కథ



శ్రీవిష్ణు కథానాయకుడిగా ఒక సినిమా తీయనున్నట్టు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ బుధవారం ప్రకటించింది. 'ప్రతి యువకుడి కథ' అనే ట్యాగ్‌లైన్‌తో ఓ పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేసింది. 'అనగనగా'తో ఓటీటీలో అడుగుపెట్టి, ప్రశంసలు పొందిన దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వినోదాత్మక నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా అన్ని రకాల భావోద్వేగాలను పలికించే సామర్థ్యం కలిగిన శ్రీవిష్ణు ఈ చిత్రంలో మరో మంచి పాత్రను పోషించనున్నారు. సున్నితమైన భావోద్వేగాలతో, రోజువారీ జీవితంలోని నిశ్శబ్ద సంఘర్షణలు, ఆశలు, సంతృప్తలను అన్వేషించే కథతో చిత్రాన్ని రూపొందించనున్నారు దర్శకుడు సన్నీ సంజయ్. త్వరలోనే షూటింగ్ మొదలవుతుందని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.

ప్రేక్షకులు థ్రిల్ అవుతారు

సుధీర్‌బాబు



'చిన్నప్పుడు మనందరం జానపద, చందమామ కథలు వింటూ పెరిగాం. నిధికి పిశాచి కాపలాగా ఉండే ఓ జానపద కథ ఆధారంగా మా 'జటాధర' చిత్రం రూపుదిద్దుకుంది. ఆ కథను దర్శకుడు ఈ కాలానికి తగ్గట్లు చాలా ఆసక్తిగా మార్చారు. పెద్దతెరపై చూడదగ్గ కథ అనిపించి ఈ సినిమాకు అంగీకారం తెలిపాను. ప్రేక్షకులు థ్రిల్ అవుతారు' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

- ఈ సినిమా కథలో దెయ్యాల వేట, కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, శివుని గురించి కథలు... ఇలా విభిన్న అంశాలు మిళితమై ఉంటాయి. నేను దెయ్యాల వేటగాడి పాత్రలో కనిపిస్తాను. ప్రత్యేకంగా డిజైన్ చేసిన పోరాట ఘట్టాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి. ఇక ఈ సినిమాలో శివ తాండవం ఎపిసోడ్ ఉంటుంది. శాస్త్రీయ నృత్యంలో నాకు ప్రవేశం లేకపోవడంతో పదిరోజులు సాధన చేసి నటించాను. 'జటాధర' సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఎక్కడా బోర్ కొట్టదు. కథనం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.
- సోనాక్షి చాలా అద్భుతమైన నటి. తను దక్షిణాది అమ్మాయిలానే ఉంటారు. తనలోని నటిని వెలికితెచ్చే పాత్రను ఈ చిత్రంలో పోషించారు.



నిర్మాతగా సంతృప్తినిచ్చిన చిత్రమిది

అల్లు అరవింద్

'సినిమాల ద్వారా నిర్మాతగా కోట్ల రూపాయలు సంపాదించాను. అందులో దాపరికం ఏమీ లేదు. అయితే 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ద్వారా నేను సంపాదించాలనుకుంటున్నది డబ్బు కాదు... సంతృప్తి. ఇలాంటి ఒక మంచి సినిమాను నిర్మించాననే అనుభూతి వెలలేని సంతృప్తినిస్తోంది' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'రాహుల్ లాంటి సున్నిత మనస్కుడు మాత్రమే ఇలాంటి సినిమాను రూపొందించగలరు. ఎన్ని పాటలున్నాయి, ఎన్ని జోక్స్ ఉన్నాయి, ఎంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉందని చూసే సినిమా కాదిది. అతి సున్నితంగా సాగే ఈ సినిమా చివరకు అతి ఘాటుగా ముగుస్తుంది. ఈ సినిమా చూసిన రోజు రాత్రి చాలా మంది నిద్రపోలేరు. అంతగా ఈ కథ వారిని వెంటాడుతుంది. రష్మిక తన పాత్రలో జీవించారు' అని చెప్పారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో ఒక అందమైన ప్రయాణంగా 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం మిగిలిపోతుంది. నిర్మాతల సహకారం వల్లే మంచి అవుట్‌పుట్ వచ్చింది. రష్మిక లేకుంటే ఈ సినిమా లేదు. ఆమె ఎన్నో పురస్కారాలకు అర్హురాలు' అని అన్నారు. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'రాహుల్‌తో మరిన్ని సినిమాలు చేయాలనుంది. సినిమా నిర్మాణంలో మాకు ఏ కష్టం వచ్చినా అరవింద్ గారు చూసుకుంటారనే భరోసా మమ్మల్ని ముందుకు నడిపించింది' అని చెప్పారు.

కమల్ హాసన్ నిర్మాతగా రజనీకాంత్ కొత్త చిత్రం



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్ ఓ చిత్రం నిర్మించనున్నారు. ఈ విషయాన్ని బుధవారం కమల్ హాసన్ ప్రకటించారు. కమల్‌హాసన్ చిత్ర నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ మూవీస్ ఇంటర్నేషనల్ నిర్మించనున్న ఈ చిత్రానికి సుందర్.సి దర్శకత్వం వహించనున్నారు. 2027 సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు కమల్ హాసన్ తన ఎక్స్ పేజీలో... 'గాలిలా వానలా నదిలా పొంగిపోతాము, సంతోష పడతాము, జీవిస్తాము! రాజ్‌కమల్ మూవీస్ ఇంటర్నేషనల్ నిర్మాణంలో సుందర్.సి దర్శకత్వంలో నా ప్రియ స్నేహితుడు రజనీకాంత్ నటించనున్న 'తలైవర్ 173' అంటూ పోస్ట్ చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



భావోద్వేగానికి గురిచేస్తుంది

మంచు మనోజ్



'ఓ పల్లెటూరిలో జరిగిన సంఘటన ఆధారంగా రాసుకున్న కథతో హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఫీల్ గుడ్ సినిమాలా మొదలై ముగింపులో భావోద్వేగానికి గురిచేస్తుంది' అని మంచు మనోజ్ అన్నారు. ఈ చిత్రంలో హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన ఓ ప్రేమగీతాన్ని ఆయన విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రమిది. దర్శకుడు వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి సంయుక్తంగా నిర్మించారు. డా. నాగేశ్వర రావు పూజారి సమర్పిస్తున్నారు. ఈ నెల 21న బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు.

మూడు జంటల ప్రేమకథ




రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'పిఠాపురంలో' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. మహేశ్‌చంద్ర దర్శకత్వంలో దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్, ఎఫ్ఎం మురళీ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్‌చంద్ర మాట్లాడుతూ 'మూడు జంటల ప్రేమకథగా ఈ చిత్రాన్ని రూపొందించాం. పిఠాపురం నేపథ్యంలో సినిమా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 20 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో ఆరు రోజులు షూటింగ్ చేశాం' అని చెప్పారు.

'కుంభమేళా' మోనాలిసా తెలుగు చిత్రం



విశాలమైన కనులతో కుంభమేళాలో పూసలు అమ్ముతూ సోషల్ మీడియా ద్వారా అందరినీ ఆకట్టుకున్న మోనాలిసా టాలీవుడ్ కథానాయికగా మారారు. శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'లైఫ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బుధవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. నటుడు సురేశ్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత డీఎస్‌రావు కెమెరా స్విచ్చాన్ చేశారు. శివన్నారాయణ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత అంజన్న మాట్లాడుతూ 'సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాల్లోని సంఘర్షణ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రమిది. సినిమాకు మంచి ప్రచారం జరుగుతుంది, హైప్ వస్తుంది అని భావించి మోనాలిసాను హీరోయిన్‌గా ఎంపిక చేశాం' అని చెప్పారు.











వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సభ్యులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

బీసీల అభ్యున్నతికి 47,456 కోట్లు

» బీసీ కార్పొరేషన్ల చైర్మన్ల ఆత్మీయ సమావేశంలో మంత్రి సవిత

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం రూ.47,456 కోట్లు కేటాయించిందని, ఇదొక చరిత్ర అని మంత్రి సవిత అన్నారు. బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరక్టర్లతో మూడు రోజులపాటు నిర్వహించిన ఆత్మీయ సమావేశాలు బుధవారం ముగిశాయి. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో జరిగిన ముగింపు సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ.. ఆదరణ పథకాన్ని 3.0 పేరుతో మరోసారి ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీనికోసం బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించినట్లు గుర్తుచేశారు.

ప్రతి శుక్రవారం నియోజకవర్గ గ్రీవెన్స్: పల్లా

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ నాయకులను ఆదేశించారు. బుధవారం ఆయన పార్టీ ముఖ్య నేతలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ నెల 15లోపు నియోజకవర్గ కమిటీల నుంచి గ్రామస్థాయి కమిటీల వరకు పూర్తి చేయాలని, లేకపోతే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నేడు అమరావతికి సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు లండన్ పర్యటన ముగించుకుని గురువారం ఉదయం అమరావతి చేరుకోనున్నారు. ఉదయం 10 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకున్న తర్వాత.. సీఎం నేరుగా సచివాలయానికి వెళ్లనున్నారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మంత్రులు, కార్యదర్శులుతో సమావేశం కానున్నారు.

గవర్నర్‌కు సీఎం అభినందనలు

కర్ణాటక స్టేట్ లా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. చట్టం, న్యాయ పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. మంత్రి లోకేశ్ కూడా గవర్నర్‌కు అభినందనలు తెలిపారు.

సీమకు భరోసా టీడీపీనే: కాల్వ శ్రీనివాసులు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాయలసీమకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. '2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలోనే రాయలసీమ భవిష్యత్తుకు బలమైన పునాదులు పడ్డాయి. సీమ వెనుకబాటును వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ రాజకీయ అవసరాలకు వాడుకున్నారు. కానీ చంద్రబాబు, లోకేశ్ సీమ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారు' అని కాల్వ వివరించారు.

8, 9న తిరుపతి, చిత్తూరుల్లో పవన్ పర్యటన

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 8, 9 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. 8న తిరుపతి పరిధిలోని ఎర్రచందనం డిపోను సందర్శిస్తారు. 9న పలమనేరులోని కుంకీ ఏనుగుల శిబిరాన్ని సందర్శిస్తారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. కాగా, ప్రముఖ వ్యాపారవేత్త చలమలశెట్టి సునీల్ తండ్రి సురేంద్రనాథ్ మరణంపై పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు.

ప్రకాశం బ్యారేజీ మరమ్మతులకు 9 కోట్లు విడుదల

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏడాదిగా భారీ వర్షాలు ముంచెత్తుతుండటంతో ప్రకాశం బ్యారేజీకి యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టేందుకు రూ.9కోట్ల మంజూరు చేశారు. గతేడాది వరదల సమయంలో కొట్టుకొచ్చిన పడవలు ఢీకొనడంతో బ్యారేజీ గేట్లు దెబ్బతిన్నాయి. వాటి రిపేరు సమయంలోనే ప్రకాశం బ్యారేజీకి శాశ్వత మరమ్మతులు చేయాలని కన్నయ్యనాయుడు సూచించారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు.

సవివరంగా కౌంటర్ దాఖలు చేయండి

» టీసీఎస్‌కు భూ కేటాయింపులపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): టీసీఎస్ సంస్థకు విశాఖలో భూకేటాయింపులను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఇదే వ్యవహారంతో ముడిపడి ఉన్న వ్యాజ్యాలతో ప్రస్తుత పిల్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖలో టీసీఎస్‌కు 21.16 ఎకరాలను 99పైసలకే కేటాయించడాన్ని సవాల్ చేస్తూ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఈ పిల్‌పై పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు.

స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థలు, వర్సిటీల తరఫున వాదనలు వినిపించేందుకు పలువురు న్యాయవాదులు స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమితులయ్యారు. ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరఫున న్యాయవాది బసు నాంచారయ్య నాయుడు, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ తరఫున జి.సాయి నారాయణరావు, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ తరఫున ఎం.శివకుమార్, శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ తరఫున వల్లభనేని శాంతి శ్రీ, రాయలసీమతోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఏపీ ఆశ్రమ పాఠశాలల సొసైటీ, ఏపీ గిరిజన సంక్షేమ, ఏపీ సాంఘిక సంక్షేమ, ఏపీ బీసీ సంక్షేమ ఆశ్రమ పాఠశాలల సొసైటీల తరఫున తర్లాడ వినోద్‌కుమార్ స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమితులయ్యారు.

పీఎంజేవీకే పనులకు రూ.203.69 కోట్లు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధానమంత్రి జన్ వికాస కార్యక్రమం(జీఎంజేవీకే) ద్వారా మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పనుల కోసం ప్రభుత్వం రూ.203.69కోట్లు విడుదల చేసినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం తెలిపారు. 2025-26 మైనార్టీ సంక్షేమ బడ్జెట్‌లో పీఎంజేవీకే కింద రూపొందించిన పనులు, అభివృద్ధి ప్రణాళిక ఆర్థిక తోడ్పాటు, తదితర వాటి పూర్తికి ఈ నిధులను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

వేటు వేసే హక్కుంటే ఎందుకు ఆగుతున్నారు: బొత్స

విశాఖపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'శాసనసభకు ఆరు నెలల పాటు హాజరుకాని సభ్యులపై అనర్హత వేటు వేస్తామని అసెంబ్లీ స్పీకర్ తరచూ చెబుతున్నారు. ఆ హక్కు ఉంటే ఎందుకు ఆగుతున్నారు?' అని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. నగరంలోని ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. 'అసెంబ్లీకి వెళ్లినా ఉపయోగం లేదు కాబట్టే మా పార్టీ అధ్యక్షుడు జగన్ నేరుగా ప్రజల వద్దకు వెళ్లి మాట్లాడుకుంటున్నారు' అన్నారు.

సీపీఐ నూతన కార్యదర్శివర్గం ఎన్నిక

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీపీఐ నూతన కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం విజయవాడలో పి.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యతోపాటు జేవీ సత్యనారాయణమూర్తి, పీ హరనాథరెడ్డి, కేవీవీ ప్రసాద్, డీ జగదీశ్, జంగాల అజయ్ కుమార్, డేగ ప్రభాకర్, తాటిపాక మధు, పి.దుర్గాభవాని, కె.రామాంజనేయులు, శాశ్వత ఆహ్వానితులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజలు కార్యదర్శివర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విమానమెక్కి విజ్ఞాన యాత్రకు

సైన్స్ టూర్‌కు 52 మంది.. పర్యటనలో రష్యన్ హౌస్ సందర్శన



విమానం వద్ద సైన్స్ టూర్‌కు ఢిల్లీ వెళ్తున్న ప్రభుత్వ బడుల విద్యార్థులు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభగల విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ అరుదైన అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఇద్దరు చొప్పున 52 మంది విద్యార్థులను సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌లో భాగంగా ఢిల్లీకి పంపనుంది. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఈ పర్యటన సాగుతుంది. ఏపీ సైన్స్ సిటీ, సమగ్రశిక్ష సంయుక్తంగా ఈ పర్యటనను చూస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రముఖ సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ అండ్ మాథమాటిక్స్(స్టెమ్) నిపుణులను కలిసి అనుభవపూర్వకంగా అవగాహన పెంచుకునే అవకాశం కలిగించాయి. విద్యార్థులు మొదటి రోజు ఢిల్లీలోని రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ కల్చర్(రష్యన్ హౌస్)ను సందర్శిస్తారు. ఇండో- రష్యన్ స్పేస్ సమన్వయంపై ప్రత్యేక సెషన్ ఉంటుంది. స్పుత్నిక్‌పై ఫిల్మ్ ప్రదర్శన, ఇండో- రష్యన్ స్పేస్ ఫ్రెండ్‌షిప్‌పై పోటీలు ఉంటాయి. రెండో రోజు... నేషనల్ సైన్స్ మ్యూజియంను సందర్శిస్తారు. రాకెట్రీ వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. రాకెట్ డిజైన్, ప్రొపల్షన్, శాటిలైట్ లాంచ్‌పై ఇందులో చర్చ జరుగుతుంది. మోడల్ రాకెట్ లాంచ్ సెషన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం అవుతారు. మూడో రోజు... నెహ్రూ ప్లానిటేరియంను సందర్శిస్తారు. అనంతరం ప్రధానమంత్రి సంగ్రహాలయను సందర్శించి భారత నాయకత్వం, టెక్నాలజీ, సైంటిఫిక్ విజన్ అంశాల గురించి తెలుసుకుంటారు. విద్యార్థులకు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలియజేశారు. క్షేమంగా వెళ్లి విజ్ఞానంతో తిరిగి రావాలని ట్వీట్ చేశారు. విద్యార్థులు బుధవారం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

క్వాంటమ్ వ్యాలీ.. వడివడిగా!

(మొదటి పేజీ తరువాయి)

క్వాంటమ్ మెటీరియల్స్‌లో రాష్ట్ర విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దడమే క్వాంటమ్ వ్యాలీ ఉద్దేశం.

భాగస్వామ్య సంస్థ.. ప్రాజెక్టులివీ..

- అమెరికాకు చెందిన విసెర్ సంస్థ అమరావతిలో క్వాంటమ్ ట్యాలెంట్ హబ్‌ను నెలకొల్పుతుంది. 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. 100 మంది అత్యున్నత స్థాయి పరిశోధకులను తయారుచేస్తుంది.
- ఎన్‌వీఐడీఐఏ సంస్థ ఏఐ, క్వాంటమ్ సిమ్యులేషన్ ప్లాట్‌ఫాంలను సమీకృతం చేస్తుంది. రాజధానిలో హైబ్రిడ్ సూపర్ కంప్యూటింగ్ స్టోరేజ్‌ను నిర్మిస్తుంది.
- ఏడబ్ల్యూఎస్ సంస్థ అమరావతి ఏడబ్ల్యూఎస్ యాక్సిలరేటర్‌ను ప్రారంభిస్తుంది. 50వేల మంది యువత, మహిళలకు ఏడబ్ల్యూఎస్ బ్రాకెట్ ద్వారా సర్టిఫికెట్లు జారీచేస్తుంది.
- క్వాంట్రోలాక్స్ సంస్థ రూ.25 కోట్లతో 'విద్యాకర్' ప్లాట్‌ఫాంను నిర్మిస్తుంది. ఇది ఓపెన్-ఆర్కిటెక్చర్ బెంచ్‌మార్క్ సిస్టమ్.
- పీక్యూ స్టేషన్ సంస్థ టెస్ట్‌బెడ్, డెమోల్యాబ్‌లతో కూడిన పోస్ట్-క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ హబ్‌ను నెలకొల్పుతుంది.

ఈ సంస్థల సహకారంతో 50వేల మందికిపైగా విద్యార్థులకు మౌలిక క్వాంటమ్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం, వీరిలో 3వేల మందికి అత్యున్నత శిక్షణ, గ్లోబల్ పరిశోధన, అభివృద్ధికి 100మంది ఉన్నత పరిశోధకులను సన్నద్ధం చేయడం.. జాతీయ క్వాంటమ్ మిషన్, రాష్ట్ర క్వాంటమ్‌వ్యాలీకి ఉపకరించేలా శాశ్వత క్వాంటమ్ ట్యాలెంట్ హబ్ ఏర్పాటు లక్ష్యమని వెల్లడించాయి. 108 టీచింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు 108 సంస్థల నుంచి 134 ప్రతిపాదనలు, ఆల్గోరిథమ్ పరిశోధనకు 55 సంస్థల నుంచి 84 ప్రతిపాదనలు అందాయి. 197 వర్సిటీల్లో శిక్షణపొందిన 1,056మంది ఫ్యాకల్టీ సభ్యులు సిద్ధంగా ఉన్నారు. 137 కాలేజీల నుంచి 1,127 హ్యాకథాన్ ఆలోచనలు తీసుకున్నారు. ఇందులో 3 వేల మందికిపైగా విద్యార్థులు పాలుపంచుకున్నారు' అని వివరించాయి. దిమిరా (ఐఐటీ-బొంబే), ఇండ్‌రోబో, రియలిస్టిక్, క్వాంట్రోల్ స్పియర్, క్యూరియం వంటి స్టార్టప్‌లు భారత తొలి క్వాంటమ్ సప్లయ్-చైన్ జిల్లా కోసం కంట్రోల్ ఎలక్ట్రానిక్స్ వైరింగ్ వ్యవస్థలు, యాంప్లిఫయర్లను అభివృద్ధి చేస్తున్నాయి. క్యుబిట్స్ నుంచి చిప్‌ల వరకు ప్రతి లేయర్‌ను అమరావతిలో డిజైన్ చేసి తయారుచేస్తాయి. 'ఒక్క ఏడాదిలోనే భావన నుంచి అమలు స్థాయికి.. విజన్ నుంచి విలువైన భాగస్వామ్యాల వరకు ఏపీ ఎదిగింది' అని రాష్ట్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్ శాఖ వర్గాలు తెలిపాయి. 'వ్యవస్థల స్థాపన, పరికరాల తయారీ, విద్యార్థులకు శిక్షణ, టెక్నాలజీ ఎగుమతులు తదుపరి అధ్యాయం. డీఆర్‌డీవోతో భాగస్వామ్యం నుంచి క్వాంటమ్ ఫ్యాబ్ ప్రతిపాదన వరకు.. ఫిజిత్సుతో జాయింట్ వెంచర్, పాస్కల్ సభ అభివృద్ధి నుంచి వైజర్ ప్రారంభం దాకా ప్రతి కార్యాచరణా భారత క్వాంటమ్ ఫౌండేషన్‌కు ఒక్కో ఇటుకరాయిలాంటిది. 2030నాటికి అమరావతి కేవలం క్వాంటమ్ కంప్యూటర్లనే గాక యావత్ పరిశ్రమకే కేంద్రంగా ఆవిర్భవిస్తుంది' అని పేర్కొన్నాయి. భారత్.. ప్రపంచం కోసం భవిష్యత్‌ను నిర్మించే క్రమంలో ఏపీ నిర్మాణ కేంద్రంగా మారుతుందని తెలిపాయి.

భాగస్వామ్య సదస్సులో 410 ఒప్పందాలు

» రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులు

» 7.5 లక్షల మందికి ఉపాధి: డోలా



విశాఖలో పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన ఏర్పాట్ల గురించి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి వివరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్. చిత్రంలో ఎమ్మెల్యేలు, మేయర్ పీలా, తదితరులు

విశాఖపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):విశాఖ నగరంలో 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సు రాష్ట్రభవిష్యత్‌కు తలమానికం అవుతుందని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో 410 ఒప్పందాలు జరుగుతాయని, రూ.2.7 లక్షల కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతాయని తెలిపారు. సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.9.8 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయని.. 7.5 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నామని, అందులో పది లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే ప్రక్రియ ఇప్పటికే పూర్తిచేశామన్నారు. పెట్టుబడుల సదస్సు విజయవంతానికి ప్రభుత్వం అవిరళ కృషిచేస్తోందని, సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్, మంత్రులు పలు దేశాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆహ్వానించారని గుర్తుచేశారు. 40 దేశాల నుంచి వందల సంఖ్యలో అతిథులు, వివిధ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారన్నారు.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

» దుబాయ్ పారిశ్రామిక వేత్తలతో మంత్రి నారాయణ

» బీయా, టెక్టాన్, కార్బొనాటిక్ ప్రతినిధులతో భేటీ

» ముగిసిన మూడు రోజుల దుబాయ్ పర్యటన

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమని, ఇక్కడ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పారిశ్రామిక రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని దుబాయ్‌లోని పారిశ్రామిక వేత్తలను కోరారు. అధికారుల బృందంతో కలిసి దుబాయ్‌లో పర్యటిస్తున్న మంత్రి మూడో రోజైన బుధవారం.. బీయా ఫెసిలిటీ, టెక్టాన్ ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్, కార్బొనాటిక్ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. చెత్త నిర్వహణలో ప్రసిద్ధిగాంచిన బీయా ఫెసిలిటీ సంస్థ ప్రతినిధులు.. యూఏఈలోని మున్సిపాలిటీల్లో చెత్తసేకరణ, నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీలోనూ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని నారాయణ వారిని కోరారు. అనంతరం టెక్టాన్ కంపెనీ ఎండీ ఎస్.లక్ష్మణ్‌తో మంత్రి సమావేశమయ్యారు. అమరావతిలో పలు ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు టెక్టాన్ కంపెనీ ఆసక్తి కనబరిచింది. సాయంత్రం కార్బొనాటిక్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. ఏపీలో నౌకల నిర్మాణం, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఈ సంస్థ ఆసక్తి కనబరిచింది. మూడు రోజుల దుబాయ్‌లో పర్యటనలో ప్రసిద్ధ కంపెనీల చైర్మన్లు, సీఈవోలతో సమావేశాలతో నారాయణ బిజీగా గడిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా ఏపీలో పారిశ్రామిక రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్న అంశాన్ని వారికి వివరించారు. 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించారు. దుబాయ్ పర్యటన ముగించుకున్న మంత్రి నారాయణ బృందం రాష్ట్రానికి తిరుగు ప్రయాణమైంది. ఈ పర్యటనలో మంత్రి నారాయణ వెంట సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, మున్సిపల్‌శాఖ డైరక్టర్ సంపత్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

సింగపూర్ పర్యటనకు ఉత్తమ టీచర్లు

» 27నుంచి వారం రోజుల పాటు పర్యటన

» అక్కడి విద్యా విధానాలపై అధ్యయనం

» 26న స్టూడెంట్ అసెంబ్లీకి ఏర్పాట్లు చేయాలి: మంత్రి లోకేశ్



విద్యా శాఖ సమీక్షలో మంత్రి లోకేశ్, ఆ శాఖ అధికారులు

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అధునాతన విద్యా విధానాలపై అధ్యయనానికి 78మంది ఉత్తమ ఉపాధ్యాయులను సింగపూర్ పర్యటనకు పంపుతున్నట్లు మంత్రి లోకేశ్ వెల్లడించారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన విద్యాశాఖపై సమీక్షించారు. ఈ నెల 27 నుంచి డిసెంబరు 2 వరకూ వీరి పర్యటన కొనసాగుతుందని చెప్పారు. అక్కడి పాఠశాలలు, బోధనా పద్ధతులు, తరగతి గది వాతావరణంపై అధ్యయనం చేసి, రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 'స్టూడెంట్ అసెంబ్లీ' నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిసెంబరు 5న 'మెగా పేరెంట్- టీచర్స్' సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీపై వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేయాలని, కడప మోడల్ స్మార్ట్ కిచెన్లు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా భవిత ఆటిజం సపోర్టు సెంటర్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీపై దృష్టిపెట్టాలని లోకేశ్ ఆదేశించారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు, పౌర గ్రంథాలయాల బలోపేతం, పాఠశాలల్లో డిజిటల్ లైబ్రరీలపై చర్చించారు.

యూనివర్సిటీలకు ఉమ్మడి చట్టం

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పరిపాలనకు ఉమ్మడి చట్టం రూపొందించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. కాలేజీల్లో నాలుగేళ్ల పాటు చదివినవారికి ఉద్యోగాలు రావట్లేదని, అమీర్‌పేట్‌లో నాలుగు నెలలు కోచింగ్ తీసుకున్నవారు ఉద్యోగాలు సాధిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉన్నతవిద్య పాఠ్య ప్రణాళికను ప్రక్షాళన చేయాలని సూచించారు. ప్రైవేటు కాలేజీలను కూడా నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించాలని ఆదేశించారు. కాలేజీల్లో ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని యూనివర్సిటీల్లో స్టూడెంట్ ఫీడ్‌బ్యాక్ మెకానిజం ఏర్పాటుచేయాలని చెప్పారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులను లోకేశ్ ఆదేశించారు. అన్ని గ్రూపులకు వారాంతపు పరీక్షలతో పాటు ట్రాకింగ్ వ్యవస్థను రూపొందించాలని సూచించారు.

78వేల మందికి ఉద్యోగాలు

కూటమి ప్రభుత్వంలో 406 జాబ్ మేళాలు నిర్వహించగా వాటి ద్వారా 78వేల మంది ఉద్యోగాలు సాధించినట్లు లోకేశ్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఏఐ, డిజిటల్ టెక్నాలజీలపై యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రస్థాయి న్యాక్ సెంటర్‌ను మంగళగిరిలో ఏర్పాటుచేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ చదివినవారిలో 94.6శాతం మందికి, ఐటీఐల్లో చదివినవారిలో 98 శాతం మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయని అధికారులు వివరించారు. 16 పారిశ్రామిక క్లస్టర్ల పరిధిలో 16 పెద్ద సంస్థలను గుర్తించి పాలిటెక్నిక్, ఐటీఐలతో అనుసంధానించాలని లోకేశ్ ఆదేశించారు.

బీపీసీఎల్‌కు రికార్డు సమయంలో భూములిచ్చాం

» త్వరలోనే రిఫైనరీ పనులు ప్రారంభం: మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) రామాయపట్నం సమీపంలో భారీ పెట్టుబడితో స్థాపించే ఆయిల్ రిఫైనరీకి రికార్డు సమయంలో భూములు కేటాయించామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. దీనికి సంబంధించిన పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఏటా 9నుంచి 12మిలియన్ టన్నుల ఆయిల్‌ను శుద్ధి చేసే సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును 2029 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు వద్ద రూ.96,862 కోట్ల భారీ పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు బీపీసీఎల్‌కు 6వేల ఎకరాలు కేటాయిస్తూ గత నెల ప్రారంభంలోనే పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

2 గంటల్లో శ్రీవారి దర్శనం

» 'శ్రీ వేంకటేశ్వర ఎయిర్‌పోర్టు'గా తిరుపతి విమానాశ్రయం

» శారదా పీఠానికి భూముల లీజులు రద్దు: టీటీడీ చైర్మన్



హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం రెండు గంటల్లోనే పూర్తయ్యేలా త్వరలోనే చర్యలు తీసుకుంటామని టీటీడీ బోర్డు చైర్మన్ బీ.ఆర్. నాయుడు అన్నారు. దీనికోసం ఏఐ సాయంతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. దీనికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టు విజయవంతమైందని, త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి గురువారానికి ఏడాది అయిన సందర్భంగా బుధవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీవాణి ట్రస్టు కింద దళిత వాడల్లో వెంకన్న ఆలయాలను నిర్మించనున్నామని, ప్రాథమికంగా 5వేలకు పైగా వాడల్లో నిర్మాణాలను ప్రతిపాదించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ శ్రీవారి గుడులు నిర్మించాలన్న సీఎం చంద్రబాబు సూచనలతో కార్యాచరణ రూపొందించామని వివరించారు. తిరుమల కొండ కింద సుమారు 50 ఎకరాల్లో 25వేల మంది భక్తులకు వసతి, మౌలిక సౌకర్యాలు కల్పించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. తిరుపతి విమానాశ్రయానికి 'శ్రీ వేంకటేశ్వర ఎయిర్‌పోర్టు'గా నామకరణం చేశామని, ఈ ఫైలును క్యాబినెట్‌కు పంపామని, ఆమోదం పొందాక కేంద్రానికి పంపనున్నట్టు వివరించారు. వైసీపీ హయాంలో తిరుపతి ఫ్లైవోవర్‌కు పెట్టిన 'శ్రీనివాస సేతు' పేరును మళ్లీ 'గరుడ వారధి'గా మార్చామని తెలిపారు. విశాఖ శారదా పీఠానికి కొండపై కేటాయించిన భూముల లీజులను రద్దు చేశామని చెప్పారు. దేశవ్యాప్తంగా టీటీడీ ఆలయాల్లో నిత్యాన్నదానం చేయనున్నట్టు తెలిపారు. ఏడాది పాలనలో రూ.1,000 కోట్ల విరాళాలు వచ్చాయని చెప్పారు. ఒంటిమిట్ట ఆలయం వద్ద 100 గదులతో వసతి గృహం నిర్మాణంతో పాటు 108 అడుగుల జాంబవంతుని విగ్రహం ఏర్పాటుచేయనున్నట్టు వివరించారు.

ఆడపిల్లల జీవితాలతో ఆటలా?

» జగన్ మీడియా కథనాలు, వైసీపీ ట్వీట్లపై హోంమంత్రి అనిత ఆగ్రహం



అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగన్, వైసీపీ, జగన్ రోత పత్రిక.. రాష్ట్రంలో ఎక్కడైనా ఏదైనా సంఘటన జరుగుతుందా అని గోతికాడ నక్కల్లా ఎదురు చూస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా కథలల్లేసి, సినిమాలు తీసేస్తున్నారని.. సొంత పేపర్‌లో అబద్ధపు కథనాలు రాస్తున్నారని ఆక్రోశించారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఏలూరులో ఓ వివాహిత తన కుటుంబ సమస్యల కారణంగానో, తనకు ఉన్న అలవాటు వల్లనో మద్యంతాగి, ఆసుపత్రిలో చికిత్స పొందితే.. ప్రైవేటు స్కూల్ బాలికపై లైంగికదాడి అని సాక్షిలో రాశారు. మరుసటిరోజు ఆమె బాలిక కాదని, వివాహిత అని రాశారు. వైసీపీ సోషల్‌మీడియా ఖాతాలో బాలికపై లైంగిక దాడి అని ట్వీట్ చేశారు. సభ్యసమాజం తలదించుకునేలా జగన్ పత్రిక రాతలు ఉన్నాయి. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు వైద్యులెవరూ చెప్పలేదు. నిర్ధారించలేదు. స్పృహలోకి వచ్చాక ఆమె కూడా ఇదే విషయం చెప్పారు. ఇప్పటి వరకు చావులపై రాజకీయాలు చేస్తున్న జగన్ అండ్‌కో ఇప్పుడు ఆడపిల్లల మానమర్యాదలపైనా రాజకీయాలు చేయడం సిగ్గుచేటు' అని అనిత మండిపడ్డారు.

5 జిల్లాల్లో మీ పనితీరు బాగాలేదు!

» ఎక్సైజ్ అధికారులపై ముఖ్య కార్యదర్శి అసంతృప్తి

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలుంటాయని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా హెచ్చరించారు. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎలాంటి నిర్ణయాలూ ఉండకూడదని స్పష్టం చేశారు. ఐదు జిల్లాల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం మంగళగిరిలోని శాఖ కమిషనరేట్‌లో రాష్ట్రస్థాయి అధికారుల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. అధికారులు సాధారణ వివరణలు ఇవ్వడం మానుకోవాలని, స్పష్టమైన సమాధానాలు ఇస్తేనే ఇకపై పరిగణనలోకి తీసుకుంటామని తేల్చిచెప్పారు. మద్యం ఉత్పత్తి, కల్లు విక్రయాలపై రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆ శాఖ డైరెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నాటుసారా విషయంలో అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ వ్యాఖ్యానించారు.

గ్రూప్-1 జవాబు పత్రాలను భద్రపరిచి సీల్ వేయండి

» 24 గంటలూ భద్రత కల్పించండి

» రిజిస్ట్రార్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ నిర్వహించిన 2018నాటి గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను భద్రపరచాలని హైకోర్టు ఆదేశించింది. గత విచారణలో ఇచ్చిన ఆదేశాల మేరకు జవాబు పత్రాలను కోర్టుకు అందించేందుకు సిద్ధం చేశామని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం నివేదించారు. మొత్తం 325 మంది అభ్యర్థుల జవాబుపత్రాలు 21 సీల్డ్ బాక్సుల్లో ఉన్నాయని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం వాటిని రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని ఏపీపీఎస్సీ అధికారులను ఆదేశించింది. వాటిని లెక్కించిన అనంతరం మ్యాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేసిన జవాబుపత్రాలతో పాటు డిజిటల్ మూల్యాకనం చేసిన పత్రాలతో కూడిన సీడీలను ప్రత్యేక గదిలో భద్రపరచి సీల్ వేయాలని రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు న్యాయమూర్తులు స్పష్టం చేశారు. పత్రాలు భద్రపరిచిన గదికి 24గంటలూ సెక్యూరిటీ కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యాజ్యాలపై తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేశారు. ఏపీపీఎస్సీ 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్‌కు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని హైకోర్టు సింగిల్ జడ్జి గతంలోనే నిర్ధారించారు. తాజాగా మెయిన్స్ నిర్వహించాలని ఆదేశిస్తూ 2024 మార్చి 13న తీర్పు ఇచ్చారు. దాన్ని సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ సహా ఉద్యోగాలకు ఎంపికైన కొందరు అభ్యర్థులు అప్పీల్ చేశారు. ఈ అప్పీళ్లపై ఇటీవల తుది విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే, తీర్పు ప్రతి సిద్ధం చేస్తుండగా 2022, జూన్ 24న డివిజన్ బెంచ్ ఉత్తర్వుల అమలులో లోపాలను గుర్తించిన ధర్మాసనం... వాటిని నివృత్తి చేసుకునేందుకు ఇటీవల అప్పీళ్లపై మరోసారి విచారణ ప్రారంభించింది.



తమ ఇళ్లకు కరెంటు వచ్చిన సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ చిత్ర పటానికి పాలతో అభిషేకం చేస్తున్న గిరిజనులు

గూడెంకు వెలుగు వచ్చింది

నెరవేరిన పవన్ కల్యాణ్ హామీ

- 5 నెలల కిందట గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం
- రూ.80 లక్షలతో యుద్ధప్రాతిపదికన పనులు
- ఒక్కో ఇంటికి ఉచితంగా ఐదు బల్బులు, ఒక ఫ్యాన్

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చీకటి వీడి.. ఆ కొండ కోనల్లో తొలిసారి వెలుగుల పండగ వచ్చింది! అడవి తల్లి ఒడిలో.. రొంపల్లి 'గూడెం'లో ఇప్పటి వరకూ అలముకున్న నిశీధిని చెరిపేస్తూ కార్తీక పౌర్ణమి వెన్నెలతోపాటు, ఇంటింటా విద్యుత్, 'పవన' విద్యుత్ కాంతులు మెరిశాయి. చీకటిని జయించిన ఆనందంలో.. గిరిజనుల మోముల్లో ఆనంద కాంతులు వెల్లివిరిశాయి. అడవిలో కిలోమీటర్ల కఠినమైన చీకటి దారుల్ని చీల్చుకుంటూ.. కొండలను దాటుకుంటూ వచ్చిన ఆ వెలుగు రేఖ.. కేవలం విద్యుత్ కాదు.. గిరిపుత్రుల గుండెల్లో కొత్త ఆశల దీపం!! ఇంతటి ఆనందానికి కారణమైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను గిరిజనులు ఇప్పుడు తమ దేవుడంటూ ఆకాశానికెత్తేస్తున్నారు. కృతజ్ఞతగా క్షీరాభిషేకం చేశారు. వివరాలివీ.. స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలవుతుండగా, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం, రొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గూడెం గ్రామానికి ఇప్పటి వరకు విద్యుత్ సదుపాయం లేదు. దీంతో వారు పడుతున్న వెతలు అన్నీఇన్నీ కావు. ఇలాంటి తరుణంలో ఐదు నెలల క్రితం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల సమస్యలను సావధానంగా ఆలకించారు. ప్రధానంగా విద్యుత్ లేక పడుతున్న ఇబ్బందులను ఏకరువుపెట్టారు. ఈ నేపథ్యంలో.. బుధవారం ఆ గ్రామంలో ఉన్న 17 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. కార్తీక పౌర్ణమి రోజున బయట వెన్నెల కాంతులు.. ఇళ్లలో విద్యుత్ వెలుగులతో గిరిజనులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. మండల కేంద్రానికి 50కి.మీ దూరంలో 17 ఆవాసాలతో ఈ గూడెం గ్రామం ఉంది. దాని కోసం 9.6 కి.మీ పొడవునా అడవులు, కొండల్లో 217 విద్యుత్ స్తంభాలువేసి రూ.80 లక్షల వ్యయంతో విద్యుత్ ఇచ్చారు.

విద్యుత్‌శాఖది యజ్ఞమే!

గూడెం గ్రామానికి విద్యుత్ లైను వేసేందుకు విద్యుత్‌శాఖ ఒక యజ్ఞమే చేసింది. స్తంభాల రవాణా, పాతడం వంటి పనులు అత్యంత క్లిష్ట పరిస్థితుల మధ్య చేపట్టింది. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా గ్రామంలో సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానించారు. పీఎం జన్‌మన్ పథకం కింద రూ.10.22 లక్షలతో సోలార్, పవన్ విద్యుత్‌తో కూడిన హైబ్రిడ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గిరిజన గ్రామాల్లో తొలిసారి ఈ తరహా గ్రిడ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి ఐదు బల్బులు, ఒక ఫ్యాన్ అందించింది. నిధులందించిన ప్రధాని మోదీతోపాటు.. సహకరించిన సీఎం చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు.

కృతజ్ఞతగా పవన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కనీస సౌకర్యాలు, విద్యుత్ సదుపాయం లేని గూడెం గ్రామ గిరిజనులు బుధవారం విద్యుత్ సౌకర్యం అందడంతో హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. తమ గ్రామానికి విద్యుత్‌లైను వేయించి, తమ ఇళ్లలో విద్యుత్ కాంతులు నింపిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ.. ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ గ్రామాన్ని యలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయ్‌కుమార్, అరకు నియోజకవర్గం జనసేన నేతలు, జనసైనికులు సందర్శించారు. కనీసం రహదారి సౌకర్యం లేని ఆ గిరి శిఖర గ్రామానికి ట్రాక్టర్ సాయంతో ప్రయాణించి మరీ చేరుకున్నారు. గ్రామస్థుల ఆనందోత్సాహాల్లో భాగస్వాములయ్యారు.





తమ ఇంటికి ఇచ్చిన కరెంటు, ఫ్యానుతో గిరిజన మహిళ, గూడెంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

2 జిల్లాలు... 7 డివిజన్లు!

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందులో సదుం, సోమల, చౌడేపల్లె, పుంగనూరు, రొంపిచర్ల, పులిచెర్ల మండలాలు ఉండనున్నాయి. మదనపల్లెలోని 11 మండలాలు ఎలాగూ ఉంటాయి. ఇక రాయచోటి డివిజన్‌లోని 4 మండలాలను (పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె) కొత్త జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. మొత్తంగా ప్రతిపాదిత మదనపల్లె డివిజన్‌లో 28 మండలాలు ఉంటాయి.

'మార్కాపురం జిల్లా' ఇలా...

మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా 'మార్కాపురం జిల్లా' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో... గిద్దలూరు రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తారు. మార్కాపురం జిల్లాలో 21 మండలాలు ఉండనున్నాయి. ఒకప్పుడు కందుకూరు డివిజన్ ప్రకాశం జిల్లాలో భాగంగా ఉండేది. జగన్ హయాంలో దీనిని నెల్లూరులో కలిపేశారు. ఇప్పుడు... మళ్లీ కందుకూరు డివిజన్‌లోని ఐదు మండలాలను (కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, ఓలేటివారిపాలెం)లను ప్రకాశంలో కలపాలని ప్రతిపాదించారు.

కొత్తగా మరో 7 రెవెన్యూ డివిజన్లు

- ప్రస్తుతం రాష్ట్రంలో 77 రెవెన్యూ డివిజన్లున్నాయి. కొత్తగా మరో ఆరేడు డివిజన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు మంత్రివర్గ ఉపసంఘం ముందుకు వచ్చాయి. నక్కపల్లి (పాయకరావుపేట), అద్దంకి, మడకశిర, బనగానపల్లి, పీలేరు, అవనిగడ్డ, గిద్దలూరుతోపాటు మరికొన్ని కొత్త డివిజన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు వచ్చాయి.
- పారిశ్రామిక క్లస్టర్‌లో భాగమైన నక్కపల్లి మండలం ప్రస్తుతం నర్సీపట్నం డివిజన్‌లో ఉంది. అయితే... పాయకరావుపేట కేంద్రంగా నక్కపల్లి డివిజన్‌ను ఏర్పాటు చేస్తారా? లేక ఆ డివిజన్‌కే 'పాయకరావుపేట' పేరు పెడతారా? అనే అంశంపై త్వరలో స్పష్టత వస్తుంది. ఈ డివిజన్‌లో యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, రాయవరం మండలాలు ఉండాలని ప్రతిపాదించారు.
- అద్దంకి ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉంది. దానిని ఐదు మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా మార్చి ప్రకాశం జిల్లాలో కలపాలని మంత్రి గొట్టిపాటి రవి కోరుతున్నారు. రెవెన్యూ శాఖ కూడా ఈ ప్రతిపాదన చేసింది.
- ఒంగోలు, కనిగిరి డివిజన్‌లలో ఉన్న మర్రిపూడి, పొన్నలూరు, కొండపి, జరుగుమిల్లి, సింగరాయకొండ, టంగుటూరు మండలాలను కందుకూరులో విలీనం చేయాలి.
- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పుంగనూరును రెవెన్యూ డివిజన్ చేయాలన్న ప్రతిపాదన పరిశీలనకు వచ్చింది. అయితే, దానికన్నా పెద్దదయిన పీలేరునే రెవెన్యూ డివిజన్ చేయాలని రెవెన్యూ శాఖ తాజాగా ప్రతిపాదించినట్లు తెలిసింది.
- బనగానపల్లె నియోజకవర్గానికి ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బనగానపల్లెను రెవెన్యూ డివిజన్ చేయాలని ఆయన తొలి నుంచి కోరుతున్నారు.
- అవనిగడ్డను డివిజన్ చేయాలన్న ప్రతిపాదన కృష్ణా జిల్లా యంత్రాంగం నుంచి వచ్చింది. దీనిపై ఉపసంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మరి కొన్ని కీలక ప్రతిపాదనలు

- శ్రీకాకుళం జిల్లా నందిగామ, టెక్కలి మధ్య దూరం 11.5 కిలోమీటర్లు. కానీ... నందిగాం మండలం 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస డివిజన్‌లో ఉంది. అందువల్ల... నందిగాం మండలాన్ని టెక్కలిలో కలపాలి.
- అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు డివిజన్‌లను తిరిగి తూర్పు గోదావరిలో కలపాలని ప్రతిపాదించారు. పెదబయలు మండలాన్ని విభజించి కొత్తగా గోమంగి మండలాన్ని ఏర్పాటు చేయాలని రెవెన్యూ శాఖ కోరింది.
- రంపచోడవరం నియోజకవర్గం, దాని పరిధిలోని రంప, చింతూరు డివిజన్‌లను తూర్పు గోదావరిలో కలపాలని ప్రతిపాదించారు. రంపచోడవరంలో 8 మండలాలు, చింతూరులో 4 మండలాలున్నాయి.
- కోనసీమలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలను రాజమండ్రి డివిజన్‌లో కలపాలని ప్రతిపాదించారు. రామచంద్రాపురం నియోజకవర్గంలోని కాజులూరును కోనసీమలోని రామచంద్రాపురం డివిజన్‌లో కలపాలని ప్రతిపాదించారు.
- కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోటను తిరిగి పెద్దాపురం డివిజన్‌లోకి తీసుకురావాలి.
- పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డివిజన్‌లో ఉన్న గణపవరం మండలాన్ని తిరిగి ఏలూరు జిల్లాలోకి తీసుకురావాలి.
- ఏలూరు జిల్లాలోని నూజివీడు డివిజన్‌లో ఉన్న నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలను ఎన్టీఆర్ జిల్లాలోకి తీసుకురావాలి. అంటే... ఈ డివిజన్ ఎన్టీఆర్ జిల్లాలో భాగమవుతుంది.
- ప్రస్తుతం నూజివీడు డివిజన్‌లో ఉన్న చింతలపూడి, లింగపాలెం మండలాలను జంగారెడ్డిగూడెం డివిజన్‌లో కలపాలి.
- ఏలూరు డివిజన్‌లో ఉన్న కైకలూరు నియోజకవర్గంలోని మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాలను కృష్ణా జిల్లాలోకి తీసుకురావాలి.
- గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరులను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ ప్రతిపాదన చేశారు.
- కొత్తగా గిద్దలూరు డివిజన్‌ను ప్రతిపాదించారు. ఇందులో గిద్దలూరుతోపాటు బేస్తవారిపేట, రాచర్ల, కొమరవోలు, కుంభం, అర్ధవీడు మండలాలున్నాయి.
- గూడూరు డివిజన్‌లోని ఐదు మండలాలు (గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిత్తమూరు) తిరుపతి జిల్లాలో ఉన్నాయి. వాటిని తిరిగి నెల్లూరు జిల్లాలోకి తీసుకురావాలని ప్రతిపాదన.
- కందుకూరు డివిజన్‌లోని 2 మండలాలు, ఆత్మకూరు డివిజన్‌లోని మరో 2 మండలాలను కావలిలో కలపాలి. అవన్నీ ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోనివే.
- బాపట్ల రెవెన్యూ డివిజన్‌లోని మూడు మండలాలను (పరుచూరు, మార్టూరు, యద్దనపూడి) చీరాల డివిజన్‌లో కలపాలి. ఇవన్నీ పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాలు.
- చిత్తూరు జిల్లా నగరి డివిజన్‌లోని మూడు మండలాలు(నిండ్ర, విజయపురం, నగరి) తిరుపతి జిల్లాలో కలపాలి. మిగిలిన కార్వేటినగరం, పాలసముద్రం మండలాలను చిత్తూరు డివిజన్‌లో విలీనం చేయాలి.
- పలమనేరు డివిజన్‌లోని బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లో విలీనం చేయాలి.
- తిరుపతి డివిజన్‌లో ఉన్న వడమాలపేట, పుత్తూరులను నగరి డివిజన్‌లో కలపాలి.
- గూడూరు డివిజన్‌లోని వెంకటగిరి, బాలయ్యపల్లె, డక్కిలి మండలాలను శ్రీకాళహస్తిలో విలీనం చేయాలి.
- పెనుకొండ డివిజన్‌లో ఉన్న ఐదు మండలాలతో మడకశిర డివిజన్ ఏర్పాటు చేయాలి. ఇందులో మడకశిర, గుడిబండ, రొళ్ల, అమరాపురం, అగళి ఉన్నాయి.
- కర్నూలు జిల్లా పరిధిలోని ఆదోని మండలాన్ని విభజించి పెద్దహరివాణం అనే కొత్త మండలం ఏర్పాటు చేయాలి.

మార్పులు పరిమితంగానే!

చాలా పరిమితంగా జిల్లా, డివిజన్, మండలాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇప్పటికే ఏపీకి అఖిల భారత సర్వీసు అధికారుల కొరత తీవ్రంగా ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తోంది. కొత్తగా రెండు జిల్లాలకే పరిమితం కావాలని, డివిజన్ల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మంత్రులు నిర్ణయించారు. జగన్ సర్కారు చేసిన తప్పిదాలకు పరిష్కారం చూపుతూనే, కొన్ని ప్రాంతాల ప్రజల చిరకాల డిమాండ్లను నెరవేర్చే దిశగా ప్రతిపాదనలు ఉండాలని మంత్రులు స్పష్టం చేసినట్లు తెలిసింది.

మరోసారి చర్చిస్తాం: మంత్రి అనగాని



ఉపసంఘం ముందుకు రెవెన్యూశాఖ తీసుకొచ్చిన అనేక ప్రతిపాదనలపై కీలక చర్చ జరిగింది. అయితే, డివిజన్లపై మరింత స్పష్టత తీసుకురావాలని మంత్రులు సూచించారు. ఈ నేపథ్యంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విలేకరులతో చెప్పారు. వనరులను దృష్టిలోపెట్టుకొని, పరిమితంగానే పునర్వ్యవస్థీకరణ ఉంటుందని స్పష్టం చేశారు.

పోలవరం ముంపు మండలాలతో ప్రత్యేక అథారిటీ!

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే మండలాలతో ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తోంది. బుధవారం సచివాలయంలో జరిగిన భేటీలో దీనిపై చర్చించారు. ముంపు మండలాలతో కలిపి పోలవరం పేరిట కొత్త జిల్లా ఏర్పాటు వల్ల అనేక సమస్యలుంటాయని రెవెన్యూ శాఖ చెబుతోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో మునిగిపోగా మిగిలే ప్రాంతాలతో జిల్లా ఏర్పాటు చేస్తే.. అది చాలా చిన్నదిగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి పరిధిలోని యానాం తరహాలోనే.. పోలవరం ప్రాజెక్టు పరిధిలో మునిగిపోకుండా ఉండే మండలాలు, వాటి భౌగోళిక ప్రాంతాలతో ప్రత్యేక స్పెసిఫైడ్ అథారిటీ లాంటిదాన్ని ఏర్పాటు చేసి, పూర్తి అధికారాలిస్తే సరిపోతుందని మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. దీనిపై వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు.

పరకామణి చోరీ కేసు..
సీఐడీ దర్యాప్తు ప్రారంభం

- నిందితుడితో సంబంధాలున్న ప్రతి ఒక్కరికీ నోటీసులు జారీ
- డిసెంబరు 2లోగా హైకోర్టుకు నివేదిక
- చోరీ వ్యవహారంపై సమాచారం తెలిస్తే 9440700921కు కాల్ చేయండి
- సీఐడీ డీజీ అయ్యన్నార్ సూచన



తిరుపతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి(హుండీ) చోరీ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం నుంచి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. తిరుపతిలో సీఐడీ ఎస్పీ గంగాధరంతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు.. "పరకామణి చోరీ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు తిరుపతి కేంద్రంగా దర్యాప్తు మొదలు పెట్టాం. ఎస్పీ గంగాధరం నేతృత్వంలో 20 మందితో 5 బృందాలను ఏర్పాటు చేశాం. దీనికి అదనంగా విజయవాడలో మరో 10 మందితో టెక్నికల్, లీగల్, ఫోరెన్సిక్ బృందాలను ఏర్పాటు చేశాం. టీటీడీ చైర్మన్, ఈవోలు పూర్తి సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు." అని అయ్యన్నార్ తెలిపారు.

నిందితుడి వ్యవహారంపై ఆరా తీస్తాం!

పరకామణి చోరీ కేసులో నిందితుడైన రవికుమార్ 1985లో టీటీడీలో చేరాడని అయ్యన్నార్ తెలిపారు. అప్పటి నుంచీ ఆయన పనితీరు, అవినీతి, అక్రమాలు ఏమిటనే విషయాలపై లోతుగా విచారిస్తామన్నారు. "అక్రమాలలో అతనికి సహకరించిన వారు ఎవరన్నది గుర్తించి వారినీ విచారిస్తాం. నిందితుడు రవికుమార్‌తో సంబంధాలున్న అందరికీ నోటీసులు జారీ చేశాం. అతనితో సంబంధమున్న ప్రతి ఒక్కరినీ విచారిస్తాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎవరి పేరిట గిఫ్ట్ డీడ్‌లు రిజిస్టర్ అయ్యాయో తేల్చాల్సి ఉంది. దీనికి సంబంధించి రికార్డులతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా సేకరిస్తాం. పరకామణి చోరీ కేసుకు సంబంధించి బుక్ వాల్యూ రూ.14 కోట్ల టీటీడీ నిధులు దుర్వినియోగమైనట్టు ప్రాథమికంగా అంచనా వేశాం. దీని మార్కెట్ విలువ రూ.45 కోట్ల వరకు ఉంటుంది." అని తెలిపారు. నిందితుడు రవికుమార్ ఆదాయ వనరులపై కూడా దర్యాప్తు చేస్తున్నామని, అతనికి తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, తిరుపతిలో ఆస్తులున్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు పేర్కొన్నారు. దర్యాప్తును త్వరగా ముగించి డిసెంబరు 2వ తేదీలోగా హైకోర్టుకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

పరకామణిలో పర్యవేక్షణా లోపం

పరకామణి దగ్గర పర్యవేక్షణ లోపం ఉందని రవిశంకర్ అయ్యన్నార్ స్పష్టం చేశారు. పరకామణిలో స్వచ్ఛందంగా పనిచేసే వలంటీర్లను కఠినంగా తనిఖీ చేస్తున్నారని, అదే సమయంలో టీటీడీ ఉన్నతాధికారులు, పీఠాధిపతులతో సన్నిహితంగా ఉండే ఉద్యోగులను మాత్రం తనిఖీలు చేయడం లేదని గుర్తించామన్నారు. కాగా, పరకామణిలో చోరీ కేసుకు సంబంధించి సమాచారం తెలిసిన వారెవరైనా 9440700921 నంబరుకు కాల్ వివరాలు అందజేయవచ్చని అయ్యన్నార్ సూచించారు.

ఇది సేవకు దక్కిన గుర్తింపు

- ఎన్టీఆర్ ట్రస్టు తరఫున ఎన్నో కార్యక్రమాలు: భువనేశ్వరి
- సంజీవని ఉచిత హెల్త్ క్లినిక్స్, మొబైల్ ఆరోగ్య శిబిరాలు
- మహిళా సాధికారతకు కృషిచేస్తున్నాం
- ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వెల్లడి
- లండన్‌లో ఐవోడీ సంస్థ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు స్వీకరణ
- గోల్డెన్ పీకాక్ అవార్డు కూడా..




గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకుంటున్న భువనేశ్వరి

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు తరఫున సంజీవని ఉచిత హెల్త్ క్లినిక్స్, మొబైల్ హెల్త్ క్యాంప్స్, సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా మంగళవారం అర్ధరాత్రి లండన్‌లో ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలో ఆ సంస్థకు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో ప్రకటించిన గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకున్న తర్వాత ఆమె ప్రసంగించారు. తనకు వచ్చిన అవార్డు.. సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. మహిళా సాధికారిత కోసం పనిచేస్తున్నామని, వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వొకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు వారి సామర్థ్యాలు పెంచేందుకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలుస్తున్నామని, వారి జీవితం సాధారణ స్థితికి చేరుకునే వరకు చేయూతనిస్తున్నామని చెప్పారు. ఏపీ, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సాయం అందిస్తున్నామన్నారు. 'ప్రజల జీవన విధానంలో మార్పుచేర్పులకు సంబంధించిన అంశాల్లోనూ సలహాలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేస్తున్నాం. అందరికీ సమాన అవకాశాలు లభించాలన్న ఆశయానికి అనుగుణంగా పనిచేస్తున్నాం' అని వివరించారు.

భువనేశ్వరికి గవర్నర్, లోకేశ్ అభినందనలు

భువనేశ్వరి ప్రతిష్ఠాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు పొందడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. తనతల్లి భువనేశ్వరి ప్రపంచవేదికపై అవార్డులతో సత్కారం పొందడం తనకెంతో గర్వకారణమని మంత్రి లోకేశ్ తెలిపారు. 'అమ్మా.. నీవు మన కుటుంబానికి స్ఫూర్తిదాయకంగా నిలిచావు. ఎన్టీఆర్ ట్రస్టు, హెరిటేజ్ ఫుడ్స్‌కు మంచి నాయకత్వం, సుపరిపాలన అందించడం ద్వారా వాటి పట్ల నిబద్ధతను చాటుకున్నారు. అదే ఇప్పుడు మీకు ప్రపంచవేదికపై గౌరవాన్ని తెచ్చిపెట్టింది' అన్నారు.

సీఎంను కలిసిన 'లండన్ కింగ్స్' డాక్టర్



లండన్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు దంపతులను ప్రపంచప్రఖ్యాత 'లండన్ కింగ్స్ అండ్ గయ్స్ హాస్పిటల్' కిడ్నీ వైద్య విభాగాధిపతి, తెలుగు బిడ్డ డాక్టర్ గుడారు కల్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో కిడ్నీ వైద్యుడిగా పనిచేసి.. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కల్యాణ్ ప్రతిభను వారిద్దరూ అభినందించారు. కల్యాణ్ తండ్రి జగదీశ్ 4 దశాబ్దాలుగా తిరుపతి బర్డ్ హాస్పిటల్ ద్వారా సేవ చేస్తున్నారని సీఎం గుర్తు చేసుకున్నారు. తండ్రి బాటలోనే కల్యాణ్ పయనిస్తున్నారని ప్రశంసించారు.

ఉపాధ్యాయుడికి సైబర్ ఉచ్చు

- ఆరు విడతల్లో 22 లక్షలు కాజేసిన కేటుగాళ్లు
- బొబ్బిలిలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

బొబ్బిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'మీరు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఢిల్లీ, ముంబైల్లో మీపై సీబీఐ కేసులు నమోదయ్యాయి' అంటూ ఫోన్‌చేసి బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుంచి రూ.22 లక్షలు గుంజేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన విజయనగరం జిల్లా బొబ్బిలిలో చోటుచేసుకుంది. బొబ్బిలికి చెందిన ఈ ఉపాధ్యాయుడికి సెప్టెంబరు 16న గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తనను సీబీఐ అధికారిగా పరిచయం చేసుకుని.. 'మీరు లైంగిక వేధింపులు, మహిళల అక్రమ రవాణాకు (ఉమెన్ ట్రాఫికింగ్) పాల్పడుతున్నారు. మీపై ముంబైలో, ఢిల్లీలో సీబీఐ కేసులు నమోదయ్యాయి' అని చెప్పారు. తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని బెదిరించారు. అనంతరం వీడియో కాల్ చేసి పోలీసు దుస్తుల్లో కనిపించారు. కోర్టు దృశ్యాలను చూపించి భయపెట్టారు. ఇలా 21 రోజులపాటు ఫోన్లు చేస్తూ బెదిరించడంతో ఆ ఉపాధ్యాయుడు భయాందోళనకు గురయ్యారు. కేసు నుంచి బయటపడాలంటే ఫైన్ కింద కొంత డబ్బులు చెల్లించాలని, మీరు తప్పుచేయలేదని తేలితే డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నమ్మించారు. రిజర్వ్ బ్యాంకు రాజముద్రతో కూడిన రశీదును కూడా పంపడంతో ఆ ఉపాధ్యాయుడు నిజమేనని నమ్మేశారు. ఆ తర్వాత వారు చెప్పిన ఖాతాలకు దశలవారీగా రూ.22 లక్షలు చెల్లించారు. ఇది జాతీయ భద్రత వ్యవహారం కాబట్టి.. ఎవరికీ చెప్పకూడదని సైబర్ నేరగాళ్లు బెదిరించారు. దీంతో ఆయన ఎవరికీ చెప్పకుండా బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి కొంత, స్నేహితుల దగ్గర నుంచి మరికొంత అప్పుగా తీసుకొని రూ.22 లక్షలు (యూపీఐ పేమెంట్) 6విడతలుగా ముట్టజెప్పారు. ఆ తర్వాత అటునుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన ఆయన బుధవారం విలేకరులకు జరిగిన విషయాన్ని తెలియజేస్తూ వాపోయారు.



గుంతలో ఒరిగిపోయిన బస్సులోనుంచి బయటికి వచ్చేసిన విద్యార్థులు

అదుపుతప్పిన ఆర్టీసీ బడి బస్సు

అనంతలో ఘటన.. విద్యార్థులు సురక్షితం

స్టీరింగ్ తిరగక.. బ్రేక్ పట్టేసి.. ప్రమాదం

పుట్లూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలో ఆర్టీసీ బడి బస్సు అదుపు తప్పింది. స్టీరింగ్ స్ట్రక్ అయి, బ్రేక్ పనిచేయకపోవడంతో రోడ్డు పక్కకు దూసుకెళ్లి గుంతలోకి ఒరిగిపోయింది. అదృష్టవశాత్తూ విద్యార్థులకు ఎలాంటి హానీ జరగలేదు. పుట్లూరు ఆదర్శ పాఠశాల నుంచి విద్యార్థులను తరలించేందుకు రోజూ తాడిపత్రి డిపో నుంచి ఆర్టీసీ బస్సు వస్తోంది. ఈ బస్సు పుట్లూరు నుంచి మడ్డిపల్లి వరకు వెళుతుంది. ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం పాఠశాల విడిచిన వెంటనే విద్యార్థులను తీసుకుని బయలుదేరింది. పుట్లూరు దాటిన అనంతరం చింతకుంట శివారులో ప్రమాదానికి గురైంది. దీంతో బస్సులో ఉన్న సుమారు 72 మంది విద్యార్థులు కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురయ్యారు. బస్సు గుంతలోకి దిగి ఆగిపోయిన వెంటనే బిరబిరా మంటూ బయటికి వచ్చేశారు. స్థానికులు బస్సు వద్దకు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. విద్యార్థులను ప్రైవేటు వాహనాల్లో వారి గ్రామాలకు తరలించారు. ప్రమాద స్థలాన్ని సీఐ సత్యబాబు పరిశీలించారు. ఘటనపై ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను విచారిస్తున్నామని తెలిపారు.

'రాంగ్ రూట్' పట్టొద్దు!

- నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు.. ఆటో డ్రైవర్లకు పోలీసుల కౌన్సెలింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఓర్వకల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్లొద్దు. భద్రతా నియమాలు పాటించాల్సిందే' అని పోలీసులు స్పష్టం చేశారు. 'ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా!' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన చిత్ర కథనంపై కర్నూలు జిల్లా పోలీసులు స్పందించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఓర్వకల్లు మోడల్ స్కూల్‌లో ఎస్ఐ సునీల్ కుమార్ ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. "రాంగ్ రూట్‌లో వెళ్తే కేసులు నమోదు చేస్తాం. విద్యార్థులను ఎక్కించుకొని వెళ్లే క్రమంలో కచ్చితంగా సక్రమమైన దారిలో వెళ్లి... రాక్ గార్డెన్ వద్ద యూటర్న్ తీసుకోవాలి. పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో ఎక్కించుకోవద్దు. అధిక శబ్దంతో పాటలు పెట్టుకొని ఆటోలు నడపొద్దు" అని ఆటో డ్రైవర్లకు స్పష్టం చేశారు.

జోగి వ్యాజ్యానికి విచారణార్హత లేదు

- హైకోర్టులో ఏజీ దమ్మాలపాటి వాదనలు
- అదనపు అఫిడవిట్ దాఖలుకు రమేశ్‌కు చాన్స్



అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ, సరఫరా విషయంలో నమోదైన కేసుల దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పష్టం చేశా రు. ఈ మేరకు బుధవారం హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తును ఏ సంస్థకు అప్పగించాలో నిందితుడుగా ఉన్న వ్యక్తి నిర్ణయించలేరన్నారు. వ్యాజ్యం దాఖలు చేసేనాటికి పిటిషనర్ కేసులో నిందితుడిగా లేరన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం వ్యాజ్యం దాఖలు చేసిన అనంతరం జరిగిన పరిణామాలు, వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్ జోగి తరఫు సీనియర్ న్యాయవాదిని ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాగా, జోగి రమేశ్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.


చాణక్యకు జైల్లో సదుపాయాలు!

- మంచం, కుర్చీ, దోమతెర ఇవ్వాలన్న ఏసీబీ కోర్టు

విజయవాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బూనేటి చాణక్యకు జైల్లో సదుపాయాలు కల్పించాలని విజయవాడలోని ఏసీబీ కోర్టు ఆదేశించింది. అతడికి మంచం, ప్లాస్టిక్ కుర్చీ, దోమ తెర ఇవ్వాలని న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కాగా, ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ షరతుల సడలింపుపై తీర్పును పదో తేదీన వెల్లడిస్తామని న్యాయాధికారి భాస్కరరావు తెలిపారు.

కోర్టుకు పాస్‌పోర్టు అప్పగించిన మిథున్‌రెడ్డి

విజయవాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తన పాస్‌పోర్టును విజయవాడలోని ఏసీబీ కోర్టుకు అప్పగించారు. కేంద్రంతరపున ఎంపీల బృందంలో తాను అమెరికాకు వెళ్లాల్సి ఉన్నందున తన పాస్‌పోర్టును ఇప్పించాలని కోరుతూ మిథున్‌రెడ్డి ఇటీవల పిటిషన్ వేయడంతో ఆయన పర్యటనకు కోర్టు అనుమతి ఇచ్చింది. పర్యటన ముగిసిన తర్వాత పాస్‌పోర్టును కోర్టులో అప్పగించాలని ఆ సందర్భంగా కోర్టు ఆదేశించింది. దీంతో ఆయన తరఫున న్యాయవాదులు బుధవారం పాస్‌పోర్టును కోర్టులో అప్పగించారు.



ఆ పేరెలా వచ్చిందంటే!

స్థల పురాణం ప్రకారం.. పూర్వం చిట్టెప్ప అనే శివ భక్తుడు శివుని కోసం తపస్సు చేయగా, శివుడు అతనికి పులి రూపంలో ప్రత్యక్షమవుతాడు. అప్పుడు చిట్టెప్ప ఆనందంతో 'పులి రూపంలో ఉన్న శివుని నే కంటి' (నేను చూశాను) అని అరుస్తూ నృత్యం చేశాడు. ఈ 'నే కంటి' అనే పదమే కాలక్రమేణా వాడుకలో యాగంటిగా స్థిరపడిందని చెబుతారు.

ప్రకృతి రమణీయత మధ్య.. అద్భుత నిర్మాణ శైలిలోని ఆలయం.. పర్వతాల మధ్య ప్రతిధ్వనించే మంత్రధ్వనులు, కలియుగాంతంలో లేచి రంకెలు వేస్తాడని భక్తులు నమ్మే బసవన్న.. కాకులకు ప్రవేశంలేని ప్రత్యేక ప్రాంతం.. పర్వతసానువుల్లోంచి వచ్చే వింజామరలతో మదిపులకింపజేసే మహత్తర ప్రదేశం.. ఆ ముక్కంటి శివయ్య ఉమామహేశ్వరుడిగా కొలువైన పరమపవిత్ర క్షేత్రం యాగంటి. నంద్యాల జిల్లాలోని ఎర్రమల కొండల్లో.. బనగానపల్లెకు 14 కిలోమీటర్ల దూరంలోని ఈ క్షేత్రం ప్రత్యేకతల గురిం చి ఎంత చెప్పినా తక్కువే. యాగంటి ఆలయం పురాతన శైవక్షేత్రం. ఈ ఆలయాన్ని వైష్ణవ సంప్రదాయంతో నిర్మించడం విశేషం. శిల్పకళ పరంగా పురాతన విశ్వకర్మ స్థపతిల కళా నైపుణ్యం అబ్బురపరుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రకృతి తన అందాల నడుమ భక్తి, చరిత్ర, ఆధ్యాత్మికత ను ఒకేచోట మేళవించిన అద్భుత క్షేత్రం యాగంటి!



యాగంటి.. ముక్కంటి!

అద్భుత శిల్పకళా.. చరిత్ర!

ఏటా కార్తీకమాసంలో ప్రత్యేక ఉత్సవాలు

- ఉమామహేశ్వరుడిగా పూజలందుకుంటున్న శివయ్య
- అంతకంతకూ పెరుగుతున్న యాగంటి బసవయ్య
- కాకులు కానరాని క్షేత్రంగా ప్రసిద్ధి

పురాతన చరిత్ర ప్రకారం.. యాగంటి ఆలయ ప్రాంతాన్ని పల్లవులు, చోళులు, చాళుక్యులు, విజయనగర రాజులు పరిపాలించారు. యాగంటిలో ప్రధాన గోపురం ఐదు అంతస్తులు ఉంటుంది. 15వ శతాబ్దంలో హరిహర బుక్కరాయలు ఇక్కడి ఆలయాన్ని నిర్మించారు. ఈ గోపురాన్ని దాటగానే రంగమండపం, ముఖ మండపం, అంతరాలయం, గర్భాలయంలో లింగరూపంలో ఉన్న ఉమామహేశ్వరుల రూపాలు దర్శనమిస్తాయి. వాస్తవానికి ఇక్కడ అగస్త్య మహాముని వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని తలపెట్టాడని చెబుతారు. కానీ ప్రతిష్ఠ చేయాల్సిన చోట వేంకటేశ్వర స్వామి కాలి బొటనవేలు గోరు విరగడంతో ప్రతిష్ఠించలేదు. నిరాశకు లోనైన మునీశ్వరుడు శివుడి కోసం ఘోర తపస్సు చేశారు. శివుడు ప్రత్యక్షమై యాగంటి స్థలంలో కైలాసాన్ని పోలిన శివాలయాన్ని నిర్మించాలని ఆదేశించారు. ఎక్కడా లేని విధంగా ఈ క్షేత్రంలో ఉమామహేశ్వరులు ఏకశిలా రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఇక్కడ సహజసిద్ధంగా ఏర్పడిన గుహలు సైతం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఈ గుహలోనే వేంకటేశ్వరస్వామి కొలువుదీరారు. చరిత్ర ప్రకారం.. ఇక్కడ ఒక గుహలోనే కూర్చుని కాలజ్ఞాని శ్రీమత్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం రాశారని, శిష్యులకు కాలజ్ఞానం బోధించారని తెలుస్తోంది.


క్షేత్ర పరిధిలో ఎప్పటికీ నీటిమట్టం తగ్గని పుష్కరిణి

అబ్బురపరిచే అగస్త్య పుష్కరిణి

ప్రకృతి ఒడిలో పుట్టిన జలధానపర్వత సానువుల్లో నుంచి ప్రవహిస్తూ ఒక చిన్న నంది విగ్రహం నోటి నుంచి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణికి నీటిధార చేరుతుంది. ఈ నీటికి ఔషధగుణాలున్నాయని ప్రతీతి. ఇందులో స్నానమాచరిస్తే దీర్ఘకాల రోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. ఏడాది పొడవునా.. మండే ఎండలో అయినా, ముంచెత్తే వర్షంలోనైనా ఈ కోనేరులో నీరు ఒకే మట్టంలో ఉండటం ప్రత్యేకత.



అంతకంతకూ పెరుగుతున్న బసవయ్య

వీరబ్రహ్మేంద్రస్వామి తన కాలజ్ఞానంలో యాగంటి బసవయ్య గురించి ప్రస్తావించారు. 'యాగంటి బసవయ్య అంతకంతకూ పెరిగేను.. కలియుగాన యాగంటి బసవయ్య సజీవంగా వచ్చి రంకెలు వేసేను..' అంటూ కాలజ్ఞనంలో చెప్పినట్లు ఇక్కడి చరిత్ర ద్వారా తెలుస్తోంది. మొదట్లో ఈ విగ్రహం చిన్నగా ఉండేది. ప్రతి 20 సంవత్సరాలకు ఒక అంగుళం మేర విగ్రహం పెరుగుతోందని భారత పురావస్తు సర్వే సంస్థ కూడా నిర్ధారించింది. గతంలో విగ్రహం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసేవారు. నంది పరిమాణం పెరగడంతో ఆలయ సిబ్బంది ఇప్పటికే అక్కడ ఓ స్తంభాన్ని తొలగించారు. ఇప్పుడు నంది విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి అవకాశం లేదు.

ప్రకృతి రమణీయతకు నెలవైన ఎర్రమల కొండల నడుమ యాగంటి క్షేత్రం



కాకులకు ప్రవేశంలేని క్షేత్రం

ఎర్రమలలో ఓ గుహలో అగస్త్య మహాముని కఠోర తపస్సు చేస్తుండగా, భగ్నం చేసేందుకు కాకాసురుడు అనే రాక్షసుడు వేలాది కాకులను పంపించాడు. తపస్సు చెడగొట్టడానికి కాకాసురుడు ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్న అగస్త్యుడు యాగంటి పరిసర ప్రాంతాల్లో కాకులు సంచరించకూడదని శపించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్షేత్ర పరిధిలో కాకులు కనిపించకపోవడం గొప్ప విశేషం.

\- బనగానపల్లె, ఆంధ్రజ్యోతి

జగన్‌కు సూపర్ చెక్


- లిక్కర్ కేసులో ఉచ్చు బిగుస్తోంది
- వివేకా హత్య కేసులో జగన్మోహన్‌రెడ్డి, భారతి ముద్దాయిలు: బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిన కూటమి ప్రభుత్వం వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు సూపర్ చెక్ పెట్టబోతోందని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేశ్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్ ధన దాహానికి అడ్డూ అదుపు లేదు. మహా తల్లి భారతి 400 కిలోల బంగారం కొనుగోలు చేశారు. సారాయి అమ్మి, ఇసుక దోచి, మైనింగ్ తవ్వి నేలమాళిగల్లో దాచాడు. రాష్ట్రం సర్వ నాశనం అవ్వాలన్నదే ఆయన ఆలోచన. అధికారంలో ఉన్నప్పుడు ఏది అనుకుంటే అది చేశాడు. ధర్మాన్ని తప్పిన జగన్‌ను జనం ఛీ కొట్టేలా చేస్తాం. చంద్రబాబు అరెస్టు నుంచి ఎన్నెన్నో తప్పులు చేసి, చివరికి చెల్లెళ్ల దగ్గర కూడా చెల్లకుండా పోయాడు. ధర్మ సంస్కృతిని వదిలేసి విష సంస్కృతికి అలవాటు పడ్డాడు. కనకం, రాజరికం తప్ప రాష్ట్రం ఏమై పోయినా జగన్‌కు పట్టదు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు పునర్విచారణ జరగాల్సిందే. వాళ్లే చంపి మాపై అన్యాయంగా నింద వేశారు. వైఎస్ జగన్, భారతి ఇందులో ముద్దాయిలు. లిక్కర్ కేసులోనూ జగన్ తప్పించుకోలేరు" అని ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు.

రైతులపై జగన్ దండయాత్ర

- తుఫాను తగ్గిన వారం తర్వాత షో: బుద్దా వెంకన్న



విజయవాడ (వన్‌టౌన్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఓట్లు వేయలేదన్న అక్కసుతో పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి.. పరామర్శ పేరుతో వారిపై దండయాత్రకు వెళ్లాడని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. "కృష్ణా జిల్లాలో రైతుల పరామర్శ అంటూ వెళ్లి పూల వర్షం కురుపించుకున్న ఏకైక నాయకుడు జగన్ రెడ్డి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పొలాల్లోకి దిగి రైతులను పరామర్శించారు. జగన్ మాత్రం ప్రధాన మార్గంలో షో చేస్తూ.. రైతులను పరామర్శించారు. తుఫాన్ రావటానికి వారం రోజుల ముందే బెంగళూరు పారిపోయి, తుఫాన్ తగ్గిన వారం రోజుల తరువాత రాష్ట్రానికి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రైతులను పరామర్శించే హక్కు నైతికంగా కోల్పోయారు' అని మండిపడ్డారు. జగన్ ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు ఈసారి ఎన్నికల్లో ఇచ్చిన 11 సీట్లు కూడా లాక్కుంటారని హెచ్చరించారు. కాగా, విజయవాడ వరద సమయంలో జగన్ ప్రకటించిన కోటి రూపాయలు ఎవరికి ఇచ్చాడో సమాధానం చెప్పాలని బుద్దా ప్రశ్నించారు.

నీ ఇష్టమొచ్చిన గ్రామానికి రా..!

- ఈ క్రాప్ నమోదుపై జగన్‌కు మంత్రి అచ్చెన్న సవాల్

శ్రీకాకుళం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతు పేరు చెప్పడానికి కూడా జగన్ అర్హుడు కాదు. జగన్ ఏ గ్రామానికి వచ్చినా ఈ క్రాప్ అయిందో లేదో చూపిస్తా' అని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. శ్రీకాకుళంలో బుధవారం నిర్వహించిన డీఆర్సీ సమావేశం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. "ఈక్రాప్ నమోదుపై జగన్ అసృత ప్రచారం చేస్తున్నారు. దమ్ముంటే ఏగ్రామంలోకైనా రావాలి. ఆ గ్రామంలో ఈ క్రాప్ నమోదు అయిందో లేదో చూపిస్తా. జగన్‌కు సవాల్ విసురుతున్నా. వంద శాతం క్రాప్ నమోదు చేశాము. ఇందుకోసం ప్రభుత్వం యాప్‌కూడా తీసుకువచ్చింది. రైతుల ప్రయోజనం, సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది' అని మంత్రి స్పష్టం చేశారు.

పరుగో పరుగు

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీలు నిర్వహించారు. భోగాపురం, జగదాంబ సెంటర్, ఇబ్రహీంపట్నం, ఒంగోలు, నెల్లూరు, నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పది వేల రూపాయల నుంచి 75వేల వరకూ అనధికారిక నగదు లభించిందని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ తెలిపారు. అనధికారిక లావాదేవీలు, లంచాల రూపంలో ఈ సొమ్ము సేకరించినట్లు అనుమానిస్తోన్న ఏసీబీ అధికారులు....మరింత లోతుగా కూపీ లాగుతున్నారు.

బయటపడ్డ అక్రమాలు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏనీవేర్ రిజిస్ట్రేషన్‌లో ఎక్కువ అవకతవకలు జరుగుతున్నట్లు ఏసీబీ తాజా తనిఖీల్లో గుర్తించింది. కొన్నిచోట్ల నిషేధిత భూములను కలెక్టర్ అనుమతి లేకుండానే రిజిస్టర్ చేయడం, లంచాలు ఇవ్వని కొందరి ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలు యజమానులకు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడం, డాక్యుమెంట్లు సమగ్రంగా లేకపోవడం వంటి లోపాలను గుర్తించిన ఏసీబీ అధికారులు, నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేస్తున్నారు.

తనిఖీలు కొనసాగుతున్నాయి: ఏసీబీ డీజీ అతుల్ సింగ్

"సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై మాకు తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. వాటి ఆధారంగా పన్నెండు చోట్ల తనిఖీలు చేపట్టాం. రికార్డుల పరిశీలనలో తేడాలు గుర్తించాం. పలు పత్రాల ధ్రువీకరణ జరగాల్సి ఉంది. అన్నీ నిర్ధారించుకున్నాక పూర్తి వివరాలను వెల్లడిస్తాం. అవినీతిపై ప్రజలు ఆధారాలతో ఏసీబీకి ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం" అని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ తెలిపారు.

ఆళ్లగడ్డ, అన్నమయ్యలో డాక్యుమెంట్ రైటర్లు పరార్

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏసీబీ అధికారులు రావడంతోనే, అక్కడి ఆవరణలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు ల్యాప్‌టాప్, ప్రింటర్, ఇతర సామగ్రి, దస్తావేజులు అక్కడే పడేసి పరారయ్యారు. ఒక్క ఉద్యోగి వద్ద తప్ప అందరి వద్దా లెక్క చూపని నగదు లభించినట్లు ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసర్ చైతన్య రాయల్ నుంచి రూ.5,580, స్టాంప్ వెండర్ అనిల్ నుంచి రూ.8,060, సీనియర్ అసిస్టెంట్ చింతల షంషుద్దీన్ నుంచి రూ.17,040, డాక్యుమెంట్ రైటర్లు చాంద్‌బాషా నుంచి రూ2,180, విశ్వనాథ్‌రెడ్డి నుంచి రూ 17,480.. ఇలా మొత్తం రూ. 50,340 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

జగదాంబ సెంటర్ (విశాఖ): సబ్ రిజిస్ట్రార్ అధికారి వద్ద రూ.పది వేలు నగదు లభించినట్లు తెలిసింది. అలాగే.. పెదగంట్యాడ, మధురవాడల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా సోదాలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం (ఎన్టీఆర్ జిల్లా): సబ్ రిజిస్టర్ ఎస్కే మహమ్మద్ పక్కన ఉన్న బీరువాలో లెక్క చూపని రూ.74,600 బయటపడింది. వసూళ్ల కోసమే ఈ కార్యాలయంలో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు పని చేస్తున్నట్టు గుర్తించారు. ఏసీబీ జిల్లా డీఎస్పీ బీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు సాగాయి.

స్టోన్‌హౌస్‌పేట (నెల్లూరు): ఏసీబీ అధికారుల రాకతో కార్యాలయంలో ఉన్న దళారులు పరుగులుతీశారు. అధికారిని, సిబ్బందిని వేర్వేరుగా ప్రశ్నించారు. కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

భోగాపురం (విజయనగరం): ఎయిర్‌పోర్టు వచ్చాక చుట్టుపక్కల భూములకు సంబంధించి అధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీంతో ఏసీబీ డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో ఇక్కడ సోదాలు నిర్వహించారు. కార్యాలయ తలుపులు మూసి అక్కడున్నవారందరి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని...క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు.

నరసరావుపేట (పల్నాడు): మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన తనిఖీలు రాత్రి 8గంటల వరకు సాగాయి. లెక్కల్లో చూపని రూ.35వేల నగదుతోపాటు పలు రికార్డులు స్వాధీనంచేసుకున్నట్లు ఏసీబీ ఏఎస్పీ మహేంద్రమాతే తెలిపారు.

చిలమత్తూరు (శ్రీసత్యసాయి): ఏసీబీ అధికారులు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కార్యాలయంలోకి ప్రవేశించి తలుపులు మూసేశారు. సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఇతర ఉద్యోగుల నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని విస్తృతంగా సోదాలు జరిపారు. కొంత నగదు పట్టుబడినట్లు తెలిసింది.

రేణిగుంట (తిరుపతి): కార్యాలయ స్వీపర్ నుంచి ఏసీబీ అధికారులు రూ.6,500 స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ ఫోన్లు, ఓ బ్యాగుతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు మురళీమోహన్ బయటకు పోవడాన్ని గమనించారు. ఆయన ఆ బ్యాగును డాక్యుమెంట్ రైటర్ వద్ద పెట్టడం గమనించి దానిని స్వాధీనం చేసుకున్నారు. అందులోని ఫైళ్లను పరిశీలించారు.

రాజంపేట (అన్నమయ్య): కార్యాలయంలో అనధికారికంగా పనిచేస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఏసీబీ అధికారులను చూడగానే కార్యాలయ ప్రాంగణంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు పరారయ్యారు. సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు సెలవులో ఉన్నారు.

'ఒంగోలు'లో డబ్బులు విసిరేసి.. వాష్‌రూమ్‌లో దాచి..

ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ మొదటి అంతస్థులోని జాయింట్ -1, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు జరిగాయి. ఈ క్రమంలో కొంతమంది మొదటి అంతస్తు నుంచి కిందకు నగదు విసిరేసారు. ఆ మొత్తం రూ.30వేలు దాకా ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. జనరల్ వాష్‌రూంలో మరో రూ.18వేలు వారు కనుగొన్నారు. ఇలా మొత్తం రూ.48వేలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికి కార్యాలయంలో పూర్తి అయిన 36 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల వివరాలు.. వాటికి సంబంధించిన లావాదేవీలు, నగదును కిందికి విసిరింది ఎవరు... వాష్ రూంలో ఉన్న నగదు ఎవరిది.. ఎందుకు దాచారు... అన్న కోణాల్లో రాత్రి పొద్దుపోయే వరకూ విచారించారు.

మెరుపుదాడుల వెనుక మర్మం?!

- కొన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో లంచం చిన్నమాట... అంతకుమించిన అక్రమాలు
- సస్పెన్షన్ వేటు పడకుండా భారీగా బేరాలు
- కోటి సమర్పించుకున్న ఓ సబ్ రిజిస్ట్రార్
- భారీ సెటిల్‌మెంట్ చేసిన ఓ ఉన్నతాధికారి
- సర్కార్ సీరియస్.. ఏసీబీతో సోదాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్ శాఖలో అసలేం జరుగుతోంది?... ఒకటో, రెండో కాదు...ఏకంగా 12 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులపై ఏకకాలంలో ఏసీబీ మెరుపుదాడులు చేయడంతో... ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో ఇదే ప్రధాన చర్చగా మారింది. రిజిస్ట్రేషన్లలో ప్రతి డాక్యుమెంట్‌కూ ఇంత మొత్తం అని ధరను నిర్ణయించి వసూలు చేస్తుంటారు. ఇది అందరికీ తెలిసిన లంచాల వ్యవహారమే. అరికట్టలేని, పూర్తిస్థాయిలో నిర్మూలించలేని జాడ్యంగా ఇది చాపకింద నీరులా సాగిపోతోంది. కానీ, అంతకు మించిన అవినీతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతుందన్న సంకేతాలు ప్రభుత్వానికి అందాయి. కొందరు అధికారుల విశృంఖల అవినీతి వ్యవహారాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. దీంతో బుధవారం భారీ ఎత్తున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ విరుచుకుపడింది. నిజానికి ఏసీబీ విభాగం ముఖ్యమంత్రి నియంత్రణలో ఉంది. సీఎం ఆదేశాలతోనే ఈ ఆకస్మిక దాడులు జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంతలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వెనుక కారణమేమై ఉంటుందన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అదో హాట్ సీటు...

రిజిస్ట్రేషన్ శాఖలో ఓ ఉన్నతస్థాయి అధికారి తీరుపై ఇటీవల తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ప్రభుత్వం పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. అయితే, రాయలసీమలో ప్రముఖ పుణ్యక్షేత్ర జిల్లా పరిధిలోని ఓ సబ్‌రిజిస్ట్రార్ వ్యవహారంలో అమరావతి స్థాయిలో ఈయన పెద్ద పంచాయతీ నడిపి, భారీ డీల్‌ను సెటిల్ చేసినట్లుగా తెలిసింది. నిజానికి ఆ సబ్‌రిజిస్ట్రార్‌పై లేని ఆరోపణ, విమర్శలంటూ లేవు. సస్పెన్షన్ ఆ అధికారికి కొత్తకాదు. బదిలీ కూడా కొత్త కాదు. కానీ, ప్రభుత్వంలో ఎవరు ఉన్నా, అధికారం ఎవరిదయినా సరే... ఆయన ఆ కార్యాలయంలోనే పని చేస్తుంటారు. అలా పనిచేయాలన్నదే ఆయన లక్ష్యం. ఇందుకు ఆయన ఎంతయినా ఖర్చు పెడతుంటారు. ఎంతకయినా తెగిస్తారు. ఈ విషయంలో చివరకు చిరుద్యోగులతో కూడా భౌతిక ఘర్షణలకు దిగే మనస్తత్వం ఆయనది. ఇటీవలి కాలంలో వాటాల పంపకంలో తేడాలొచ్చాయని ఓ చిరుద్యోగితో ఆయన ఘర్షణపడ్డారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందగా, దానిపై విచారణ చేయించింది. సబ్ రిజిస్ట్రార్‌తోపాటు, చిరుద్యోగిపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని విచారణాధికారి... ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. డిసిప్లినరీ కేసులను వాడుకుని సొమ్ములు పిండుకోవడానికి అలవాటు పడ్డ ఆ ఉన్నతాధికారి సెటిల్‌మెంట్‌కు దిగారు. సస్పెన్షన్‌కు గురికావాల్సిన సబ్‌రిజిస్ట్రార్‌ను పిలిచి బేరం మాట్లాడుకున్నారని తెలిసింది. తొలుత రెండు కోట్లకు అనుకున్నది రూ.1.5కోట్లకు..చివరకు రూ.కోటికి సెటిల్ అయినట్లు, చెల్లింపులూ జరిపినట్టు తెలిసింది. దీంతో ఆ అధికారిపై క్రమశిక్షణా చర్యలను అటకెక్కించారు. ఆ సబ్‌రిజిస్ట్రార్‌తో గొడవపడ్డ చిరుద్యోగిపై సస్పెండ్‌కు సిఫారసు చేసినట్లు తెలిసింది. ఈ పరిణామం అటు తిరిగి, ఇటు తిరిగి ప్రభుత్వ పెద్దలకు చేరింది. నిఘా విభాగాన్ని రంగంలోకి దింపి ఆ అధికారి జాతకాన్ని తెప్పించుకున్నారు. ఇదే సమయంలో ఇలాంటి సెటిల్‌మెంట్ పనులకు క్యూలో ఉన్న మరికొందరి చిట్టా బయటపడింది. విషయం సీరియస్‌గా ఉండటంతో ప్రభుత్వం ఏసీబీని రంగంలోకి దింపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, రిజిస్ట్రేషన్ శాఖలోని ఓ ఉన్నతాధికారి ఇటీవలికాలంలో 16 జిల్లాల్లోని 34 ఆఫీసులకు భారీటార్గెట్‌లు పెట్టినట్లుగా ఫిర్యాదులొచ్చాయి. బుధవారం ఏసీబీ తనిఖీలు జరిగిన ఆఫీసులు కొన్ని ఇందులో ఉన్నాయి.

చర్యలు తప్పవు: అనగాని సత్యప్రసాద్

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. తప్పుచేసిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. "అధికారులు తప్పులు చేస్తున్నారని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై మేం అనేక చర్యలు తీసుకున్నాం. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. అందుకే ఏసీబీ తనిఖీలు జరుగుతున్నాయి. ఇది పారదర్శకమైన మా పనితీరుకు నిదర్శనం. ఎక్కడైనా తప్పు జరుగుతుందంటే వెంటనే విచారణ చేయించి చర్యలు తీసుకుంటున్నాం. అవినీతి అధికారులను ఉపేక్షించం" అని మంత్రి స్పష్టంచేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.